



శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నేడు టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం 03

జంతర్‌మంతర్‌కు రైతుల పాదయాత్ర
హర్యానా – పంజాబ్ సరిహద్దు మూసివేత 07

టిఎంసి నేత ఆత్మహత్య



సంపుటి 09, సంచిక: 258 | సోమవారం | 17-08-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




మోదీ హింసాత్మక పాలనకు

## ఎదురు నిలిచిన యువత

- విద్యార్థినుల ధైర్యం అభినందనీయం
- శాంతి, ప్రేమ, హాస్యంతో తమ గళాన్ని వినిపించారు
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హింసాత్మక పాలనకు వ్యతిరేకంగా భారతీయ యువత ప్రదర్శించిన ధైర్యం అభినందనీయమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిజెపి గుండాల చేతిలో అసభ్య ప్రవర్తన, దూషణలు, హింసను ఎదుర్కొన్న యువతులను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో నిరసన చేపట్టిన విద్యార్థులతో రాహుల్ గాంధీ జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. జులై 20న జరిగిన నిరసనల సమయంలో వీరు పోలీసుల అరాచకాలను ఎదుర్కొన్నారు. తమ గళాన్ని వినిపించిన తర్వాత పోలీసులు ప్రదర్శించిన క్రూరత్వం, వేధింపుల గురించి విద్యార్థులు చెప్పిన అనుభవాలను రాహుల్ గాంధీ సావధానంగా విన్నారు. ఈ నెల ప్రారంభంలో రాహుల్, తరువాయి 12లో






## సెప్టెంబర్‌లో అసెంబ్లీ పెడుతున్నాం..

# అభివృద్ధిపై చర్చిద్దాం రా..

### మాజీ సిఎం కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్

- గత పదేళ్లలో చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు ఏటా రూ.70వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం
- ప్రభుత్వ శాఖల్లో విడతల వారీగా ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తున్నాం
- మాయమాటలు నమ్మి యువత మోసపోవద్దు
- పోటీ పరీక్షలకు సన్నద్ధం కండి
- పరకాలలో 'ప్రజాపాలన - ప్రగతిబాట' బహిరంగసభలో సిఎం ఉద్ఘాటన

ప్రజాపక్షం/పరకాల

'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలలో చర్చిద్దాం అసెంబ్లీకి రావాలి' అని మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా ములుగు నుంచి హనుమకొండ వచ్చిన రేవంత్ రెడ్డి, పరకాలలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పరకాలలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన–ప్రగతి బాట' బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సభాధ్యక్షత వహించారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని, రెండున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సెప్టెంబర్‌లో జరిగే అసెంబ్లీ సమావేశాలలో చర్చిద్దామని, సమావేశాలకు రావాలని బహిరంగంగా సవాల్ విసిరారు. పదేళ్లలో చేసిన ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులకు వడ్డీగా ప్రతి ఏడాది రూ.75 వేల కోట్లు చెల్లిస్తున్నామన్నారు. కెసిఆర్ తరువాయి 8లో



ములుగులో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### రూ.16వేల కోట్లతో 2,145 గ్రామీణ రోడ్ల నిర్మాణం

రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో మేడారం సమ్మక్క – సారలమ్మ ఆలయం 03



## ఎల్‌పిజి ఉత్పత్తి పెంచండి..

చమురు కంపెనీలకు టార్గెట్ విధించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో ఎల్‌పిజి గ్యాస్ కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. గృహ, ఎల్‌పిజి వాణిజ్య సిలిండర్లు లభించడం కష్టమైపోయింది. బ్లాక్ మార్కెట్‌లో డబుల్, ట్రిపుల్ రేట్లు పెట్టి కొనాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎల్‌పిజి ఉత్పత్తి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు దేశంలోని చమురు ఉత్పత్తి, రిఫైనరీ సంస్థలకు ఈ నెల 13న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎల్‌పిజి ఉత్పత్తి పెంచాలని ఆదేశించింది. రోజుకు 63,810 టన్నుల ఉత్పత్తి చేయాలని దేశంలోని 21 రిఫైనరీలను ఆదేశించింది. గత మార్చితో ముగిసిన 2026 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎల్‌పిజి ఉత్పత్తికి ఇది రెట్టింపుకంటే ఎక్కువ. అలాగే, ప్రస్తుతం దేశంలో ఒక రోజు వినియోగమవుతున్న గ్యాస్‌లో 70 శాతం. అయితే, ఇది ఇప్పటికిప్పుడే సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రస్తుతం విదేశాల నుంచి చమురు సరఫరా తగినంతగా లేకపోవడే ఇందుకు కారణం. కొద్ది రోజులుగా హార్మూజ్ జలసంధి మూసి ఉండటంతో గల్ఫ్ దేశాల నుంచి వచ్చే ముడి చమురు భారీగా తగ్గింది. ఈ నేపథ్యంలో తగినంత చమురు దిగుమతి జరిగితే, రిఫైనరీ కంపెనీలు ఈ టార్గెట్‌ను తరువాయి 12లో

## పెట్రోల్, డీజిల్ ఆటోలు

# ఇక ఇ.వి.లు

- 'తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకాన్ని రూపొందిస్తున్న ప్రభుత్వం
- 18,766 పాత పెట్రోల్, డీజిల్ ఆటోలకు ప్రయోజనం
- రూ.1.50 లక్షల వరకు సాయం : మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలో పెట్రోల్, డీజిల్ ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ మార్పిడి పథకం2026'ను రూపొందిస్తోంది. తెలంగాణ రైజింగ్ విజన్2047కు అనుగుణంగా రూపొందించిన ఈ పథకానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్యూర్ పరిధిలోని 18,766 అర్హత కలిగిన ఆటోలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆటోను ఎలక్ట్రిక్‌గా మార్చుకునే వారికి ఎఐఎస్123 ఆమోదిత కిట్, ఇన్‌స్టాలేషన్, ఫిట్‌మెంట్ ఖర్చుల కోసం గరిష్ఠంగా రూ.1.50 లక్షలు లేదా వాస్తవ వ్యయం ఏది తక్కువైతే అంత మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఫిక్స్డ్ బ్యాటరీ లేదా స్వాపబుల్ బ్యాటరీ కిట్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పాత పెట్రోల్ లేదా డీజిల్ ఆటోను పూర్తిగా అప్పగించి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసేవారికి కూడా రూ.1.50 లక్షల స్థిర సబ్సిడీ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపానెల్ చేసిన డీలర్లు వాహనం తుది ఆన్‌రోడ్ ధరలోనే సబ్సిడీని ముందుగా తగ్గించి వాహనాన్ని అందజేస్తారని తెలిపారు. క్యూర్ ప్రాంతంలో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్‌తో ఉన్న 18,766 ఆటోలు పథకం పరిధిలోకి రానున్నాయని, తరువాయి 8లో

## రైల్వేస్టేషన్ల తాగునీటిలో..

# 'ఇ–కోలి' బ్యాక్టీరియా !

- ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు శూన్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా రైల్వే చర్యలు
- 'కాగ్' నివేదికలో విస్తుపోయే విషయాలు
- ఫుడ్‌పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ ఫెయిల్యూర్స్‌కు దారితీస్తున్నాయని హెచ్చరిక



**న్యూఢిల్లీ :** అతిపెద్ద రవాణా వ్యవస్థ అయిన రైల్వే శాఖ ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు శూన్యం అని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడేలా నిర్లక్ష్యపూరితంగా ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తేల్చి చెప్పింది.పలు రైల్లే స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన తాగునీటి నమూనాలలో ఇ.కోలి బ్యాక్టీరియాను గుర్తించినట్లు కాగ్ వెల్లడించింది. రైల్వే మరుగుదొడ్లలోనూ అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులు ఉన్నట్లు గుర్తించామని ఆడిటర్ చెప్పారు.అన్ని జోన్‌లలోని 512 నాన్–సబర్బన్ గ్రేడ్ స్టేషన్‌లలో ప్రయాణికుల సేవలను అధ్యయనం చేసిన నివేదిక ప్రకారం...ఎస్ఆర్ (సదరన్ రైల్వే)లోని రెండు స్టేషన్లలో (కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు), ఎస్‌ఆర్ (సౌత్ సెంట్రల్ రైల్వే)లోని ఒక స్టేషన్‌లో (హైదరాబాద్), సిఆర్ (సెంట్రల్ రైల్వే) లోని 4స్టేషన్లలో (ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్, భివాండి రోడ్, కల్యాణ్, లొనావాలా), ఈఆర్ (ఈస్టర్న్ రైల్వే)లోని ఒక స్టేషన్ (మధుపూర్)లో వాటర్ నుంచి సేకరించిన నీటి నమూనాలలో ఇ.కోలి పాజిటివ్‌గా తేలింది.'2022–23లో 8 జోన్‌లలోని 49 స్టేషన్లలో, 2023–24లోని 9 జోన్లలోని 56 స్టేషన్లలోని ఫ్లాట్ ఫారమ్‌లలోని కుళాయిల నుంచి సేకరించిన తాగునీటి నమూనాల పరీక్షా ఫలితాలు టోటల్ కోలిఫార్మ్స్ బాక్టీరియా (ఇ–కోలి సహా) ఉన్నట్లు సూచించాయి' అని కాగ్ నివేదిక పేర్కొంది.ఇ.కోలి బ్యాక్టీరియాలోని కొన్ని రకాలు ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ ఫెయిల్యూర్స్‌కు దారితీయగలవని తెలియజేసింది.ఆడిట్ ప్రకారం..2022–23లో 4జోన్లలోని 8స్టేషన్‌లలో, 2023–24లో 5 జోన్లలోని 11స్టేషన్‌లలో, మొత్తం కోలిఫామ్‌లు మినహా ఇతర బాక్టీరియాలజికల్ పరీక్షలు అసంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించింది. 2019–20 నుంచి 2023–24వరకు జరిపిన టెస్ట్ ఆడిట్ సమయంలో తరువాయి 8లో

## ఆహారం, మందుల నాణ్యతకు

# టిజి సేఫ్ ఏర్పాటు

- ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ ఒక్కటిగా విలీనం
- టిజి సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆహార పదార్థాల విక్రయాలు, నాణత్యలేని మందులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్,డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌ను ఒక డిపార్ట్‌మెంట్‌గా విలీనం చేసింది. ఈ రెండు డిపార్ట్‌మెంట్లను కలిపి ఇక నుంచి 'టిజి సేఫ్'(తెలంగాణ స్టాండార్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్సీయల్ డ్రగ్స్) పేరుతో ఉమ్మడి పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసింది. టిజి సేఫ్ 'ఆగస్టు15' నుంచి అమలులోనికి వచ్చినట్టు వైద్య ఆరోగ్య శాఖ సోమవారం వెల్లడించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తరువాయి 12లో

# ఎవరి దారి వారిదే!

- సాంకేతిక యుగంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాలు
- దూరమవుతున్న అనుబంధాలు..
- ఆనాటి పలుకరింపులు కరువు
- ఇంట్లో నలుగురు.. చేతుల్లో ఎనిమిది మొబైల్ ఫోన్లు
- పక్కనే ఉన్న వారితో మాట్లాడేందుకు సమయం లేని పరిస్థితి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఒకప్పుడు ఉదయం లేవగానే ఇంట్లో పెద్దలకు నమస్కారం.. ఇరుగుపొరుగు వారిని పలకరించడం.. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించడం.. పండుగలు, శుభకార్యాల్లో బంధుమిత్రులతో కలసి సందడి చేయడం సాధారణంగా ఉండేది. కాలం మారింది, సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమయ్యాయి. దీంతో మనుషులు దగ్గరగా ఉన్నా.. మనసులు మాత్రం దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. నేటి పరిస్థితుల్లో ఒకే ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే వారి చేతుల్లో నాలుగు కాదు.. ఒక్కక్కరి వద్ద రెండు చొప్పున ఎనిమిది మొబైల్ ఫోన్లు కనిపిస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్ వినియోగం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు ఒకే చోట కూర్చున్నా తరువాయి 8లో

బిఇడి ప్రవేశాలకు

## తొలివిడత సీట్ల కేటాయింపు

కన్వీనర్ కోటా కింద అందుబాటులో 13,965 సీట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడి కోర్సు ప్రవేశాలకు మొదటి విడత సీట్లను కేటాయించినట్టు టిజి ఎడ్ సెట్ ప్రవేశాల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండు రంగా రెడ్డి తెలిపారు. కన్వీనర్ కోటా కింద మొత్తం 13,965 సీట్లు అందుబాటులో ఉండగా, 15,009 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకున్నారు. ఇందులో మెరిట్,రిజర్వేషన్ల ఆధారంగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో 9,407 మందికి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు నిర్దేశిత ఫీజును క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు లేదా తరువాయి 8లో

# ఎల్లలు లేని ఆలోచనలు.. కాలాతీత రచనలు..

సాహితీ ప్రపంచంలో 'కొకు'గా సుపరిచితుడైన కొడవటిగంటి కుటుంబరావు గురించి రాయాలంటే ముందుగా, ఆయనను ఏ ఒక్క గీటురాయితో కొలవలేమనే విషయాన్ని అంగీకరించి తీరాలి. కథకుడు అని పిలిస్తే వ్యాసకర్తను వదిలేసినట్టే. మార్క్సిస్టు అని ముద్రేస్తే హేతువాదిని కుదించినట్టే. సంపాదకుడు అని గిరిగీస్తే ఆయన సృజనాత్మక విస్తృతిని కప్పిపుచ్చినట్టే. తెనాలిలో 1909 అక్టోబర్ 28న పుట్టిన కుటుంబరావు తన ఎనిమిది దశాబ్దాల జీవితంలో సాహిత్యాన్ని ఒక ఆయుధంగా, ఒక కంటి చూపుగా, సమాజాన్ని ఛేదించే పరికరంగా వాడుకున్నాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో, మేనమామ ఇంట పెరిగాడు. గుంటూరులో ఇంటర్ చదివి, విజయనగరం మహారాజా కళాశాలలో భౌతికశాస్త్రం అభ్యసించి, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువుల వైపు అడుగులేశాడు. డబ్బు లేమి ఆ చదువును మధ్యలోనే ఆపేసింది. కానీ, 'ప్రతి విషయాన్ని ఆధారంతో నిరూపించాలి, ప్రతి నమ్మకాన్ని ప్రశ్నించాలి' అని భౌతికశాస్త్రం నేర్పిన ఒక పాఠం మాత్రం ఆయనతోనే ఉండిపోయింది. ఈ శాస్త్రీయ అవగాహనే ఆయన తర్వాత సమాజాన్ని చదవడానికి ఉపయోగపడింది. కుటుంబరావు రచనలు తెరిస్తే మొదట తగిలేది ఒక ఆలోచనాత్మక చురుకుదనం. ఒక ఆచారం ఎందుకు మొదలైంది? దాని లబ్ధి ఎవరికి దక్కుతోంది? ఇంట్లో మగవాడికి ఉన్న స్వేచ్ఛ ఆడదానికి ఎందుకు లేదు? పేదరికాన్ని వ్యక్తి తప్పుగా చూపించే ధోరణి వెనుక ఏముంది? ఇలాంటి ప్రశ్నలు ఆయన కథల్లో, నవలల్లో పదేపదే తలెత్తుతాయి. కానీ కుటుంబరావు ఈ ప్రశ్నలను వేసి ఊరుకోడు. వాటి వెనుక దాగిన సామాజిక సంబంధాలను తవ్వి తీస్తాడు. మనిషి ప్రవర్తనను వ్యక్తిగత గుణంతో కాక, అతని కుటుంబం, ఆర్థిక స్థితి, కులం, వర్గం, రాజకీయ వాతావరణంతో ముడిపెట్టి చూస్తాడు. ఈ కోణమే కుటుంబరావు సాహిత్యానికి ఒక సామాజిక పరిశోధనా స్థాయిని, వివరణల్లో లోతును తెచ్చిపెట్టింది. 1930ల నుంచి 1980ల దాకా సాగిన ఆయన రచనా ప్రస్థానం ఎన్నో సిద్ధాంతాలను చూసింది. వాదనలను విన్నది. సరికొత్త ప్రక్రియలను, విచిత్ర పోకడలను గమనించింది. స్వాతంత్ర్యం రాకముందు పరిస్థితులు, వచ్చిన ఆరంభంలో అంచనాలు, ఆ తర్వాత సమాజం కొనసాగుతున్న తీరుతెన్నులను కుటుంబరావు కళ్లారా చూశాడు. తన రచనల్లో పొదిగాడు. అందుకే ఆయన కథలు చదివితే అధికారిక చరిత్ర పుస్తకాల్లో దొరకని ఆనాటి కుటుంబాల, ఉద్యోగుల, నిరుద్యోగుల, స్త్రీల మనోలోకం కళ్లముందు కదలాడుతుంది. దుర్మార్గపు కట్టుబాట్లు, ఆలోచనా విధానాలు ఆవిష్కృతమవుతాయి.

రచయితగా కుటుంబరావు ఒక ప్రక్రియకు, ఒక సిద్ధాంతానికి, ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు. మనిషి జీవించే సమాజాన్ని దాని అంతర్గత సంబంధాలతో సహా అర్థం చేసుకోవడానికి సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించాడు. అందుకే, ఆయనది ఎల్లలు లేని సృజం.. కాలాతీత రచన. ఆయన రచనల్లో ఎన్నో ప్రశ్నలు పాఠకుడి మస్తిష్కంలోకి చొచ్చుకెళ్లి, ఆలోచింపచేస్తాయి. ఇక్కడే కుటుంబరావును సాధారణ సామాజిక రచయిత నుంచి వేరు చేయాలి. ఆయన సమాజంలోని సమస్యలను కేవలం నమోదు చేయలేదు. వాటి వెనుక పనిచేసే సంబంధాలను అన్వేషించాడు. మనిషి ప్రవర్తనను అతని వ్యక్తిగత స్వభావంతో మాత్రమే వివరించకుండా, అతను నివసించే కుటుంబం, వృత్తి, ఆర్థిక పరిస్థితి, వర్గ స్థానం, కుల సంబంధం, లింగ సంబంధం, రాజకీయ వాతావరణం వంటి అంశాలతో కలిపి చూశాడు. ఈ దృక్పథం ఆయన సాహిత్యానికి సామాజిక శాస్త్ర సంబంధమైన లోతును ఇచ్చింది. కుటుంబరావు సామాన్యుల జీవితాలను తరచిచూశాడు. శ్రామికుడి వేదన విన్నాడు. కష్టజీవి కన్నీళ్లకు కలత చెందాడు. మసిళల సమస్యపై స్పందించాడు. ఎంతో గంభీరమైన, కీలకమైన అంశాలను ఎంత లోతుగా విశ్లేషించి రచనలు చేశాడో, అదే స్థాయిలో 'చందమామ' కోసం కథలు రాసి, బాల సాహిత్య రథసారథి అయ్యాడు. సాహిత్యాన్ని జీవితంతో, జీవితాన్ని సామాజిక నిర్మాణంతో, సామాజిక నిర్మాణాన్ని ఆర్థికరాజకీయ సంబంధాలతో అనుసంధానించడం కుటుంబరావు ప్రత్యేకత. తెలుగు సాహిత్య చరిత్రను సామాజిక పరిణామాల చరిత్రతో కలిపి చదివితే కొడవటిగంటి కుటుంబరావు స్థానం ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుంది.



సాహిత్యాన్ని జీవితానికి దూరంగా ఉంచి సౌందర్యాన్వేషణగా మాత్రమే చూడటాన్ని ఆయన అంగీకరించలేదు. మనిషి జీవించే భౌతిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక అసమానతలు, లింగ సంబంధాలు, రాజకీయ అధికార నిర్మాణాలు, మూఢనమ్మకాలు, మధ్యతరగతి

> కుటుంబరావు సాహిత్యాన్ని ప్రస్తావించేటప్పుడు, ఒకటో రెండో లేదా కొన్ని రచనలను మాత్రమే ప్రత్యేకంగా పేర్కొనడం అసాధ్యం. ఆయన రచనల్లో ప్రతి ఒక్కటీ ఒక మేలిమి రత్నంలా తనదైన ప్రత్యేకతను కలిగి చాటుకుంటుంది. అది కథ కావచ్చు.. నవల కావచ్చు.. నాటకం కావచ్చు... లేదా వ్యాసం కావచ్చు.. రచనా ప్రక్రియ ఏదైనప్పటికీ, ఆయన ముద్ర స్పష్టంగా ఉంటుంది. అయితే, ప్రతి సృజనలోనూ 'మనిషిని ఆలోచింపచేయడం' అనే అంతర్లీన లక్ష్యం కనిపిస్తుంది. కుటుంబరావును రచయిత మాత్రమే అనే పరిధికి కుదించడం సాధ్యం కాదు. ఎందుకంటే, ఆయన ఒక హేతువాది. తాత్వికుడు, సంఘ సంస్కర్త. సంప్రదాయాలను గుడ్డిగా అనుసరించకుండా వాటి వెనుక ఉన్న కారణాలను పరిశీలించాలనే శాస్త్రీయ దృష్టిని ఆయన రచనలు పెంపొందిస్తాయి. సమాజంలోని కుల వివక్ష, అసమానత, మూఢనమ్మకాలు, దోపిడీ, లింగ వివక్ష వంటి సమస్యలను చిత్రీకరించడంతో ఆగకుండా, వాటి మూలాలను ప్రశ్నించేలా పాఠకుడిని నడిపిస్తాడు. మానవీయతే ఆయన సాహిత్యానికి ప్రాణం. మనిషి గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, వివేకం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ప్రతి రచనలోనూ ప్రతిధ్వనిస్తుంది. అందుకే కుటుంబరావు సాహిత్యం ఒక కాలానికి, కొన్ని రచనలకు పరిమితం కాదు. సమాజం తనను తాను ప్రశ్నించుకునేంతకాలం ఆయన రచనలు సజీవంగా ఉంటాయి.

మానసికత వంటివన్నీ సాహిత్యానికి వస్తువులేనని ఆయన తన సుదీర్ఘ రచనా జీవితంతో నిరూపించారు. మార్క్సిస్టు ఆలోచనల పరిచయం ఆయన ప్రపంచ దృష్టిని మరింత పదును పెట్టింది. భౌతిక వాస్తవాల ను, వర్గ సంబంధాలను, ఉత్పత్తి వ్యవస్థను, ఆస్తి సంబంధాలను పరిశీలించే దృష్టి ఆయనకు లభించింది. అందుకే ఆయన మార్క్సిజాన్ని రాజకీయ నినాదాలుగా కాకుండా సమాజాన్ని విశ్లేషించే శాస్త్రీయ పద్ధతిగా స్వీకరించారు. 1942లో ఏర్పడిన అభ్యుదయ రచయితల సంఘం ఆయనకు సహజమైన మేధో వేదికగా మారింది. తరువాత 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘంతోనూ ఆయన అనుబంధం కొనసాగింది. సమాజాన్ని, మనుషులను లోతుగా పరిశీలించే కుటుంబరావు సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆయనకు 'మనిషి' అనే పదానికి ఉన్న అర్థాన్ని అర్థం చేసుకోవాలి.

> పిల్లల మాసపత్రిక 'చందమామ' మాసపత్రికతో కుటుంబరావు అనుబంధం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ పత్రికతతో ఆయన మమేకమయ్యారు. ఈ బాధ్యతలను ఆయన మిగతా రచనల నుంచి, సాహితీ సృష్టి నుంచి విడదీసి చూడాలి. ఎందుకంటే, ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒకవైపు మార్క్సిస్టు సామాజిక విశ్లేషణ, హేతువాదం, రాజకీయ-సాంస్కృతిక విమర్శ.. మరో-వైపు పిల్లల పత్రిక సంపాదకత్వం. ఈ రెండు ప్రపంచాల మధ్య ఆయన ఎలాంటి కృత్రిమ గోడను నిర్మించలేదు. పిల్లల పఠన ప్రపంచంలో కథ, ఊహ, చరిత్ర, విజ్ఞానం, భాషలను సమన్వయపరిచే సంపాదక దృష్టిని అభివృద్ధి చేశారు. అదే సమయంలో తన విస్తృత మేధో ప్రపంచాన్ని ప్రజా పఠన సంస్కృతితో అనుసంధానిం చారు. ఇది కుటుంబరావు బహుముఖ ప్రతిభకు, మొక్కవోని దీక్షకు నిదర్శనం.


ఆయన దృష్టిలో మనిషి ఒంటరిగా ఉండే మానసిక జీవి కాదు. కుటుంబంలో, వృత్తిలో, మార్కెట్‌లో, కులవర్గ సంబంధాల్లో, లింగ సంబంధాల్లో, రాజకీయ వ్యవస్థలో జీవించే సామాజిక జీవి. అతని కోరికలను, భయాలను, ప్రేమను, ద్వేషాన్ని, నైతికతను, స్వార్థాన్ని, ఉదాత్తతను ఆ సామాజిక పరిస్థితుల నుంచి విడదీయలేం. ఈ దృక్పథమే ఆయన కథలకు ప్రత్యేకమైన లోతును ఇచ్చింది. పరిసర పరిస్థితుల ప్రభావాలే ఆయనను మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతినిధిగా మార్చాయి. అందుకే ఆయన సృజనాత్మక ప్రపంచానికి మధ్యతరగతి జీవితం కేంద్రమైంది. సమాజంలో విస్తరిస్తున్న మధ్యతరగతి ఆధునిక విద్య, ఉద్యోగం, కుటుంబం, సంప్రదాయం, ఆర్థిక ఆశ లు, సామాజిక ప్రతిష్ఠ మధ్య చిక్కుకున్న వర్గం. ఒకవైపు ఆధునికతను కోరుకుంటుంది. మరోవైపు పాత విలువలను పట్టుకుంటుంది. సమానత్వాన్ని మాటల్లో సమర్థిస్తుంది. ఇంట్లో కులం, లింగం, ఆస్తి ఆధారిత అధికారాన్ని కొనసాగిస్తుంది. విద్యను కోరుకుంటుంది. అదే సమయంలో ఆ విద్యను విమర్శనాత్మక ఆలోచనకు కాకుండా ఉద్యో గం, స్థాయి, భద్రత కోసం ఉపయోగిస్తుంది. ఈ వైరుధ్యాలను కుటుంబరావు ఎక్కడా దాచలేదు. ముసుగు వేయలేదు. మధ్యతరగతిని పొగడలేదు. తక్కువ చేసి చూడలేదు. దాని అంతర్గత చలనాన్ని శాస్త్రీయంగా విశ్లేషించారు. మధ్యతరగతిలో చైతన్యం పెరిగితే సమాజ మార్పుకు అది ఒక శక్తిగా మారగలదని బలంగా నమ్మారు. అదే సమయంలో అది తన సౌకర్యాలను కాపాడుకోవడానికి ఆధిపత్య వర్గాల భావజాలాన్ని స్వీకరిస్తే మార్పుకు అడ్డంకిగా మారుతుందని కూడా చూపించారు. ఈ ద్వం ద్వాన్ని అర్థం చేసుకోవడమే కుటుంబరావు సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి కీలకం. తెలుగు కథను కేవలం సంఘటన చెప్పే ప్రక్రియగా కాకుండా సామాజిక చైతన్యాన్ని మేల్కొలిపే సాధనంగా కుటుంబరావు చూశారు. అందువల్ల ఆయన కథల్లో పాత్రల వ్యక్తిగత సమస్యలు కూడా విస్తృతమైన సామాజిక ప్రశ్నలతో ముడిపడి ఉం టాయి. సమాజంలోని విలువలు, ఆధిపత్య సంబంధాలు, ఆర్థిక ఒత్తిళ్లు, లింగ అసమానతలు, నైతిక ద్వం ద్వాలు ప్రతిబింబిస్తాయి. 'ఎవరో... ఎప్పుడో అనుకున్న మాటలను జ్ఞాపకం ఉంచుకొని, అవన్నీ నిజమేనని గా ఢంగా నమ్మి, వాటిని తు.చ తప్పకుండా ఆచరించడం విజ్ఞత కాదు. విషయం ఏదైనా, నీకో అభిప్రాయం ఉం డాలి. అంతేగానీ, గతంలో చేశామని, తల్లిదండ్రులు పా టించారని, సమాజం విలువను పవిత్రంగా ప్రకటించిందని సాకులు చెప్పవద్దు. ప్రశ్నించకుండా దేనినీ స్వీకరించవద్దు' అనే మాటలు కుటుంబరావు ఆలోచనా సరళిని, అంతరాత్మను వివరిస్తాయి. మనిషి తన జీవితానికి అడ్డుగా వచ్చేది ఏదైనా సరే, దానిని మార్చాలి. దీనిని హేతువాదంగా మాత్రమే చూడడం పొరపాటు. సామిజిక పరిణామాన్ని అర్థం చేసుకునే భౌతికవాద దృక్పథం కూడా ఇందులో ఇమిడి ఉంది. సనాతన ధర్మంపై కుటుంబరావు చేసిన విమర్శలకు ఈ ఆలోచనా విధానమే కారణం. అందుకే, ఆయన శైలి అడుగడుగునా తప్పులను ఎత్తిచూపుతూ ముందుకు సాగుతుంది. భాష ఆయన భావజాలానికి తగినట్టు విలక్షణంగా ఉంటాయి. తార్కికంగా ఉండే కుటంబరావు రచనలు పాఠకుడి ఉపదేశాలు ఇవ్వవు. ఆలోచించక తప్పని పరిస్థితి కల్పిస్తాయి. పాత్రల ప్రవర్తనలో అంతులేని వైరుధ్యాలు సమాజాన నిర్మాణాన్ని ప్రతిబింబిస్తుంటాయి. చాలా సందర్భాల్లో ఒక రచన చదువుతున్న పాఠకుడు సదరు రచయిత తనను ఎటు తీసుకెళుతున్నాడో అర్థం చేసుకుంటాడు. రాబోయే పరిణామాలను ఊహించుకుంటాడు. అలాంటి రచనలను ఎవరూ పదం తర్వాత పదంగానూ, వాక్యం తర్వాత వాక్యంగానూ చదవకుండా, పేజీలను తిరగేస్తారు. కానీ, కుటుంబరావు రచనలు చదువుతున్నప్పుడు పాఠకుడు అనుక్షణం ఒకరకమైన ఉద్విగ్నతకు గురవుతాడు. ఆలోచనలో పడతాడు. రచయిత తన తీర్పు లేదా ముగింపును ప్రకటించకుండా, ఆ అవకాశాన్ని పాఠకుడికే విడిచిపెడతాడు. దీనివల్ల కుటుంబరావు ప్రతి రచనా ఏదో ఒక ప్రత్యేకతను కనబరుస్తుంది. కథ లేదా నవల లేదా నాటకం... ప్రతి రచనలోనూ కథకు ముగింపు ఉంటుంది. అదే సమయంలో, ఆలోచనల్లో మునిగిపోయే పాఠకుడు తన స్వంత నమ్మకాలతో తానే తలపడాల్సి వస్తుంది. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను ప్రశ్నించడానికి మార్గాలను అన్వేషించేలా చేస్తుంది. ఆ క్రమంలోనే పాఠకుడి మెదడులో మరో కథ పురుడుపోసుకుంటుంది. భాష విషయంలోనూ ఆయనకు ప్రత్యేకమైన దృష్టి ఉంది. అలంకార భాష కంటే స్పష్టతకు, ఆలోచనా పదునుకు ప్రాధాన్యం ఇచ్చాడు. వ్యంగ్యం, హాస్యం, సంభాషణ, సూటితనం ఆయన వచనానికి సహజ లక్షణాలయ్యాయి. అయితే ఆ సూటితనం సరళీకరణ కాదు. సంక్లిష్టమైన సామాజిక సమస్యను పాఠకుడికి అర్థమయ్యే భాషలో చెప్పడం ఆయన శక్తి. అందుకే ఆయన రచన ఒకేసారి మేధోపరమైనదిగానూ, ప్రజలకు చేరువైనదిగానూ నిలిచింది. కలకాలం గుర్తుండిపోయే సాహిత్యంగా వెలుగున్నది.

**- సత్యశ్రీ**

## చదవాల్సిన పుస్తకం

### 'కొడవటిగంటి కుటుంబరావు కథలు'

ఒక గొప్ప రచయిత రాసిన కథలను, మరో ప్రముఖ కథకుడు, విమర్శకుడు సంపాదకత్వం వహించి పుస్తకరూపంలోకి తీసుకురావడం అరుదు. అలాంటి అరుదైన పుస్తకమే 'కొడవటిగంటి కుటుంబరావు కథలు'. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంపాదకత్వం వహించిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన రచన. ఎందుకంటే, తెలుగు ఆధునిక కథా సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే కుటుంబరావును చదవడం ఒక ముఖ్యమైన అవసరం. ఆయన కథలను కేవలం ఒక కాలానికి చెందిన మధ్యతరగతి జీవిత చిత్రాలుగా చూడటం వాటి పరిధిని కుదించడం అవుతుంది. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు, సామాజిక విలువలు, మూఢనమ్మకాలు, లింగ అసమానతలు, వ్యక్తి–సమాజ సంబంధాల వెనుక పనిచేసే శక్తులను ఆయన కథలు పరిశీలిస్తాయి. జీవితాన్ని అలంకార రహితంగా, హేతుబద్ధంగా చూడటం కుటుంబరావు కథా దృష్టిలోని ప్రధాన లక్షణం. విమర్శకుల పరిశీలన ప్రకారం మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి పాత్రల ప్రవర్తన వెనుక ఉన్న ఆర్థిక కారణాలను ఆయన ప్రత్యేకంగా విశ్లేషించారు. ఈ సంపుటికి కేతు విశ్వనాథరెడ్డి సంపాదకత్వం వహించడం ప్రత్యేకమైన విలువను ఇస్తుంది. కుటుంబరావు రచనలను వెదికి, సేకరించి, క్రమబద్ధీకరించి పాఠకులకు అందించడానికి కేతు చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ముఖ్యమైన సంపాదక బాధ్యత. నవచేతన ప్రచురణాలయం ద్వారా ఆయన సంపాదకత్వంలో కుటుంబరావు రచనలు అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. కొ.కు. కథల గొప్పతనం వాటి సిద్ధాంతపరమైన స్పష్టతలో ఉంటుంది. పాత్రలను సిద్ధాంతాల బొమ్మలుగా మార్చకుండా, వాటి బలహీనతలు, స్వార్థాలు, భయాలు, ఆశలు, సామాజిక ఒత్తిళ్లతో సహా మనుషులుగా చిత్రించడం ఆయన ప్రత్యేకత. అందుకే దశాబ్దాలు గడిచినా ఈ కథలు పాతబడినట్లు అనిపించవు. 'కథ చదవక ముందు, చదివిన తర్వాత పాఠకుడు ఒకే తీరుగా ఉంటే అది మంచి కథ కాదు' అనే కుటుంబరావు సాహిత్య ప్రమాణం ఆయన కథలకు చక్కగా వర్తిస్తుంది. ఆయన కథల సంపుటిని చదివినప్పుడు సమాజంలోని ఒక సుదీర్ఘ పరివర్తనను సాహిత్యం ద్వారా పరిశీలించే అవకాశం లభిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా అర్థం చేసుకునే సందర్భాన్ని సృష్టిస్తుంది. ముఖ్యంగా హేతువాదం, సామాజిక వాస్తవికత, మధ్యతరగతి మనస్తత్వం, సాహిత్య విమర్శపై ఆసక్తి ఉన్నవారికి ఈ సంపుటి విలువైన పుస్తకం. సదా పఠనీయం.




**పుస్తకం పేరు**

కొడవటిగంటి కుటుంబరావు కథలు
సంపాదకత్వం: కేతు విశ్వనాథరెడ్డి

**ప్రచురణ / ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).


# అక్షరాలలో ఒదిగిన జ్ఞాపకాలు



ఇటీవల కోల్‌కతా సెంటర్ ఫర్ క్రియేటివిటీలో జరిగిన సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమంలో ఆవిష్కృతమై న రచయిత్రి సోమా బోస్ మూడో పుస్తకం 'ది గార్డెన్ ఆఫ్ వైట్ రోజెస్' అనేకానేక జ్ఞాపకాలు, కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత చరిత్రల చుట్టూ సాగుతుంది. ము ఖ్యంగా చేతిరాత ఉత్తరాలను కథనానికి కేంద్రంగా చేసుకున్న రచయిత్రి, డిజిటల్ కమ్యూనికేషన్ వేగం పెరిగిన కాలంలో కోల్పోతున్న భావోద్వేగ సాన్నిహిత్యాన్ని ప్రశ్నిస్తుంది. తక్షణ సందేశాలు, ఎమోజీలు, చిన్నచిన్న డిజిటల్ సంభాషణలు సమాచారాన్ని వేగంగా చేరవేస్తున్నా, ఉత్తరాల్లో కనిపించే ఆలోచన, సంకోచం, ఆత్మీయత, అసంపూర్ణతకు అవి ఎంతవరకు ప్రత్యామ్నాయం కాగలవన్న ప్రశ్నను పుస్తకం ముందుకు తెస్తుంది. ఈ పుస్తకానికి మూలం సోమా బోస్ తల్లిని కోల్పోయిన తర్వాత అనుభవించిన శూన్యత, విరహం. ఆ వ్యక్తిగత దుఃఖం క్రమంగా తల్లికి అర్పించిన సాహిత్య నివాళిగా మారింది. తల్లి–కూతుళ్ల మధ్య సాగిన సంభాషణలు, ఉత్తరాలు, జ్ఞాపకాలు, చెప్పని మాటలు భౌతిక దూరాన్ని దాటి ఒక సంబంధాన్ని ఎలా సజీవంగా ఉంచుతాయో రచన ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో ఈ పుస్తకం సాధారణ కుటుంబాల జీవితాలకూ చారిత్రక విలువ ఉందని గుర్తుచేస్తుంది. చరిత్రను ప్రముఖుల జీవితాలే నిర్మించవు... సామాన్యుల అనుభవాలు, కుటుంబ జ్ఞాపకాలు, వ్యక్తిగత ఉత్తరాలు కూడా ఒక కాలపు సామాజిక, భావోద్వేగ చరిత్రను భద్రపరుస్తాయి. సోమా బోస్ రచనలో విషాదం చివరికి జ్ఞాపకంగా, జ్ఞాపకం ప్రేమగా, ప్రేమ సాహిత్యంగా మారుతుంది. వేగం పెరిగిన డిజిటల్ యుగంలో నెమ్మదిగా రాసిన ఒక ఉత్తరం విలువను, మరచిపోతున్న వ్యక్తిగత చరిత్రలను నమోదు చేయాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం గుర్తుచేస్తుంది. అందుకే 'ది గార్డెన్ ఆఫ్ వైట్ రోజెస్' ఒక పుస్తకం కంటే ఎక్కువగా జ్ఞాపకాలను సజీవంగా ఉంచే ప్రయత్నంగా నిలుస్తుంది.

# 'మార్క్సిస్ట్ చరిత్రకారుడు' సుమిత్ సర్కార్

ఆధునిక చరిత్ర రచనలో అందెవేసిన ప్రముఖ 'మార్క్సిస్ట్ చరిత్రకారుడు' సుమిత్ సర్కార్ తన 87 ఏళ్ల వయసులో ఈ ఆగస్టు 13 నాడు మరణించడం విషాదకరం. చరిత్ర నేపథ్యం ఉన్న కుటుంబంలో కలకత్తాలో సుమిత్ 1939 లో జన్మించారు. ఆయన తండ్రి సుశోభన్ చంద్ర సర్కార్, ప్రెసిడెన్సీ కళాశాల, కలకత్తా విశ్వవిద్యాలయంజాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో చరిత్ర బోధకులుగా పనిచేసిన ప్రఖ్యాత చరిత్రకారుడు. 'చారిత్ర' జత కలిసిన కుటుంబంలో పెరగడం మూలంగా సుమిత్‌కు చిన్ననాటి నుండే చారిత్రక అవగాహనను పెంపొందించుకున్నారు. అదేవిధంగా సుమిత్ సర్కార్ మరో చరిత్ర ప్రొఫెసర్ అయిన తనికా సర్కార్‌ను వివాహం చేసుకోవడం తద్వారా వారి కుటుంబానికి 'చరిత్ర'తో బంధం మరింత గాఢంగా పెనవేసుకుపోయింది. సుమిత్ కుటుంబంలో మొదటగా ఆధునిక, ఉదారవాద సామాజిక మత సంస్కరణల సంప్రదాయం ఉండేది. కాని క్రమంగా ఆయన తండ్రి సుశోభన్ చంద్ర సర్కార్ అనుసరించిన వామపక్ష సిద్ధాంతాల ప్రభావం క్రమంగా ఆ కుటుంబంలో బలంగా కొనసాగింది. సుమిత్ కలకత్తా (నేటి కోల్‌కతా)లోని ప్రెసిడెన్సీ కళాశాలలో చరిత్రలో బిఎ (ఆనర్స్) పూర్తి చేశారు. అనంతరం కలకత్తా విశ్వవిద్యాలయంలో మాస్టర్స్, పిహెచ్‌డి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఆ తర్వాత ఆ కలకత్తా విశ్వవిద్యాలయంలోనే ఆయన బోధించారు. సుమిత్ 1974 నుండి 2004 వరకు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో బోధించి విద్యార్థులను చరిత్ర పట్ల ఎంతగానో ప్రభావితం చేశారు. సుమిత్ అమెరికా, యూరప్‌లోని అనేక ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. బెంగాల్ పునరుజ్జీవనం, ఆధునిక ఐరోపా చరిత్ర, చరిత్ర రచన–రాజకీయ ఆలోచనపై సుమిత్ సర్కార్ రచనలు చేశారు. ఆయన రచనలలో 1973 లో ప్రచురితమైన 'ది స్వదేశీ మూమెంట్ ఇన్ బెంగాల్' (1903–1908) గ్రంథం మైలురాయి. ఆధునిక భారతదేశ చరిత్రకారుడిగా ఆయనకు ఈ పుస్తకం కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టింది. బెంగాల్‌లోని జాతీయవాద ఉద్యమంపై ప్రముఖ గ్రంథంగా నిలిచిపోయింది. సుమిత్ రాసిన 'మోడరన్ ఇండియా' (1885–1947) ను విద్యార్థులకు పాఠ్యపుస్తకమైంది. ఈ గ్రంథం ద్వారా శ్రామిక ప్రజల చైతన్యాన్ని ప్రజా పోరాటాల



దిశగా మళ్లించడానికి కృషి చేశారు. అలాగే 'రైటింగ్ సోషల్ హిస్టరీ' (1998), 'మిడిల్ క్లాస్ లీడర్‌షిప్ ఇన్ లేట్ కలోనియల్ ఇండియా: ప్రాబ్లమ్స్ అండ్ పర్స్‌పెక్టివ్స్ ఆఫ్ ఎ హిస్టరీ ఫ్రమ్ బిలో' మొదలైన ప్రముఖ గ్రంథాలు ఆయన రచించారు. సుమిత్ తన భార్య తనికా సర్కార్‌తో కలిసి 'విమెన్ అండ్ సోషల్ రిఫార్మ్ ఇన్ మోడరన్ ఇండియా: ఎ రీడర్' (2007), 'క్యాస్ట్ ఇన్ మోడరన్ ఇండియా' (2013) తదితర పుస్తకాలకు సహసంపాదకత్వం వహించారు. సుమిత్ రచనలు వివిధ సామాజిక సమూహాలు, వర్గాలు, ప్రజా ఉద్యమాల అనుభవాల ద్వారా వలసవాదం, జాతీయవాదం, స్వాతంత్ర్య ఉద్యమాలను పరిశీలించడంలో ప్రముఖంగా నిలిచాయి. ఆ రకంగా విస్తృత సమూహాలను, సామాజిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకొని జాతీయవాదంపై ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం. మార్క్సిస్ట్ చరిత్రకారుడిగా విస్తృతంగా పేరుగాంచిన సుమిత్ 'రాజకీయ మా ర్పుల వెనుక ఉన్న సామాజిక శక్తులపై' ప్రత్యేక ఆస క్తి కనబరిచారు. ఆ రకంగా ఆయన ఆలోచనల్లో సా మాజిక మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తుంది. 'ఎస్సెన్స్ ఆఫ్ ఎ లైఫ్‌టైమ్' అనే గ్రంథంలో అణగారిన వర్గాల జీవితాలను సుమిత్ స్పృశించారు. ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా సంస్కృతి, భావోద్వేగాలను లో తుగా పరిశోధించే అరుదైన మార్క్సిస్ట్ చరిత్రకారుల లో సుమిత్ ఒకరు. ఫాసిస్ట్ శక్తులు చేసే చరిత్ర వక్రీకరణలను ఆయన రచనలు తిప్పికొట్టాయి. సుమిత్ 2003లో ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ సొసైటీ నుండి 'సరిత్ చటర్జీ మెమోరియల్ అవార్డు' స్వీకరించారు. 2004లో పొందిన రవీంద్ర పురస్కారాన్ని ఆయన 2007 లో వెనక్కి ఇచ్చారు. సుమిత్ తన రచనల్లో మాత్రమే గాక, నిజ జీవితంలోనూ యువత భావాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చేవారు. సుమిత్ మరణం చారిత్రక పరిశోధనకు, ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు.

**— జెజెసిపి బాబూరావు**

## ఈ వారం కవితలు

### దేశద్రోహినౌతాను

'జననీ జన్మభూమిశ్చ..
స్వర్గాదపీగరియసి' అనాలి !
లేకుంటే.... వేదాలు
తెలియనోన్నిఔతాను!
ఊరవతల ఉన్నా..
'నా దేశం స్వర్గం కంటే
మిన్న'అనాలి !
లేకుంటే....దేశద్రోహినౌతాను

అంటరాని వాడివని ముట్టుకోకున్నా..
'ఈ దేశంలో పుట్టడం నా అదృష్టం అనాలి'
లేకుంటే 'అర్బన్ నక్సలైట్'నౌతాను !

లక్ష జీవరాశుల కన్నా 'మనిషిగా పుట్టడం
నా పూర్వజన్మ సుకృతమనాలి'..
లేకుంటే.... 'సనాతనం' తెలియనోన్ని ఔతాను !
అర్జెంట్‌గా.. సర్ లిస్టులో
నా పేరు వెతుక్కోవాలి..
లేకుంటే 'రోహింగ్యా' నౌతాను!!

**- గొల్లేపల్లి నరసింహ**
8106820393

### తెల్చుకో...

కుడి ఎడమల తేడా తెల్సుకోనీ
గమ్యం ఏదో తేల్చుకో
ఇది కుడితడి లేని మడి;
భూత కాలపు కాదు.. కాదు
భూతాల కాలపు సంస్కృతీ పరులు

స్వాములోర్లు, బాబాలు, అమ్మవార్లు
తరతరాల మానవ తలల్ని
ఊపించిన ఘనులు
బైబిల్, ఖురాన్, భగవద్గీతలు
లభ్యమయ్యే కొట్లు
వర్ణ వ్యవస్థలూ, వర్గ అవస్థలూ
విస్తరిల్లిన చోట్లు

స్వతంత్ర పౌరులూ, బానిసలూ,
సామాన్యులూ, పీడితులూ శ్రమశక్తిని
సొంతం బలిగావించుకునే కార్మికులూ
వారి చరిత్రావశేషాలు గల ప్రదేశాలు
విలాస వస్తువులుగా వాడిన స్త్రీలూ
ఆకటి చావులూ ఈ దారిన కనబడ
తాయ్;


అది ఎడమ, కష్టాలు కడమ
భావిపై భరోసానిస్తూ ప్రకృతి శక్తుల
తెలుసుకుంటూ
భూనభోంతరాల్ని విహరింపజేస్తూ
మానవుని నవ్యునిగా
తీర్చిదిద్దే సంస్కృతులు

శాస్త్రీయ ఆలోచనలూ, హేతువాద
దృక్పథాలువర్ణ, వర్గ రహిత సామాజిక
చైతన్యాత్మక ప్రదేశాలు
ప్రతి మనిషికీ శ్రమశ్రమకు తగ్గ

ఫలితాలనుఅందించే దేశాలు
వాటి విలువైన సందేశాలు
ఆకటికీ, చీకటికీ తావుల్లేని రాజ్యాలు
ఈ దారిన కనబడతాయ్;
కుడి ఎడమల తేడా తెల్సుకోనీ
గమ్యం ఏదో తేల్చుకో

**- డా.పల్లేరు వీరస్వామి,**
94416 02605

### ఏ మనిషిని పలకరించినా!



ఏ మనిషిని పలకరించినా
పలికేను పలకరింతలే
ఎన్ని జన్మలు ఎత్తినా
జన్మజన్మకు ఒక కథ ఉండునులే!
ఏ కథను గాంచినా
మధుర స్వప్నంలా సాగునులే
వసంతాలు ఎన్ని వచ్చినా
కల సహకారమైతే ఆనందమే!

ఎన్ని శిఖరాలు అధిరోహించినా
చిన్ని చిన్ని సంతోషాలు సుందరమే
ఏ గుండెను తాకినా
జాలిగా పొంగునులే!

కన్నీళ్లు కనిపించకపోయినా
మనసు పాట పాడునులే
కష్ట సుఖాలు ఏవైనా
పలకరించి పోయే అతిథులే!

ప్రకృతిలో ఉన్నది ఏదైనా
ప్రతి జీవికి సొంతమే
పంచభూతాలైనా
ప్రతి ప్రాణికి ప్రాణభూతమే!

ఏ మనిషిని పలకరించినా
పలికేను పలకరింతలే...
ఎన్ని జన్మలు ఎత్తినా
జన్మ జన్మకు ఒక కథ ఉండునులే!

ఏ మనిషిని పలకరించినా
పలికేను పలకరింతలే....!

**- పట్లోళ్ల బక్కారెడ్డి**
9705315250

### చూస్తున్నా...



మోముల్లో నవ్వులు
చూస్తున్నా,
నవ్వుల్లో వెలుగులు చూస్తున్నా,
వెలుగుల్లో రంగులు చూస్తున్నా,
రంగుల్లో హరివిల్లు చూస్తున్నా

పలుకుల్లో ప్రేమను చూస్తున్నా,
ప్రేమల్లో అందాలు చూస్తున్నా,
అందాల్లో ఆనందం చూస్తున్నా,
ఆనందాల్లో లోకం చూస్తున్నా

లోకంలో మనుషులను చూస్తున్నా,
మనుషుల్లో జీవితాలు చూస్తున్నా,
జీవితాల్లో ఆశలు చూస్తున్నా,
ఆశల్లో భవితను చూస్తున్నా

కన్నుల్లో కలలు చూస్తున్నా,
కలల్లో కొత్త మార్గాలు చూస్తున్నా,
మార్గాల్లో గమ్యాలు చూస్తున్నా,
గమ్యాల్లో విజయాలు చూస్తున్నా


చేతుల్లో చెలిమిని చూస్తున్నా,
చెలిమిలో మమతలు చూస్తున్నా,
మమతల్లో కరుణను చూస్తున్నా,
కరుణలో దైవాన్ని చూస్తున్నా

ప్రతి రూపంలో
ఒక భావాన్ని చూస్తున్నా,
ప్రతి భావంలో
ఒక జీవాన్ని చూస్తున్నా,
ప్రతి జీవంలో దైవాన్ని చూస్తున్నా,
ప్రతి దైవంలో ప్రేమతత్వం
చూస్తున్నా

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

# రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయం

- గిరిజన సంక్షేమం, ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- మేడారం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక.. రూ.200 కోట్లతో సాగునీటి పనులు
- యువతకు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ... 5వేల ఇళ్ల కేటాయింపు
- త్వరలో ఎస్‌పి కార్యాలయం, కోర్టు భవనాలు
- కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సిఎం ఎ.రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ములుగు/తాడ్వాయి : ములుగు జిల్లా సమగ్రాభివృద్ధి, గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, విద్య, వైద్యం, సాగునీరు, పర్యాటకం, ఉపాధి రంగాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తామని తెలిపారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభలో సిఎం మాట్లాడారు. మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని రామప్ప, వేయి స్తంభాల గుడి తరహాలో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మల్లూరు నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. భక్తుల సౌకర్యాలు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జంపన్నవాగుపై చెక్ డ్యామ్‌లు, స్నాన ఘట్టాలు నిర్మించి సమగ్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**అంతర్జాతీయ అవకాశాలే లక్ష్యం..**

ములుగు యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జర్మన్, జపనీస్, కొరియన్ భాషల్లో ఉచిత శిక్షణ అందిస్తామని సిఎం వెల్లడించారు. నర్సరీ నుండి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ బోధన అందించడంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాల ద్వారా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందిస్తామని తెలిపారు. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. సమ్మక్క సారలమ్మ బిడ్డలకు 'సారె' పేరిట నాణ్యమైన చీరలు అందిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్‌లో అక్కా, చెల్లెమ్మలకు చిలకపచ్చ రంగు చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**రూ.200 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు**

ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. నియోజకవర్గానికి 5వేల ఇళ్లను కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రూ.200 కోట్లతో పొట్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్, రామప్ప, లక్నవరం అనుసంధాన పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడుతుందని చెప్పారు.

ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీతక్క అన్నారు. విద్య, వైద్యం, పర్యాటక రంగాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, నర్సింగ్ కళాశాలలు, వైద్య, విద్యా సదుపాయాల విస్తరణకు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిపై తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కలెక్టరేట్ సముదాయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయని సిఎం తెలిపారు. త్వరలో ఎస్‌పి కార్యాలయం, కోర్టు భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపిలు బలరాం నాయక్, వేం నరేందర్ రెడ్డి, విప్ డాక్టర్ రాంచంద్ర నాయక్, ఎమ్మెల్యే మందుల సామెల్, జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే సహదేవరావు, అధికారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**వనదేవతల సన్నిధిలో సిఎం రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలోని ప్రముఖ గిరిజన పుణ్యక్షేత్రం అయిన మేడారంలో పర్యటించారు. బిచ్కుంద నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న సీఎంకు గిరిజన పూజారులు సాంప్రదాయ డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మేడారంలోని వనదేవతలు సమ్మక్క సారలమ్మల గద్దెలను దర్శించుకున్న ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన మొక్కులలో భాగంగా వనదేవతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత సామాజిక భద్రత పింఛన్ల చెక్కులను సీఎం స్వయంగా అందజేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.2,016 చొప్పున ఈ పింఛన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధ తాగునీటి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. మేడారం వచ్చే భక్తులకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీరు అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్క నాటిన సీఎం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు, అధికారులు సమస్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**మహిళా సంఘాలతో ఆత్మీయ కలయిక**

ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ముచ్చటించారు. వారి ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం ఆయన ములుగుకు తిరుగు పయనమయ్యారు. ఈ పర్యటనలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సీఈఓ దివ్య, మేడారం ఈఓ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం

ములుగులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో 2145 గ్రామీణ రహదారుల నిర్మాణం, 7448 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.



## 'నేడు' టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్, సనత్‌నగర్‌లోని 'డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసిఆర్ టిమ్స్)ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పరిశీలించారు. హాస్పిటల్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యశాఖ, పోలీస్,జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి, సమాచార పౌర సంబంధాల శాఖ, ట్రాఫిక్ పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో దామోదర రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమ వేదిక, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, సెక్యూరిటీ, ప్రజల రాకపోకలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పోలీస్, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి,హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి ఎండి అశోక్ రెడ్డి, అదనపు డిసిపి (ట్రాఫిక్) వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**22.6 ఎకరాల్లో నాలుగు బ్లాకులు..**

22.6 ఎకరాల విస్తీర్ణంలో,11.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు బ్లాకులుగా నిర్మించారు. మొత్తం 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రోబయాలజీ ల్యాబులు, 10 బయోకెమిస్ట్రీ ల్యాబులు, 5 ప్రత్యేక ల్యాబులు ఉన్నాయి. ఆస్పత్రిలో మొత్తం 1,082 పడకలు, అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. మొత్తం పడకల్లో దాదాపు 30 శాతం ఐసీయూలకు కేటాయించారు. బ్లాక్ ఏ లో అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ బెడ్లు, సెంట్రల్ స్టెరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి. బ్లాక్‌బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, బ్లాక్‌సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబులు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఉన్నాయి. ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్‌ఐ, 128స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, ఐదు ఎక్స్‌రే యంత్రాలను ఏర్పాటు చేశారు. కాగా టిమ్స్ నిర్మాణ పనులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) చేపట్టింది.

## 2027 జనాభా లెక్కల్లో.. ఒబిసి, ఎస్ఇబిసిలకు ప్రత్యేక కేటగిరీ

- ప్రధాని మోదీకి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: 2027 జనాభా లెక్కల్లో ఇతర వెనుకబడిన తరగతులు (ఓబిసి), సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల (ఎస్ఇబిసి) జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేందుకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ప్రధానికి రాసిన లేఖలో పలు కీలక సూచనలు చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉన్నట్లుగానే జనాభా లెక్కల ప్రశ్నావళిలో ఓబిసి, ఎస్ఇబిసిలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రాల వారీగా సమగ్ర మాస్టర్ కుల డైరెక్టరీ రూపొందించి, ప్రతి కులం, సముదాయానికి ప్రత్యేక డిజిటల్ కోడ్ కేటాయించాలని కోరారు. జాబితాలో లేని లేదా వివాదాస్పద కులపేర్లను నమోదు చేసి ధ్రువీకరించే విధానం ఉండాలని పేర్కొన్నారు. 2011 సామాజిక ఆర్థిక, కుల గణనలో కులాల పేర్లను ఓపెన్‌ఎండెడ్ విధానంలో నమోదు చేయడం వల్ల స్పెల్లింగ్, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ఉచ్చారణలో తేడాలతో అనేక రకాల కుల పేర్లు నమోదయ్యాయని మంత్రి తెలిపారు. 2027లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రమాణీకృత విధానాన్ని అవలంబించాలని కోరారు. తెలంగాణలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సిపెక్) 2024–25 ద్వారా ఇంటింటి స్థాయిలో నిర్మిత డేటా సేకరణ, కుల సమాచారాన్ని పద్ధతిగా నమోదు చేయడంలో అనుభవం లభించిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ అనుభవాలను జాతీయ స్థాయిలో 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వ్యక్తి స్వయంగా ప్రకటించిన కుల వివరాలతో పాటు అధికారిక వర్గీకరణను కూడా డేటాలో భద్రపరచాలని మంత్రి కోరారు. కేవలం కులాల పేర్లను సేకరించడం కాకుండా రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఉపయోగపడే విశ్వసనీయమైన ఓబిసి, ఎస్ఇబిసి డేటాసెట్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యానికి కులవారీ జనాభా సమాచారం కీలకమని పేర్కొంటూ, జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభానికి ముందే అవసరమైన పద్ధతులు, సాంకేతిక ప్రమాణాలు, డేటా రక్షణ చర్యలు అమలు చేయాలని ప్రధాని మోదీని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి పాలిటెక్నిక్ కళాశాలల అనుసంధానం

- జాతీయ విద్యా విధానం అమలు కుట్రలో భాగమే: ఎఐఎస్‌ఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటిఐలు, ఎటిసిలతో కలిసి స్కిల్ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సులకు అనుసంధానం చేసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా పిపిపి విధానాన్ని తీసుకురావడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, అధ్యాపకులు, హాస్టళ్లకు అవసరమైన నిధులు కేటాయించకుండా ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీ పాలక మండలిలో పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యను వ్యాపారమయం చేసే ప్రమాదం ఉందని ఆరోపించారు. నూతన విధానం అమలైతే పాలిటెక్నిక్ విద్యలో అధ్యాపకుల నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు ప్రైవేటు, కార్పొరేట్ శక్తుల ప్రభావం పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నూతన జాతీయ విద్యా విధానం–2020 అమలులో కుట్రలో భాగంగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.స్కిల్ యూనివర్సిటీ పేరుతో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయవద్దని సూచించారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులను నియమించాలని, ల్యాబ్‌లను ఆధునీకరించాలని, వర్క్‌షాప్‌లను నిర్వహించాలని, హాస్టళ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షల ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారిలో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.జిఒ నంబర్ 97లోని పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయడంతో పాటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## బిసి కులగణనపై మాట మార్చిన మోదీ

- కేంద్ర ప్రభుత్వంపై దేశవ్యాప్త బిసిల తిరుగుబాటు ఉద్యమం
- వచ్చేవారం ఢిల్లీలో అఖిలపక్ష, ఒబిసి సంఘాలతో సమావేశం: జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: జనగణనలో బిసి కుల గణన చేపడతామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు మాట మార్చి బిసిలను మోసం చేస్తున్నారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిసి కులగణనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2025 ఏప్రిల్ 1న ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తదుపరి జాతీయ జనగణనలో బిసి కులగణన చేపడతామని నిర్ణయించి, ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అలాగే పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రశ్నించినప్పుడు రెండో దశ జనగణనలో బిసి కులగణన చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందని, కానీ, ఆగస్టు 14న కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో 40 ప్రశ్నలు ఉన్నప్పటికీ, ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన కుల వివరాలను మాత్రమే అడిగే విధంగా ఉందన్నారు. బిసి కులాల జాబితాను ప్రకటించకుండా, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ నంబర్ కేటాయించకుండా కులగణనను ఏ విధంగా నిర్వహిస్తారో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని కోరారు. తెలంగాణ, బీహార్‌లో నిర్వహించిన కులగణనను ఆదర్శంగా తీసుకుని ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, ఇతర కులాల జాబితాలను విడుదల చేసి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించి శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేపట్టాలని, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా బిసిలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వచ్చే వారం ఢిల్లీలో అఖిలపక్ష పార్టీల నేతలు, ఓబిసి సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర



ప్రజాపక్షం/హైదరాబాద్: హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఇందుకు నిరసనగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జనరల్ బాడీ సభ్యులతో కెటిఆర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పేద ఆడబిడ్డల పక్షాన తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలనిఅన్నారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని,అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని తెలిపారు. కల్యాణలక్ష్మి అంశం విషయంలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు సార్లు గడువు ఇచ్చినప్పటికీ కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు.

## ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీలో 'ప్రజాపక్షం' జర్నలిస్ట్‌కు బహుమతి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం (టిఎస్‌పిజెఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీలు 2026లో ప్రజాపక్షం ఫోటో జర్నలిస్టు పిట్టల శ్రీధర్ కన్సోలేషన్ బహుమతికి ఎంపికయ్యారు. 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి తెలిపారు. రాష్ట్రంలోని ఫోటోజర్నలిస్టుల నైపుణ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రతి ఏటా రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 102 ఎంట్రీలు, మొత్తం 306 ఛాయాచిత్రాలు పోటీలకు వచ్చాయని తెలిపారు. ప్రముఖ సంపాదకుడు దేవులపల్లి అమర్, తెలంగాణకు చెందిన ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు, నటుడు కొమ్మిడి విశ్వేందర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఛాయాచిత్రగ్రాహకుడు కమలా సుధాకర్ రెడ్డి జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10 వేలను హైదరాబాద్‌కు చెందిన కె.దుర్గారావు(డెక్కన్ క్రానికల్, హైదరాబాద్), ద్వితీయ బహుమతి రూ.7వేలను నల్గొండకు చెందిన కె.బజరంగ్ ప్రసాద్(సాక్షి, నల్గొండ), తృతీయ బహుమతి రూ.5 వేలను సంగారెడ్డికి చెందిన పొన్న శ్రీనివాస్(ఈనాడు, సంగారెడ్డి) గెలుచుకున్నారు. కన్సోలేషన్ బహుమతులుగా రూ. ఒక వెయ్యి చొప్పున డి. సుమన్‌రెడ్డి (టైమ్స్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్), ఆవుల శ్రీనివాస్ (ఈనాడు, హైదరాబాద్), కె. రమేష్ (మన తెలంగాణ, వరంగల్), పిట్టల శ్రీధర్ (ప్రజాపక్షం, కరీంనగర్), కుంట్ల శ్రీనివాస్ (ఫ్రీలాన్స్, హైదరాబాద్), ఎం. నాగేశ్వర్‌రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), జె. నవీన్ (వెలుగు, హైదరాబాద్), ఆర్. రాఘవేందర్ (ఈనాడు, హైదరాబాద్), ఎం. గోపికృష్ణ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), జి. శ్రావణ్‌కుమార్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్) ఎంపికయ్యారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 19న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్తా చిత్రాల ప్రదర్శన ప్రారంభమవుతుందని సంఘం నేతలు తెలిపారు. త్వరలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.



సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను వారు ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'ప్రజలతో ముఖాముఖి' సద్వినియోగం

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. టిపిసిసి ఆధ్వర్యంలో ఈ నెల19న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లోని ఇందిరా భవన్‌లోఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాలు, గిరిజనులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమం, సాధికారతకు సంబంధించిన సమస్యలను ప్రజలు మంత్రికి నేరుగా వివరించవచ్చన్నారు.

## రిజర్వేషన్ల వల్లే న్యాయవ్యవస్థలో పెరిగిన మహిళల సంఖ్య

- హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.రాధారాణి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రాల్లోని న్యాయ వ్యవస్థల్లో మహిళల సంఖ్య పెరిగిందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. ఉద్యోగాల్లో చేరిన మహిళలు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్.దుర్గాభవాని అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర స్థాయి మహిళా ఉపాధ్యాయుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.రాధారాణి, వక్తగా ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు మిరయం ధావలే హాజరయ్యారు. రాధారాణి మాట్లాడుతూ నేటికి ప్రయివేటు రంగంలో మహిళలకు ఉద్యోగాలను తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన అనేక హక్కులు అమలు కావడం లేదన్నారు. పిల్లలకు రాజ్యాంగ విలువలను నేర్పించాలని సూచించారు. మరియం ధావలే మాట్లాడుతూ వరద ప్రవాహం తరహా మనువాద బావజాల ప్రమాదం ముప్పే ట అలుముకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీఎఫ్ఐ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, జాతీయ నాయకులు మోతుకూరి సంయుక్త, సీనియర్ నాయకురాలు సి.కమల కుమారి, టిఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు వి. శాంతకుమారి, వై.జ్ఞాన మంజరి తదితరులు పాల్గొన్నారు.




## నూతన గృహప్రవేశ వేడుకలో మాజీ ఎమ్మెల్యే, సర్పంచ్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కల్వకోల్ కొండ శ్రీను సాగర్ కుమార్తె అనిత కమలాకర్ హైదరాబాద్‌లో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. అనిత కమలాకర్ ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశ వేడుకలకు ఆదివారం కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, కల్వకోల్ గ్రామ సర్పంచ్ బంట్రోత్ శ్రీనివాసులు పాల్గొన్నారు. నూతన గృహప్రవేశ వేడుకకు దుబ్బాక శాసనసభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి వచ్చిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, అనిత కమలాకర్, కొండ శ్రీను సాగర్, సర్పంచ్ బంట్రోత్ శ్రీనివాసులు శాలువాతో సన్మానించారు.



## క్రీడాకారుడు విజయ్‌ని అభినందించిన మాజీ మంత్రి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయి ప్రథమ స్థానం పొందిన క్రీడాకారుడు విజయ్‌ని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అభినందించి సన్మానం చేశారు. ఆదివారం నాడు జడ్చర్ల పట్ట ణంలోని అంబేద్కర్ కాలభవనంలో షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. అథ్లెట్స్‌లో ప్రతిభ కనబరిచి జడ్చర్లకు చెందిన బాలు విజయం సాధించడం ఎంతో గుర్తించదగిన విషయమని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో జరిగిన ఈ పోటీలలో విజయం సాధించినందుకు గాను గర్విస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మైసమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివా రులో వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవతను బిజెపి నాయకుడు ఆది వారం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బిజెపి కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎల్లేని సుధాకర్ ఆధ్వర్యంలో మైసమ్మ దేవత దర్శనానికి వచ్చిన సందర్భంగా గువ్వల బాల్‌రాజ్‌ను బిజెపి మండల్ బిజెపి నాయకులు శాలు వాతో సన్మానించారు. సన్మానించిన వారిలో బిజెపి నాయకులు పద్దిర భీమేష్ రెడ్డి బొల్లె జగన్, తిరుమల్, అమ్మ పల్లి మల్లేష్ పాల్గొన్నారు.

## మండల స్థాయిలోనే ప్రజావాణి



**ప్రజాపక్షం/కృష్ణ :** ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిశోర్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను నేరుగా అధికారులకు అందజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## నేటి నుంచి మండల కేంద్రంలో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి ఇకపై మండల కేంద్రంలోనే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం నుంచి మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజల నుంచి ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించను న్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వ హించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేసేం దుకు దరఖాస్తులు సమర్పించేవారు. అయితే మండల పరిధిలోని ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేలా స్థానికంగానే దరఖాస్తులు స్వీకరించే ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను సంబంధిత అంశాలతో కూడిన దరఖా స్తుల రూపంలో ఎంపిడిఒ కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. ప్రజా వాణి ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికా రుల దృష్టికి తీసుకురావాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు సూచించారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిడిఒ సాయిలక్ష్మి

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వ హించబడుతుందని, మండలంలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఈ కార్యక్రమంలో నేరుగా అధికారులకు వినతిపత్రాల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని సూచించారు. కావున మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉద్యోగం యువత జీవితానికి

# స్థిరత్వం, కుటుంబానికి ఆర్థిక భరోసా

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఉద్యోగం యువత జీవి తానికి స్థిరత్వం, కుటుంబానికి ఆర్థిక భరోసా అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఒఒ సుంకిరెండ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా గ్రామీణ యువత భవిష్యత్‌కు భరోసా కల్పించే ఉద్దేశ్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి పట్టణంలోని ఓల్డ్ కృష్ణవేణి జూనియర్ కాలేజ్ భవనంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ రెండో బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐక్య ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగం యువత జీవితానికి స్థిరత్వం, కుటుం బానికి ఆర్థిక భరోసా, తల్లిదండ్రులకు గౌరవాన్ని అందిస్తుందని అన్నారు. పోలీస్ శాఖలో 7 వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు రావడం యువతకు మంచి అవకాశమని, అవ కాశం వచ్చిన తర్వాత సిద్ధం కావడం కాకుండా ముందుగానే లక్ష్యంతో సిద్ధం కావాలని సూచిం చారు. ఇప్పటికే నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో మొదటి బ్యాచ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశామని, తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న ప్రతి యువతకు సమాన అవకా శాలు కల్పించడమే తమ లక్ష్య మని, ఆర్థిక పరిస్థితులు ఏ విద్యార్థి ఉద్యోగ కలకు అడ్డంకిగా మారకూడదని పేర్కొన్నారు. యువత క్రమశిక్షణతో చదు వుతూ శారీరక, రాతపరీక్షలకు సమగ్రంగా సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బోజిరెడ్డి, అధ్యా పకులు మోహన్‌లాల్, ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్ బాబా, గణేష్, శేఖర్, శ్రీపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సహ ఉపాధ్యాయునికి ఉపాధ్యాయుల బృందం ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/అయిజ :** బ్రైట్ స్టార్స్ పాఠశాల సామాజిక బాధ్యతలో భాగంగా ఒక గొప్ప మానవీయ కార్యాన్ని చేపట్టింది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన నర్సన్న అనే సహ ఉపాధ్యాయుడు ప్రస్తుతం ఆర్థిక, ఆరోగ్య సమస్య లను ఎదుర్కొంటున్న విషయం పాఠశాల సిబ్బందికి తెలిసింది. వారి కష్టాన్ని అర్థం చేసుకున్న పాఠశాల ఉపాధ్యాయుల బృందం, వారందరికీ వీలైనంత సహాయం చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంంగా, ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కలిసి మొత్తం 12,000 రూపాయలు నగదును సేకరిం చారు. వారి యొక్క నివాసం ఆవరణలో బ్రైట్ స్టార్స్ స్కూల్ సిబ్బంది అందరూ కలిసి ఆ ఉపాధ్యాయునికి నగదు సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలాల్లోనే ప్రజావాణి

జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు

సోమవారం నుంచి అన్ని మండలాల ఎంపిడిఒ కార్యాలయాల్లో నిర్వహణ

**ప్రజాపక్షం/నారాయణపేట :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఇకపై మండల స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్.ప్రియాంక తెలిపారు. ఆగస్టు 17వ తేదీ సోమవారం నుండి ప్రతి సోమవారం అన్ని మండలాల ఎంపి డిఒ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుం దని, ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర అభ్యర్థనలకు సంబంధించిన దరఖాస్తులను స్థానికంగా నిర్వ హించే ప్రజావాణిలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రాల్లోనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**అధికారులంతా తప్పనిసరిగా హాజరు :** మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు సకా లంలో హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందజేసిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్ పోర్ట ల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను స్థానికంగానే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారు లను కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో అందజేయాలని ఆమె కోరారు.

## బహుజన బతుకమ్మకు ఒక ప్రత్యేకత: విమలక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** బహుజన బతుకమ్మకు ఒక ప్రత్యేకత ఉందని అరుణోదయ విమలక్క చెప్పారు. తెలంగాణ రాష్ట్ర బహుజన బతుకమ్మ కమిటి ఆధ్వర్యంలో ఆదివారం బహుజన బతుకమ్మ 2026 సమాలోచన సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇది ఒక పండుగ కాదని దీనిని ఒక ఉద్యమంగా మార్చామన్నారు. ఈదేశానికి బలం యువతనే, వారి మీదే దేశం ఆదారపడి ఉందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మి మాట్లాడుతూ పండుగ అనేది అందరు చేసుకునేద న్నారు. 15 సంవత్సరాల నుండి బహుజన బతుకమ్మ నిర్వ హిస్తూ వస్తున్నామని చెప్పారు.

ఈ సమావేశంలో ప్రముఖ రచయిత్రి కరుణ, రైతుకూలి సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నిరుపేదల ఆత్మగౌరవం ‘ఇందిరమ్మ రాజ్యం’



గద్వాల ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని గద్వాల ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి తెలిపారు. ఆదివారం గద్వాల మండల పరిధిలోని మేళ్లచెరువు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయిసాకేత్ రెడ్డి హాజరయ్యారు. నూతన గృహప్రవేశం చేసిన లబ్ధి దారులకు ఎమ్మెల్యే తనయుడు కానుకను అందజే శారు. లబ్ధిదారులు ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదా రులు, నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా గద్వాల నియోజకవర్గం ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాలు చేయాలన్నారు.

అప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి ఇంది రమ్మ రాజ్యం ఏర్పడడానికి సాధ్యమవుతుందని తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం జరిగినదన్నారు. దాదాపుగా 2000లకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సూభాన్, సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీ తిమ్మన్న, నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, రాముప్ప, రుక్కన్న, కిట్టు, రమేష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగుల పంచమికి ఆలయాలు ముస్తాబు

నాగదేవతకు ప్రత్యేక పూజలు

భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు

**ప్రజాపక్షం/నారాయణపేట :** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని నాగ దేవత ఆలయాలు, శివాలయాల్లో ప్రత్యేక పూజ లకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సంద ర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవాలయాల నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నాగుల పంచమి సందర్భంగా భక్తులు ఉదయాన్నే ఆల యాలకు చేరుకుని నాగదేవతకు పూజలు నిర్వ హించనున్నారు. పసుపు, కుంకుమ, పూలు, అక్షింతలు సమర్పించి కుటుంబ సుఖశాం తులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగా లని ప్రార్థించనున్నారు. పుట్టల వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించనున్నారు.

**భక్తుల భద్రతకు ప్రాధాన్యం :** భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని దేవాల యాల వద్ద క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, వాహనాల రాకపోకలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయాలు వంటి అంశాలపై నిర్వాహకులు దృష్టి పెట్టాలి. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**భక్తి, భద్రత రెండూ ముఖ్యం :** నాగుల పంచమి భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు దేవాలయాల వద్ద భక్తుల భద్రతకు నిర్వాహ కులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులే కుండా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజలు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవ క్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్త దేవస్థానములో శ్రావణమాసం నాగులచవితి సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజలు చేసి పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులు సమర్పించారు. ఆలయ ఆవరణలో సహజసిద్ధమైన పుట్టకు నాగదేవతలను ప్రతిష్ఠ చేయడం జరిగింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం ఎక్కడ..?

అందుబాటులో లేని వైద్యులు

గర్భిణీల కన్నీళ్లు... అత్యవసర వేళల్లో ప్రాణాలకు భరోసా ఏదీ?



**ప్రజాపక్షం/నారాయణపేట :** పేదల ప్రాణా లకు ప్రభుత్వ వైద్యమే దిక్కు. అలాంటి ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యులు అందుబాటులో లేక పోతే పేద రోగుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు, ముఖ్యంగా పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుప త్రిలో గర్భిణీలు వైద్యుడి కోసం ఎదురుచూ స్తున్న కన్నీటి పర్యంతమైన పరిస్థితి కనిపించిం దని బాధితులు వాపోతున్నారు. ప్రైవేట్ ఆసుప త్రికి వెళ్లే స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రినే ఆశ్ర యించిన తమకు వైద్యుడు అందుబాటులో లేక పోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

**అత్యవసర వేళల్లో భరోసా ఏదీ? :** పాము కాటు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థి తుల్లో ప్రతి నిమిషం కీలకం. ఇటీవల పాముకా టుకు గురైన విద్యార్థి మృతి చెందిన ఘటన ప్రజలను కలచివేసింది. అదే విధంగా నారాయ ణపేట పరిధిలో గుండెపోటు కారణంగా పలు వురు మృతి చెందిన ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. అత్యవసర పరిస్థి తుల్లో ఆసుపత్రికి వచ్చిన రోగికి వెంటనే వైద్యుడు అందుబాటులో ఉంటున్నారా? అవస రమైన నిపుణుల సేవలు ఉన్నాయా? అత్యవసర చికిత్సకు అవసరమైన సదుపాయాలు, మందులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు అధికారులు సమా ధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**డాక్టర్ ఎవరు...? శిక్షణ వైద్యుడు ఎవరు...?:** ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులు, శిక్షణలో ఉన్న వైద్యులు, ఇంటర్న్‌లు ఎవరు అనే విష యంలో సాధారణ రోగులకు స్పష్టత లేకపో వడంపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యుల హాజరు ఎలా ఉంది? డ్యూటీ రోస్టర్ ప్రకారం వైద్యులు విధులకు హాజరవుతు న్నారా? రాత్రి వేళల్లో అత్యవసర సేవలకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? అన్న అంశాలను అధికారులు పరిశీలించాలి.

**ప్రైవేట్ వైద్యంపై ఆరోపణలపై విచారణ చేయాలి :** ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వ హించాల్సిన కొందరు వైద్యులు ప్రైవేట్ ఆసుప త్రుల్లో కూడా పనిచేస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవా లను ప్రజల ముందుంచాలి. ఆరోపణలు నిజ మైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అవాస్తవమైతే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి.

**సూపరింటెండెంట్ పర్యవేక్షణపై ప్రశ్నలు :** ఆసుపత్రిలో వైద్యుల హాజరు, రోగులకు అందు తున్న వైద్యం, అత్యవసర సేవలు, మందులు, పరీక్షలు తదితర అంశాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆసుపత్రి యాజమాన్యంపై ఉంది. గర్భి ణీలు వైద్యుడి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆసుపత్రి నిర్వహణపై పర్యవేక్షణ ఎలా ఉంది? అనే ప్రశ్నలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**ఓటు సమయంలోనే ప్రజలు గుర్తొస్తారా? :** ఎన్నికల సమయంలో ప్రజల మధ్యకు వచ్చి తమకు తామే ప్రజల పక్షమని చెప్పు కునే రాజకీయ నాయకులు.. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం ఇబ్బం దులు పడుతున్న సమయంలో ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తు న్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు స్పందించి ప్రభుత్వ ఆసుప త్రిలో వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ అంశంపై రాజకీయాలకు అతీ తంగా అన్ని పార్టీల నాయకులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు కోరారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి :** నారాయ ణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల హాజరు, అత్యవసర విభాగం పనితీరు, గర్భిణీలకు అందుతున్న వైద్యం, పాముకాటు చికిత్స, గుండెపోటు అత్యవసర సేవలు, మందులుపరీ ఓలు లభ్యతపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు చివరి ఆశ. అక్కడ డాక్టర్ కోసం రోగి ఎదురుచూడకూడదు. వైద్యం కోసం పేద వాడు అప్పులపాలు కాకూడదు. అత్యవసర సమయంలో చికిత్స ఆలస్యం కారణంగా ఒక్క ప్రాణం కూడా పోకూడదు. ప్రభుత్వ ఆసుపత్రి ఉంది.. కానీ వైద్యం ఎక్కడ? అనే పరిస్థితి రాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని నారాయణపేట ప్రజలు కోరుతున్నారు.



## ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి

బిఆర్‌టియు జిల్లా ఇన్‌చార్జి గంజిపేట రాజు

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బిఆర్‌టియు జిల్లా ఇన్‌చార్జి గంజిపేట రాజు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న ఉదయం 10గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బిఆర్‌టియు కార్యాలయంలో నిర్వహించే ఆశ వర్కర్స్ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ ఆరోగ్య వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారికి తగిన వేతనాలు, సామాజిక భద్రతా సదుపా యాలు లేకపోవడం అన్యాయమన్నారు. ఆశా వర్కర్లకు మేనిఫెస్టోలో పెట్టిన 18వేల వేతనం ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కలిపించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన అదనపు రూ.1500 పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. పిఆర్సీ ఎరియర్స్, సర్వేలు, పోలియో కార్యక్రమాలు, ఎన్నికల విధులు వంటి పలు పనులకు సంబంధించిన బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. వీటిని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు రూ.50లక్షల ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులకు 50,000 సహాయం, పిఎఫ్, ఈఎస్ఐ లాంటి సామాజిక భద్రత పథకాలను అమలు చేయాలని గంజి పేట రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వంశీ, కుమార్, అకేపోగు రాజు, శివ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## 16న ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/అయిజ :** అయిజ మండలంలోని సంకాపురం గ్రామంలో హైదరా బాద్ రామకృష్ణ మఠ సౌజన్యంతో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 16 ఆదివారం నాడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెంకట్రాములు , కృష్ణ, సత్యనారాయణలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరా నికి నిపుణులైన వైద్యులు వస్తున్నట్లు తెలిపారు. కావున గ్రామస్తులతో పాటు పరి సర గ్రామాల ప్రజలు తమకున్న ఆరోగ్య సమస్యలను వైద్యుల ద్వారా చూయిం చుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండలం నాయినోని పల్లి గ్రామానికి చెందిన ముష్టి నీలాద్రి వ్యవసాయదారుని ఎద్దు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. ఈ ఎద్దు విలువ సుమారు 1,50,000 ఉంటుందని తెలిపారు. ఎద్దు మరణించడంతో రైతు నీలాద్రి తన పంట పొలాలకు పని చేసుకోవడానికి చాలా ఇబ్బందిగా పంటలు నష్టపోవడానికి కూడా అవకాశం ఉందని తెలిపారు. కావున ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ శాఖ ద్వారా ఘట నపై విచారణ జరిపించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

# నిరుద్యోగ యువతకు ఉద్దీపన బాసట

### ప్రభుత్వ విప్ వేముల వీరేశం




**ప్రజాపక్షం/నకిరేకల్ :** నిరుద్యోగ యువతకు ఉద్దీపన బాసటగా నిలిచి వారి లక్ష్యసాధనకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే, ఉద్దీపన చైర్మన్ వేముల వీరేశం పేర్కొన్నారు.ఆదివారం ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత పోటీ పరీక్షల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. 2015లో ప్రారంభించిన ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద,మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.పట్టణంలో ఉద్దీపన పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్య అందిస్తున్నామన్నారు.కరోనా సమయంలో కషాయ కేంద్రాలు, అవసరమైన కిట్ల పంపిణీ చేశామని,మృతుల అంత్యక్రియల్లో కూడా దగ్గరుండి మానవతా సేవలు అందించామని గుర్తు చేశారు.నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, నకిరేకల్ పట్టణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత, సీనియర్ నాయకులు పూజర్ల శంభయ్య,చామల శ్రీనివాస్,నాగులవంచ వెంకటేశ్వర్లు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బెల్లి యాదయ్య, పట్టణ సీఐ హరిబాబు,ఆర్‌సీ రెడ్డి కోచింగ్ అధ్యాపకులు వేముల సైదులు,కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాదగోని కొండయ్య, టౌన్ అధ్యక్షులు లింగాల వెంకన్న, ఉద్దీపన కోఆర్డినేటర్ చెరుకు సతీశ్ , వి.వి.యం పాఠశాల ప్రిన్సిపల్ భద్రయ్య, సుకన్య మాజీ కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో బిజెపి విఫలం

### ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలి

### జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు




**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు విమర్శించారు. ఆదివారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ మండల నాయకులతో కలిసి మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రైవేటీకరణ, కార్పోటీకరణను వ్యతిరేకిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే డిమాండ్లతో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదాద్రి, భువనగిరి జిల్లాలో ఈ తెలంగాణ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2014 ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆహామీలను విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పోరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా ప్రయోజనాలను దెబ్బతిస్తోందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు విద్య, వైద్యాన్ని హక్కులుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, యువజనుల ప్రయోజనాలను పరిరక్షించే ప్రజానుకూల విధానాలను అవలంభిచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. యువజన సమస్యలు, విద్య, వైద్యం ప్రజాస్వామ్య హక్కులపై రాష్ట్ర మహాసభలలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కడారు మధు, ముస్కుల శ్రీనివాసరెడ్డి, బాలెబోయిన మహేష్, బెజవాడ సతీష్, పిల్లుట్ల రవి, నెమ్మాది గురుస్వామి, షేక్ నాగుల్‌మీరా, అంజిబాబు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. వరి సాగుకు స్వస్తి పలకాలి



### వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్య

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాత లోటు కొనసాగుతున్న నేపథ్యంలో వరి సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించి పప్పు దినుసులు, నూనెగింజలు, చిరుధాన్యాలు వంటి మెట్ట పంటల వైపు రైతులు మళ్లాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆల్దాస్ జానయ్య సూచించారు.ఆదివారం నల్లగొండలో వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం,రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.నాగార్జునసాగర్,ఎస్‌ఆర్‌ఎస్‌పీ ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై ఆశలు పెట్టుకుని కొత్తగా వరి నాట్లు వేయడం సరికాదని స్పష్టం చేశారు. ఇప్పటికే నార్లు పోసిన రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే ప్రస్తుతం 1012 శాతం వర్షపాత లోటు నమోదైందని, ఎనిమిది జిల్లాల్లో లోటు మైనస్ 30 శాతం వరకు చేరిందని తెలిపారు.గత 30 ఏళ్లలో సుమారు ఆరు ఎల్‌నినో సంవత్సరాలను ఎదుర్కొన్నామని, ఇది కొత్త పరిణామం కాదన్నారు. అయితే ఈసారి నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, రైతు సంఘాలు, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో అఖిల భారత కిసాన్‌సభ 36వ మహాసభను నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని,దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది రైతు ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ర్యాలీ,బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ సెమినార్‌లో,విశ్రాంత ప్రొఫసర్ అరిబండి ప్రసాదరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి,రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,వీరపల్లి వెంకటేశ్వర్లు,కందాల ప్రమీల,బండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కొనసాగించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జాతీయ రహదారి 65 మీదుగా కేంద్రం ముందుగా ప్రతిపాదించినట్లు బుల్లెట్ ట్రైన్ కొనసాగించాలని కోరుతూ సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆయన ప్రజల అవసరాలను, వర్తక, వాణిజ్య అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ మంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానన్నారు. మంత్రిని కలిసిన వారిలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్షాల కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, పాదూరి కరుణ, అనుములపురి రవిబాబు, మల్లు నాగార్జున్ రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, రమణాచారి, చల్లమల్ల నరసింహ, జీడి బిక్షం, కర్నాటి కిషన్, మల్లు లక్ష్మి ఉన్నారు.

# బిగ్‌బాస్ అగ్నిపరీక్ష టాప్ 15లో సూర్యాపేట యువతి

### ఫోక్ సింగర్ గుండెబోయిన ఝాన్సీ ఎంపిక పట్ల అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బిగ్‌బాస్ టాప్ 15లో సూర్యాపేట యువతి స్థానం సంపాదించుకుంది. మున్సిపాలిటి పరిధిలోని కోమటికుంటకు చెందిన సింగర్ గుండెబోయిన ఝాన్సీ ఎంపిక కావడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య కుటుంబానికి చెందిన గుండెబోయిన సైదులు హేమలతలకు ముగ్గురు ఆడపిల్లలు కాగా చివరి సంతానం కుమారుడు జన్మించారు. వీరిలో 3వ సంతానమైన ఝాన్సీ చిన్ననాటి నుండి పాటలు, కళలపై ఆసక్తి పెంచుకోవడంతో ఆమె తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. పిజిలో ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన ఆమె ఫోక్ సింగర్‌గా రాణిస్తూ ఈ ప్రాంతంలో మంచి గుర్తింపు పొందింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఝాన్సీ తండ్రికి పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటూ నాగలి కూడా దున్నుతూ కొడుకులా పొలం పనులు చేస్తుంది. ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా తన ప్రతిభతోనే అవకాశాలను అందిపుచ్చు కుంటూ బుల్లితెర వరకు వెల్లగలిగింది. బిగ్‌బాస్ పరీక్షల్లో పాల్గొన్న ఝాన్సీ తన ఆట, పాట, వ్యక్తిత్వంతోపాటు విభిన్న అంశాలలో తన ప్రతిభను కనబర్చి వేదికపైన ఉన్న ప్రముఖులు బిందు మాధవి, నవదీప్, అభిజీత్ వంటి వారి నుండి శభాష్ అనిపించుకుంది. వేదికపై ఆమె ప్రదర్శించిన ఫెర్మారెన్స్ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షించింది. బిగ్‌బాస్ టాప్ 15 వరకు చేరిన ఝాన్సీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాపేట నుండి ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని లక్షల వ్యూవ్స్ సంపాదించుకొని బుల్లితెర వరకు ప్రయాణం సాగించడం గమనార్హం. ఈ బిగ్‌బాస్ వేదికతో ఆమె జీవితం కొత్త మలుపు తిరగనుంది.

# బోనమెత్తిన భానుపురి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శ్రావణ మాసం ప్రారంభం కావడంతో సూర్యాపేట (భానుపురి) పట్టణంలో ఆదివారం బోనాల పండుగ సందడి మొదలైంది. స్థానిక ఊరు ముత్యాలమ్మ అమ్మ వారికి భక్తులు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. ఉదయం 7.30 గంటల నుండి మొదలుకొని రాత్రి పొద్దుపోయేంత వరకు ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు. అమ్మ వారికి కొత్త కుండలో బోనం వండి దానిని పసుపు, కుంకుమలతో అలంకరించడంతోపాటు వేప మండలను చుట్టూకట్టి డప్పు వాయిద్యాలతో ఇండ్ల నుండి బయలుదేరి అమ్మవారికి సమర్పించారు. అలాగే మేకలు, మేకపోతులు, కోళ్ళను బలి ఇవ్వడంతో పాటు అమ్మవారికి చీర సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగా చూడాలని వర్షాలు సమృద్ధిగా పడి పాడి పంటలు బాగా పండాలని, ఆయురోరాగ్యోలు బాగుండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఊరు ముత్యాలమ్మతోపాటు ఆయా కాలనీల సమీపంలో ఉన్న ముత్యాలమ్మలకు కూడా స్థానికులు బోనాలు చెల్లించారు. పట్టణంలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

# సాహిత్య అస్తిత్వ ఉద్యమాల పుట్టినిల్లు నల్లగొండ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలుగు సాహిత్య చరిత్రలో నల్లగొండ విశిష్ట స్థానం సంపాదించుకున్నదని, అనేక ప్రక్రియలకు, సాహిత్య అస్తిత్వ ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలిచిందని ప్రముఖ సాహిత్య పరిశోధకుడు, సాహితీవేత్త డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు.పట్టణంలోని యుటిఎఫ్ భవన్ లో బోధనం నర్సిరెడ్డి రచించిన తేనె మరక,కత్తిని గాయపరుద్దాం రెండు కవిత్వ సంపుటాల ఆవిష్కరణ సభకు ఆయన విచ్చేసి ప్రసంగించారు.సృజన సాహితీ ఆధ్వర్యంలో ఎలికట్టె శంకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విప్లవోద్యమాలు మొదలు తెలంగాణ ఉద్యమం దాకా అనేక చారిత్రక పరిణామాలను బోధనం నర్సిరెడ్డి కవిత్వం రికార్డు చేసింది అన్నారు. తేనె మరక ఆవిష్కరించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా మూడు తరాలతో కలిసి నడిచిన బోధనం నర్సిరెడ్డి ఆయా సందర్భాల మానవ స్పందనలను తన కవిత్వం లో చిత్రించారన్నారు.ప్రముఖ విమర్శకులు కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విప్లవోద్యమాల ప్రభావంతో బోధనం గొప్ప కవిత్వాన్ని కథలను వెలువరించారన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పగడాల నాగేందర్,బైరెడ్డి కృష్ణారెడ్డి,డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, కుకుడాల గోవర్ధన్, పెరుమాళ్ల ఆనంద్,గౌస్ మొహియుద్దీన్,డాక్టర్‌సాగర్ల సత్తయ్య, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,డాక్టర్ హసేనా, గజ్జెల రామకృష్ణ,బరిగెల శ్రవణ్ కూమర్, చెరుపల్లి సంధ్య, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# సిపిఐ నుండి బత్తిని నరేష్ సస్పెన్షన్

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బత్తిని నరేష్‌ను సిపిఐ మండల సమితి సిపిఐ పార్టీ నుండి సస్పెండ్ చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేక కార్యకలా పాలను నిర్వహిస్తున్న నరేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కార్య వర్గ సభ్యు లు ఉప్పల ముత్యాలు, కుసుమని హరిశ్చంద్ర తెలిపారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించిన నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి నందుకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రకటించింది. ఇకపై బత్తిని నరేష్‌కు పార్టీతో ఎటువంటి అధికారిక సంబంధం ఉండదని,పార్టీ పేరు, హోదా పార్టీ కార్యక్రమాలకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్,సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, పల్లెపహాడ్ గ్రామ శాఖ కార్యదర్శి కాలే మల్లేష్ పాల్గొన్నారు.

# పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.నల్లగొండ ప్రాంతంలోని గురుకులాల్లో రాజకీయ శాస్త్రం, గణాంక శాస్త్రం, తెలుగు, ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం, రసాయన శాస్త్రం, జంతుశాస్త్రం, హిందీ, సోషల్, బయోసైన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర సబ్జెక్టుల్లో పోస్టులు ఉన్నాయి.అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 14 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నల్లగొండలోని ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి.దరఖాస్తు ఫారంతో పాటు అర్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను అందజేయాలి.ఆగస్టు 24న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవంతిపురంలోని బాలుర గురుకుల పాఠశాలలో డెమో,ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దరఖాస్తుదారుల మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను డెమో, ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. బాలికల గురుకులాలకు మహిళలు,బాలుర గురుకులాలకు పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.మరిన్ని వివరాలకు 8333925379 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఖాళీల సంఖ్య పెరగవచ్చని లేదా తగ్గవచ్చని తెలిపారు.

# రెండు బస్సులు ఢీ : తప్పిన ప్రమాదం

### బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను శ్రమించి తీసిన పోలీసులు, ఫైర్ సిబ్బంది



**ప్రజాపక్షం/మునగాల:** సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని ఆకుపాముల వద్ద జాతీయ రహదారిపై రెండు బస్సులు ఢీకొట్టిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్పగాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. నర్సాపూర్ నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు, ఏలూరు నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న ఎపిఎస్‌ఆర్టీసీ సూపర్‌లగ్జరి బస్సు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు బస్సులు ఒక్కసారిగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాయి.

**బస్సులో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో ఉత్కంఠ**

ప్రమాదతీవ్రతతో ఎపిఎస్‌ఆర్టీసీ బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న మునగాల ఎస్‌ఐ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనస్థలానికి చేరుకున్నారు. డ్రైవర్‌ను బయటకు తీసేందుకు సుమారు రెండుగంటలు శ్రమించి బయటకు తీశారు. కల్వర్టు, చెట్టు ఢీకొట్టడంతో ఆర్టీసీ సూపర్‌లగ్జరి బస్సు కిందకు వెళ్లకుండా ఆగిపోయింది. దీంతో భారీ ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. లేదంటే పరిస్థితి మరింత తీవ్రంగా ఉండేదని స్థానికులు తెలిపారు.

**సురక్షితంగా 63 మంది ప్రయాణికులు**

ప్రమాదంలో శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో 31 మంది, సూపర్‌లగ్జరి బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 63 మంది ప్రయాణికులు ఉండగా, అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదని, ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పోలీసులు వెనుక నుంచి వచ్చే బస్సులను ఆపి, ప్రయాణికులను ఆయా బస్సుల్లో ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించారు. ఎస్‌ఐ సంజీవరెడ్డి సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదంలో చిక్కుకున్న వారిని సకాలంలో రక్షించడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. దీంతో పలువురు ఎస్‌ఐని, పోలీసులను అభినందించారు.

# కాంట్రాక్టర్,విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..కార్మికుడి ప్రాణాల మీదికి

### భూమికి సమీపంలో విద్యుత్ నియంత్రిక.. డ్రైనేజీ పనుల్లో బిహార్ కార్మికుడికి షాక్

### సకాలంలో స్పందించిన 108 సిబ్బంది.. సిపిఆర్‌తో ప్రాణాలు కాపాడిన వైనం



**ప్రజాపక్షం/మునుగోడు:** నిర్మాణ పనుల వద్ద భద్రతా చర్యలు చేపట్టకపోవడం,విద్యుత్ నియంత్రికలు ప్రమాదకరంగా ఉండటంతో కార్మికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. మునుగోడు మండల కేంద్రంలోని చండూరుచౌటుప్పల్ రహదారిలో ఆదివారం ఉదయం జరిగిన విద్యుత్ ప్రమాదమే ఇందుకు నిదర్శనం. డ్రైనేజీ పనులు చేస్తుండగా భూమికి సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రికను తాకడంతో బిహార్‌కు చెందిన కార్మికుడు ముజాముల్‌కు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో సిబ్బంది సకాలంలో చేరుకుని సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విద్యుత్ నియంత్రిక భూమికి కేవలం రెండు అడుగుల లోతులోనే ఉందని,ప్రమాదం జరిగే అవకాశం ఉందని అధికారులకు గతంలోనే తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు కాంట్రాక్టర్ కూడా కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోలేదని,ప్రమాదం అనంతరం బాధితుడిని పరామర్శించకపోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు చేపట్టే ముందు విద్యుత్ లైన్లు, నియంత్రికల భద్రతను పరిశీలించి, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా అధికారులు, కాంట్రాక్టర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# పద్మానగర్.. ప్రమాదాల జంక్షన్

### మూస్తే ముప్పు.. తెరిస్తే ప్రమాదం

### హెచ్చరికలున్నా.. ఆగని వేగం + అండర్‌పాస్ శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్ ప్రమాదాలకు కేంద్రంగా మారింది.హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి65పై వాహనాలు అతివేగంగా దూసుకెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికే దీనిని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా ముప్పు మాత్రం తప్పడం లేదు.ప్రమాదాల నివారణలో భాగంగా గతంలో జంక్షన్ క్రాసింగ్‌ను మూసివేశారు. దీంతో పద్మానగర్, బైరెడ్డిగూడెం, చందంపల్లి, గొల్లగూడెం, అయిటిపాముల, కట్టంగూరు తదితర ప్రాంతాల ప్రజలు నకిరేకల్ వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. దూరభారాన్ని భరించలేక కొందరు బారికేడ్ల మధ్య నుంచి హైవే దాటగా.. మరికొందరు ఎదురుదిశలో ప్రయాణించారు. దీంతో ఈ మార్గంలో మరో ప్రమాదం జరిగే అవకాశముందని గుర్తించి ప్రజల విజ్ఞప్తి మేరకు అధికారులు క్రాసింగ్‌ను తిరిగి తెరిచారు. సిగ్నల్ లైటింగ్, స్పీడ్‌బ్రేకర్లు,హెచ్చరిక చర్యలు చేపట్టారు.

**మరో ప్రాణం బలి**

క్రాసింగ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆదివారం ఉదయం మరో ప్రమాదం జరిగింది. నకిరేకల్ వైపు నుంచి డీసీఎం వాహనం రోడ్డు దాటుతుండగా.. విజయవాడ వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పద్మానగర్ జంక్షన్ భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.క్రాసింగ్ మూసివేసినప్పుడు ప్రజలు కొంత ఓపిక పట్టి దూరమైనా ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లి ఉంటే ఈ ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రాణాల కంటే దూరం, సమయం ముఖ్యమేమీ కాదని.. భద్రత కోసం కొంత ఇబ్బంది పడటంలో తప్పులేదని మేధావులు సూచిస్తున్నారు.





తాత్కాలిక చర్యలతో సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించదని స్థానికులు అంటున్నారు. హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా, గ్రామాలుకాలనీల ప్రజలు సురక్షితంగా రహదారి దాటేలా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.మరో ప్రాణం పోయిన తర్వాత స్పందించకుండా ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రాణం పోయిన తర్వాత చింతించటం కంటే.. ముందే జాగ్రత్త పడటం మేలు. పద్మానగర్ జంక్షన్‌కు శాశ్వత పరిష్కారం చూపాల్సిన సమయం ఇదే.

**అతివేగం వద్దు.. ప్రాణాలే ముద్దు : సిఐ హరిబాబు**

పద్మానగర్ జంక్షన్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని నకిరేకల్ పట్టణ సిఐ హరిబాబు కోరారు. హైవేపై అతివేగంగా ప్రయాణించకుండా నిర్ణీత వేగాన్ని పాటించాలని,జంక్షన్ సమీపంలో వేగాన్ని మరింత తగ్గించాలని పేర్కొన్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపవద్దని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించరాదని సూచిస్తున్నారు. జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డులు,లైటింగ్ ఏర్పాటు చేసి సిబ్బందితో పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు హెచ్చరికలను గమనించకుండా అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అతివేగం కన్నా ప్రాణాలే మిన్న అని ఆయన అన్నారు.

## సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/కొందుర్గు:** పేదోడి సొంతింటి కలను నేరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. అదివారం కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాలో స్వప్న శ్రీను లబ్దిదారులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేయించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మంజుల మల్లేష్ గౌడ్, మంగులాల్‌నాయక్, శ్రీనునాయక్, శ్రీరంగాపూర్ సర్పంచ్ రమేష్, చిన్న ఎల్కిచర్ల సర్పంచ్ రాజుకుమార్, పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింలు, గణేష్, లింబ్య, నర్సింలు నాయక్, సత్యనాయక్, కళ్యాణ్‌రెడ్డి, దర్శన్, శ్రీను, ఆకాష్ పాల్గొన్నారు.

## పేదల ఆర్థికాభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి వివరించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన విజయలక్ష్మి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ ఇంటిని ప్రారంభించి కుటుంబ సభ్యులను నూతన వస్త్రాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా చెంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాలు పేదల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని, సొంతింటి కలను సహకారం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ముబారక్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

## ఎస్‌సి యువత నూతన కమిటీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటి హాల్ కమిటీ, పాండురంగ దేవస్థానం కమిటి, అంబేద్కర్ జగజీవన్ రామ్ విగ్రహ కమిటీలను ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విత్యాల రవీందర్, పాండురంగ దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా చిల్కమర్రి యాదయ్య, గౌరవ అధ్యక్షుడిగా విత్యాల పాండరయ్య, ప్రధాన కార్యదర్శిగా విత్యాల నరసింహా, అంబేద్కర్ జగజీవన్ రామ్ విగ్రహా కమిటి అధ్యక్షుడిగా తాతోళ్ల హరికుమార్, గౌరవ అధ్యక్షుడిగా జోగు మల్లేష్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విత్యాల పాండు, విత్యాల రవీందర్, విత్యాల నరసింహులు, హేమాజీపురం చెన్నయ్య, బొబ్బిలిగామ పాండు, జోగు శివరాములు, ఇటిక్యాల అర్జున్, జోగు శ్రీశైలం, అంతారం శ్యామ్, ఉడిత్యాల యాదగిరి, మహేందర్, నాగభూషన్, శ్రీరంగాపురం శ్రీశైలం, మల్లారెడ్డిగూడెం లింగం, రమేష్, చెవిటిల్ల యాదయ్య పాల్గొన్నారు.

## వెంకట్‌రాంరెడ్డి విగ్రహ ఏర్పాటు



**ప్రజాపక్షం/కేశంపేట:** సంఘసంస్కర్త, విద్యావేత్త రాజా బహుదూర్ వెంకట్‌రాంరెడ్డి విగ్రహా ఏర్పాటుకు ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో మండలరెడ్డి సంఘం అధ్యక్షుడు తలసాని రంగారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి బీస కరుణాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ యోన్నం శ్రీధర్‌రెడ్డి, తాంద్ర శ్రావణ్ రెడ్డి, గోగు వెంకట్ నారాయణరెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ బండ రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచులు బుర్రి భూపాల్‌రెడ్డి, హరిశ్వర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, యారం భాస్కర్‌రెడ్డి, తలసాని మోహన్‌రెడ్డి, కర్రెల్ల నరేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, పోచారం జగన్‌రెడ్డి, వేములనర్వ ఆనంద్‌రెడ్డి, కొట్టం వెంకట్‌రెడ్డి, ఎద్మ సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుజీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి వాజ్‌పేయి పాత్ర మరువలేనిది : కొప్పుల



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి పాత్ర మరువలేనిది అని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. ఆదివారం వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని గుండె కిరణ్ కుమార్, మునగాల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో వాజ్‌పేయి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, యశ్పాల్‌గౌడ్, బండారి భాస్కర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గీతారెడ్డి, రాజేంద్రప్రసాద్, ఆదినారాయణ రెడ్డి, సాయిరాంగౌడ్, పాతూరి శ్రీధర్ గౌడ్, చిట్టిపోల్ రవికుమార్ పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు అభినందనీయం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నందమూరి జానకిరామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నందమూరి దీపిక జానకిరామ్ పలు ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శంకర్ పల్లి మండలం మోకిలా ప్రాంతంలో రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో జీవనం సాగిస్తున్న పేదలకు అన్నదానం నిర్వహించారు. అవసరంలో ఉన్న పేదవారికి వారికి గొడుగులు ఉచితంగా పంపిణీ చేశారు.

# వ్యర్థాల నుంచి ఖనిజాల వెలికితీత

### తెలంగాణ చారిత్రక అడుగు
### ఐఐటి హైదరాబాద్‌తో కలిసి ప్రణాళిక



తెలంగాణ రాష్ట్రం
Telangana State

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన నిల్వల పేరిట విచ్చలవిడిగా వాడుతున్న బ్యాటరీల వ్యర్థాలు రేపటి ముప్పునకు తార్కాణమని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అత్యంత సాహసోపేతమైన ముందడుగు వేసింది. దేశాన్ని కుదిపేస్తున్న ఈ ప్రమాదకర సంక్షోభానికి అడ్డుకట్టవేస్తూ వ్యర్థాల నుంచి వందశాతం కీలక ఖనిజాలను పునరుద్ధరించే అసాధారణ ప్రణాళికకు తెర లేపింది. మారుతున్న కాలానికి అనుగుణంగా దేశం హరిత ఇంధనం వైపు అడుగులు వేస్తున్నప్పటికీ దీని వెనుక దాగిఉన్న ముప్పును వ్యవస్థలు ఆలస్యంగా గుర్తిస్తున్నాయి. ప్రతి ఏటా లక్షలాది టన్నుల చొప్పున పేరుకు పోతున్న లిథియం అయాన్, లెడ్ యాసిడ్ బ్యాటరీలు భూగర్భ జలాలను, నేలను విషపూరితం చేస్తున్నాయి. చైనా వంటి దేశాల గుప్పిట్లో ఉన్న కోబాల్ట్. నికెల్, లిథియం, అరుదైన భూమూలకాల( రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) సరఫరా గొలుసు రేపు తెగిపోతే భారత సాంకేతిక రంగం అంధకారంలోకి కూరుకుపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యర్థాల నిర్వహణను ఒక 'వ్యాపార అవకాశంగా ' కాకుండా 'జాతీయ రక్షణ బాధ్యతగా' మలచాలని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నాయి. ఈముప్పును ముందే పసిగట్టిన టిజిపిసిబి(తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి), ప్రతిష్టాత్మక ఐఐటి హైదరాబాద్ సమన్వయంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండటి( సిపిసిబి) సహకారంతో ఒక రోజు అత్యున్నత స్థాయి జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. ఈ నెల 19న సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ భవన్ దీనికి వేదిక కాబోతోంది. సెప్టెంబరు 15వ తేది నుంచి 18 వరకు జరగనున్న పదవ ప్రపంచ సర్క్యులర్ ఎకానమి ఫోరం సన్నాహక సదస్సులలో భాగంగా ఈకార్యక్రమం రూపుదిద్దుకుంది. పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ అంతర్జాతీయ ప్రయాణంలో దేశం తరపున తెలంగాణ రాష్ట్రం తీసుకుంటున్న ఈ చర్యలు యావత్ దేశానికి దిశా నిర్దేశం చేయనున్నాయి.

## సర్పంచ్ బాబునాయక్‌ను సన్మానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సర్పంచ్ బాబునాయక్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండలం వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ బాబునాయక్ జన్మదినం పురస్కరించుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో రాజకీయంగా మరెన్నో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం, గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సర్పంచ్ బాబునాయక్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొందుర్గు సింగిల్ విండో చైర్మెన్ జితేందర్ రెడ్డి, ఫరూక్‌నగర్ మండల సింగిల్ విండో వైస్ చైర్మెన్ తుపాకుల శేఖర్, సర్పంచ్ గుబ్రునాయక్, కాంగ్రెస్ నేతలు దంగు శ్రీనివాస్ యాదవ్, జాంగారి రవి, జాంగారి జంగయ్య, బుడ్డ నర్సింహులు, భాస్కర్‌నాయక్, సాజిత్, నాని, సీతారాం, లింగారెడ్డిగూడ అశోక్‌లు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్

### పార్ధీ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
### చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వర్తి గ్రామంలో లాక్ చేసిన ఇళ్లు, షట్టర్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పార్ధీ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు నిందితులను శంకర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నిందితులు ఎల్వర్తి గ్రామంలో తిరుగుతూ లాక్ చేసిన ఇళ్లను గుర్తించేవారని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న అనంతరం ఇనుప రాడ్ సహాయంతో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించేవారు. బీరువాల తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు, ఇతర విలువైన వస్తువులను దొంగిలించి అక్కడి నుంచి పరారయ్యేవారు. వాహనాల తనిఖీల సమయంలో గ్రామం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా శంకర్‌పల్లి పోలీసులు వారిని పట్టుకున్నారు. నిందితులు గత ఆరు నెలలుగా శంకర్‌పల్లి, బిడిఎల్ భానూర్, గజ్వేల్, పరిసర ప్రాంతాల్లో లాక్ చేసిన ఇళ్లు, షట్టర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న పార్ధీ గ్యాంగ్‌లో సభ్యులని వెల్లడైంది. ఇప్పటివరకు 11 దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసుల దర్యాప్తులో ఈ గ్యాంగ్‌లో సుమారు 20 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన ఐదుగురు పురుషులు ఉన్నట్లు గుర్తించారు. వీరు మహారాష్ట్రలోని సోలాపూర్, జాల్నా జిల్లాల పరిసర ప్రాంతాల నుంచి రైలులో మహిళలు, చిన్నారులతో కలిసి వచ్చి, శంకర్‌పల్లి, లింగంపల్లి, టోలిచౌకీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల సమీపంలో చిన్న గుడారాలు ఏర్పాటు చేసుకుని తాత్కాలికంగా నివసించేవారు. పగటి సమయంలో మహిళలు, చిన్నారులు గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ లాక్ చేసిన ఇళ్లు, షట్టర్లు, జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాలను గుర్తించేవారు. రాత్రి సమయంలో పురుషులు కాలినడకన పొలాలు, పొదలు మరియు ఇతర నిర్మానుష్య ప్రాంతాల గుండా వెళ్లి, కొన్నిసార్లు మోటార్‌సైకిళ్లపై ప్రయాణిస్తూ గ్రామ శివారు ప్రాంతాల్లోని ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారు. దొంగతనానికి ముందు నిందితులు మాస్కులు, గ్లౌజులు ధరించి పరిసర ప్రాంతాలను పరిశీలించేవారు. ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు కాపలాగా ఉండగా, మిగిలిన వారు ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు మరియు ఇతర విలువైన వస్తువులను దొంగిలించేవారని డిసిపి వివరించారు. తమను అడ్డుకునే వారిపై దాడి చేసేందుకు కొడవళ్ల వంటి ఆయుధాలను కూడా వెంట తీసుకెళ్లేవారని విచారణలో వెల్లడైందని చెప్పారు. దొంగిలించిన వస్తువులను శివమణి,గ్యాంగ్‌లోని మహిళా సభ్యుల ద్వారా విక్రయించి నగదుగా మార్చుకునేవారని పోలీసుల విచారణలో వెల్లడైందని ఆయన స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు నిధులు మంజూరు

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో ఆదివారం గడ్డం అరుణ ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నదన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని పేదవారికి స్థలం ఉంటే రూ.ఐదులక్షలు ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారులకి స్థలం లేకుండా ప్రభుత్వం స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూపాయలు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చేకూర్త గోపాల్ రెడ్డి, మోకిలా సర్పంచ్ చితంపల్లి శేఖర్, మోకిలా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌండ్ర సత్యం, నాయకులు నరేందర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, పోలీస్ రామ్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## లోవోల్టేజీ నివారణకు కృషి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యుత్ లోవోల్టేజీ సమస్యను నియంత్రించేందుకే సింగిల్ ఫెస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ చందునాయక్ వివరించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీలోని లాల్‌సింగ్‌తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సింగిల్ ఫెస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీలత తిరుపతయ్య, బోజ్యానాయక్, తిక్కన్న, ఈర్ల యాదయ్య, రాజు, వెంకటేష్, పెంటయ్య, లాలూ పాల్గొన్నారు.



## ప్రతి సర్వే నంబర్‌కు ఆధారాలతో వర్క్‌షీట్ సిద్ధం

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సెక్షన్ 22ఎ కింద ఉన్న భూ రికార్డులను సమగ్రంగా పునః పరిశీలించి, ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూములను మాత్రమే 22ఎ జాబితాలో కొనసాగించాలని, ప్రభుత్వ ప్రయోజనం లేని భూములను సంబంధిత రికార్డులు,ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయపరమైన ఆధారాలను పరిశీలించి నిబంధనల ప్రకారం జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సెక్షన్ 22ఎ భూ రికార్డుల సవరణ పై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సర్వే నంబర్‌ను లోతుగా పరిశీలించాలని,కేవలం గతంలో 22ఎ జాబితాలో ఉందనే కారణంతో భూమిని కొనసాగించరాదని, 22ఎలో కొనసాగించడానికి స్పష్టమైన ప్రభుత్వ ప్రయోజనం, సంబంధిత రికార్డులు, పక్కా ఆధారాలు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సెక్షన్ 22ఎ లోని 1ఎ నుంచి 1ఇ వరకు కేటగిరీలను సంబంధిత నిబంధనలు,ప్రభుత్వ ఉత్తర్వులు,రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.అదేవిధంగా అసైన్డ్ ల్యాండ్స్,ప్రభుత్వ భూములు,వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్, సీలింగ్,యుఎల్ సి తదితర ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూములకు సంబంధించి పూర్తి ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనం లేదని రికార్డుల ద్వారా నిర్ధారణ అయిన భూములను 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖస్రా పహాణీ,పహాణీ,ఐజిఆర్ఎస్ రికార్డులు,పాతకొత్త సర్వే నంబర్లు,గెజిట్ నోటిఫికేషన్లు, యుఎల్ సి,సీలింగ్ రికార్డులు,ల్యాండ్ అక్విజిషన్ రికార్డులు,సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు తదితర ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. గతంలో వివిధ కారణాలతో 22ఎ జాబితాలో చేరిన భూములకు సంబంధించి అనంతరం రెగ్యులరైజేషన్, ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు ఆదేశాలు లేదా ఇతర మార్పులు జరిగినప్పటికీ రికార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ వివరించారు. అంతేకాకుండా ప్రతి సర్వే నంబర్‌ను ప్రస్తుత రికార్డులతో క్రాస్ వెరిఫై చేయాలని ఆదేశించారు. తప్పుగా నమోదైన విస్తీర్ణం, సర్వే నంబర్, కేటగిరీ తదితర వివరాలను సరి చేయాలని, జీరో ఎక్స్‌టెంట్ ఉన్న చోట సరైన వివరాలు నమోదు చేయాలని, అధికంగా నమోదైన విస్తీర్ణాన్ని సరిచేయాలని సూచించారు. రెగ్యులరైజ్ అయిన విస్తీర్ణాన్ని సంబంధిత ఆధారాల ప్రకారం గుర్తించి, అవసరమైన సవరణలు చేపట్టాలని తెలిపారు. భూదాన్ భూముల విషయంలో పాత సర్వే నంబర్,కొత్త సర్వే నంబర్,సంబంధిత పాత రికార్డులు,భూమి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించి,పూర్తి ఆధారాలతో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. 22ఎకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు,అభ్యంతరం లేదా సందేహాన్ని సంబంధిత తహసీల్దార్లు సబ్‌రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేసుకు ప్రత్యేక రిమార్క్ నమోదు చేసి, కేసు సంఖ్య, సర్వే నంబర్, అభ్యంతర స్వరూపం, పరిశీలించిన ఆధారాలు, తీసుకున్న నిర్ణయం తదితర వివరాలను రోజువారీ ప్రొఫార్మాలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

## తెలంగా ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక బోనాలు

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** శ్రావణ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించటం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్‌తో కలిసి పలు ఆలయాలను సందర్శించారు. కార్యక్రమాల్లో బిఆర్ఎస్ నాయకులు ముత్యాల సాగర్ ముద్దగోని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వీరన్నగుట్ట :** అమ్మవారిని మొక్కిన భక్తులకు కొంగు బంగారము అయ్యి దీవెనలు ఇస్తూ భక్తుల కోరికలను నెరవేస్తున్నారని మాజీ స్టాండింగ్ కమిటీ మెంబర్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాత మన్సూరాబాద్ డివిజన్‌లో నీ కొత్త డివిజన్ లెక్చరర్స్ కాలనీ డివిజన్‌లోని, హయత్‌నగర్ బ్లాక్ ఆఫీస్ ఆవరణలోని, బృందావన్ కాలనీ , ప్రగతి నగర్ కాలనీ పవనగిరి కాలనీ, వీరన్న గుట్ట లోని పోచమ్మ, నల్ల పోచమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.నరేష్ రెడ్డి, పారంద నర్సింగ్‌రావు, కెకె ఎల్.గౌడ్, ఆనంద్ యాదవ్, నరసింహ గౌడ్, నాయిని నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

**లెక్చరర్స్ కాలనీ :**బోనాల పండుగను పురస్కరించుకొని ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని, వీరన్న గుట్ట కాలనీలలో దేవాలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిగౌడ్, కళ్ళెం నరసింహారెడ్డి, ఎర్ర మహేందర్, ఇరిగి రమేశ్, నగేష్, చుక్క వెంకటేష్, పుల్లయ్య పాల్గొన్నారు.







## అకట్టుకున్న అక్షయ నృత్య ప్రదర్శన

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ శాఖ జాగృతి ఫౌండేషన్, హైద్రాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో చిన్నారులతో నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన నాట్య నివేదాలయం గురువు భార్గవి శిష్యురాలైన అక్షయ చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుంది. నందిత, తేజశ్రీ, యుక్త ప్రణవి, కల్పన, స్నేహా, సాయి, సుదీక్ష, తను, ఆద్వితీ, చార్నవి అనే చిన్నారులు తమ నృత్యలతో ప్రశంసలు పొందారు. కళా జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువు భార్గవి చిన్నారులను సత్కరించారు.

## '22-ఎ' నిషేధిత జాబితాపై అదనపు కలెక్టర్ పరిశీలన


**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాజేంద్రనగర్, చేవెళ్ల, గండిపేట్ మండలాలలో 22ఏ నిషేధిత జాబితా(ప్రోహిబిషన్ లిస్ట్)కు సంబంధించిన రికార్డులు, పత్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి ఆదివారం రాజేంద్రనగర్, గండిపేట, చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అధ్యక్షతన సోమవారం( నిర్వహించనున్న సమీక్షా సమావేశం నేపథ్యంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలోని 22ఏ నిషేధిత జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా 22ఏ జాబితాలో ఉన్న భూములు, సంబంధిత రికార్డులు, ఆధార పత్రాలను పరిశీలిస్తూ వివరాలను సరి చూశారు. ప్రతి గ్రామానికి సంబంధించిన జాబితాను ఆయా రికార్డులు, డాక్యుమెంట్లతో సరి పోల్చి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. 22ఏ కింద చేర్చిన భూములకు సంబంధించి అందుబాటులో ఉన్న రిజిస్టర్లు, రెవెన్యూ రికార్డులు, సంబంధిత ఉత్తర్వులు, ఇతర ఆధార పత్రాలను క్రమబద్ధంగా పరిశీలించి, ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రామాల వారీగా 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన సమాచారాన్ని స్పష్టంగా, ఆధారాలతో కూడిన విధంగా సిద్ధం చేసి, సమీక్షా సమావేశానికి అందుబాటులో ఉంచాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో చేవెళ్ళ ఆర్‌డిఒ పార్థసింహ రెడ్డి, తహసీల్దార్ రాములు, గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఎజెండా 'మహిళా రిజర్వేషన్' కాదు...

# మోదీని కాపాడుకోవడమే...

- ప్రతిపక్షాలకు ప్రధానమంత్రి విజ్ఞప్తి నాటకం
- ఎర్రకోట నుంచి నీతులు చెప్పడం మానుకోవాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** మహిళా కోటా అమలుపై ప్రధాని మోదీ వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు సంధించింది. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ఆధారిత బిల్లుకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి నాటకమని మండిపడింది. ప్రధాని ఏకైక అజెండా 'మహిళా రిజర్వేషన్లు కాదు, మోదీని కాపాడుకోవడం' అని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రధాని మోదీ విజ్ఞప్తి వెనుక ఉన్న ఉద్దేశాలను ప్రశ్నించారు. ఎర్రకోట నుండి నీతులు చెప్పడం మానేసి, 2029 ఎన్నికల కోసం ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్య ఆధారంగానే మహిళా కోటాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రతిపక్షాలకు ప్రధాని చేసిన విజ్ఞప్తి గురించి అడిగినప్పుడు, రమేశ్ దీనికి సంబంధించిన కాలక్రమాన్ని (చరిత్రను) అర్థం చేసుకోవడం ముఖ్యమన్నారు. 1993లో 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదించబడ్డాయని, తద్వారా పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ కల్పించబడిందని ఆయన గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ దీనికి అవసరమైన ప్రాథమిక కృషి చేశారని, ఈ నిబంధనను రాజ్యాంగంలో చేర్చడంలో కీలక పాత్ర పోషించారని రమేశ్ పిటిఐతో చెప్పారు. 'సెప్టెంబర్ 2023లో నారీ శక్తి వందన్ అధినియం– 2023 ఏకగ్రీవంగా ఆమోదించబడింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గట్టిగా డిమాండ్ చేశారు' అని ఆయన పేర్కొన్నారు. 543 మంది సభ్యులున్న లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని (అంటే మహిళలకు 182 సీట్లు కేటాయించాలని) కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పదేపదే కోరుతున్నాయని రమేశ్ చెప్పారు. అకస్మాత్తుగా, ఏప్రిల్ 16, 2026 రాత్రి 11 గంటలకు, పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ జరుగుతుండగా నారీ శక్తి వందన్ అధినియం –2023'కు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేశారని, మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడంపైనే ప్రభుత్వం ఆసక్తి చూపిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వం కళంకితమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ విజయం సాధించలేకపోయిందని, వర్షాకాల సమావేశాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టలేకపోయిందని ఆయన పేర్కొన్నారు. బిజెపి కూటమికి మూడింట రెండు వంతుల మెజారిటీ లేదు, భవిష్యత్తులో కూడా రాదు అని రమేశ్ అన్నారు. ఎర్రకోట నుండి పదేపదే 'పన్యాసాలు ఇవ్వడం, నాటకం ఆడటం మానేసి, 2029 సాధారణ ఎన్నికల నాటికి ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్‌ను ప్రధాని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### వాస్తవ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే...

**'వందేమాతరం' అంశాన్ని బిజెపి వాడుకుంటోంది : వేణుగోపాల్**



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో వందేమాతరం గేయాలాపన వివాదంపై కాంగ్రెస్ స్పందించింది. 'వందేమాతరం' పూర్తి గేయం ఆలపించడం అనేది కేవలం ఒక సమాచార మార్పిడికి సంబంధించిన విషయమని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి దీనిని వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. ఆదివారం కేరళలోని కొల్లాం కరుణాగపల్లిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఎఐసిసి కార్యాలయంలో 'వందేమాతరం' పూర్తి గేయాన్ని ఆలపించడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, అది ఏమీ పెద్ద సమస్య కాదని, కేవలం సమాచార మార్పిడికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. 'దీనిపై కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన వైఖరి ఉంది. మహాత్మా గాంధీతో సంప్రదింపుల తర్వాత, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ భాగస్వామ్యంతో 'వందేమాతరం' గేయం రూపుదిద్దుకుంది' అని ఆయన చెప్పారు. విభజన రాజకీయాల ఎజెండాతోనే బిజెపి 'వందేమాతరం' అంశాన్ని లేవనెత్తుతోందని వేణుగోపాల్ ఆరోపించారు. 'మేము వందేమాతరాన్ని గౌరవించే వ్యక్తులం. జాతీయ గీతమైన 'జన గణ మన'ను కూడా అంతే గౌరవిస్తాం. దేశం పట్ల గౌరవం గురించి వారు మాట్లాడుతుంటే, ముందుగా అరుణాచల్ ప్రదేశ్‌లోని భూమిని తిరిగి స్వాధీనం చేసుకోమని వారిని అడగండి. '56 అంగుళాల ఛాతీ' కలిగిన వ్యక్తి (ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి) ఎన్ని ప్రకటనలు చేసినప్పటికీ, మన భూమిని మనం కోల్పోతున్నాం' అని ఆయన అన్నారు. దీని గురించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఇదే అసలైన వివాదం అని ఆయన పేర్కొన్నారు.

దేశం ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని వేణుగోపాల్ ఆరోపించారు. 'వాస్తవ సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి వారు ఈ దేశ విద్యార్థులపై పెల్లెట్ గన్‌లను (తుపాకులను) ప్రయోగిస్తున్నారు. అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం లేదా చోరీ అంశంపై చర్చ జరగకూడదని వారు కోరుకుంటున్నారు. ఆ ఉద్దేశంతో సృష్టించే ఏ వివాదానికీ మేము లొంగిపోయేలా లేము' అని ఆయన అన్నారు.

### నావికాదళ ఉద్యోగి కుటుంబం అనుమానాస్పద మృతి



**ముంబై:** దక్షిణ ముంబైలో ఓ నౌకాదళ ఉద్యోగి కుటుం బం అనుమానాస్పదంగా మృతిచెందింది. నావికా నగర్‌లోని తన నివాసంలో నౌకాదళ ఉద్యోగి, అతని భార్య, ఇద్దరు పిల్లలు మృతిచెంది ఉన్నట్లు ఆదివారం అధికారులు తెలిపారు. కఫ్ పరేడ్ పోలీసుల వివరాల ప్రకారం నౌకాదళ ఉద్యోగి పురన్‌మల్ శంభులాల్ మెహ్రా(30) ఉరేసుకున్న స్థితిలో, అతని భార్య ఓమ(28), మూడేళ్ల కుమారుడు, రెండు నెలల కుమార్తె మృతదేహాలు మంచంపై పడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మెహ్రా ఉరేసుకొని, అతని భార్య, పిల్లలు విషప్రయోగం వల్ల మరణించినట్లు భావిస్తున్నామన్నారు. మృతదేహాలను జెజె ఆస్పత్రికి తరలించినట్లు అధికారి తెలిపారు. ఘటనాస్థలిలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదని, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

### అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు

## రాహుల్‌గాంధీ పిటిషన్‌పై నేడు 'సుప్రీం' విచారణ

- విచారించనున్న సిజెఐ సూర్యకాంత్ ధర్మాసనం



**న్యూఢిల్లీ :** తనపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలను సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లు పరిశీలించాలని ఆదేశిస్తూ అలహాబాద్ హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు నేడు (సోమవారం) విచారించనుంది. ఆగస్టు 17 నాటికి సుప్రీంకోర్ట్ జాబితాల ప్రకారం.. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విషయమై విచారించనుంది. సిబిఐ స్పందన పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిపై ఉన్న ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణల దర్యాప్తులో సాధించిన పురోగతిని వివరిస్తూ, ఆ ఏజెన్సీ సీనియర్ అధికారి వ్యక్తిగతంగా ఒక కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ జులై 20న ఆదేశించింది. ఆరోపణలపై విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఏదైనా చట్ట విరుద్ధతను సూచించే సాక్ష్యాలు, పత్రాలు లభిస్తే చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టేందుకు దానికి స్వేచ్ఛ ఉంటుందని హైకోర్టు పేర్కొంది.కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీపై ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై సిబిఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతోంది.కర్ణాటక నివాసి ఎస్.ఎస్.విఘ్నేష్ శిశిర్ దాఖలు చేసిన క్రిమినల్ రిట్ పిటిషన్‌పై రెండు గంటల పాటు చాంబర్‌లో విచారణ జరిపించిన అనంతరం ఈ ఉత్తర్వు జారీ చేయబడింది. బిజెపి కార్యకర్త అయిన విఘ్నేష్ కాంగ్రెస్ నాయకుడికి ద్వంద్వ పౌరసత్వం ఉందని ఆరోపిస్తూ గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. సిబిఐ దాఖలు చేసిన అఫిడవిట్ తన మునుపటి ఉత్తర్వుకు అనుగుణంగా లేదని, గాంధీ ఆస్తులకు సంబంధించి వ్యతిరేకంగా ఫిర్యాదు దాఖలు చేసిన పిటిషనర్, ఫిర్యాదుపై సాధించిన పురోగతిని తగినంతగా వివరించలేదని హైకోర్టు పేర్కొంది. తదుపరి విచారణకు ముందు, ఈ విషయంలో సాధించిన పురోగతిని వివరిస్తూ, వ్యక్తిగతంగా ఒక కొత్త అఫిడవిట్‌ను దాఖలు చేయాలని న్యూఢిల్లీలోని సిబిఐ అవినీతి నిరోధ క ప్రధానకార్యాలయంలోని జాయింట్ డైరెక్టర్ లేదా సంబంధిత జోన్ అధిపతిని కోర్టు ఆదేశించింది. ధర్మాసనం ఈ విషయాన్ని పాక్షికంగా విచారించినట్లుగా పరిగణించి, తదుపరి విచారణ తేదీగా ఆగస్టు 20ని నిర్ణయించింది. సిబ్బంది, శిక్షణ విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ రెవెన్యూ విభాగం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం తరపున వివరణాత్మక కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం..మొత్తం కేసు రికార్డును సీనియర్ రిజిస్ట్రార్ సురక్షిత సంరక్షణలో సీల్డ్ కవర్‌లో ఉంచాలని కూడాహైకోర్టు ఆదేశించింది.

### జంతర్‌మంతర్‌కు రైతుల పాదయాత్ర

# హర్యానా- పంజాబ్ సరిహద్దు మూసివేత

- బారికేడ్లు బిజెపి ప్రభుత్వ నిజస్వరూపం బయపెట్టింది
- ఎస్‌కెఎం (నాన్‌పొలిటికల్) నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ విమర్శ

**ఖనౌరి :** ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు పంటల సేకరణకు చట్టపరమైన హామీని డిమాండ్ సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర) (ఎస్‌కెంఎం) పాదయాత్ర చేపట్టింది. ఎస్‌కెఎం పిలుపు నేపథ్యంలో, హర్యానా–పంజాబ్ సరిహద్దు వద్ద హర్యానా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, రైతులు ఖనౌరి–దాతా సింగ్ వాలా సరిహద్దు మీదుగా హర్యానాలోకి ప్రవేశించడానికి సమాయత్తమయ్యారు. అయితే హర్యానా పోలీసులు ఆదివారం ఆ అంతర్‌రాష్ట్ర సరిహద్దు వద్ద బహుళస్థాయి బారికేడ్లను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని మూసివేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్‌పొలిటికల్) హర్యానా–పంజాబ్ సరిహద్దులోని దాతా సింగ్ వాలా గ్రామం నుండి ఢిల్లీలోని జంతర్ మంతర్ వరకు 228 కిలోమీటర్ల 'కిసాన్ బచావో పాదయాత్ర'కు పిలుపునిచ్చింది. ఈ యాత్ర ఈనెల 29న రాజధానిలో జరిగే రైతు పంచాయత్‌తో ముగుస్తుంది. ఖనౌరి అంతర్‌రాష్ట్ర సరిహద్దు వద్ద హర్యానా వైపున అధికారులు కాంక్రీట్ బారికేడ్లను, అల్లర్లను అదుపు చేసే వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు ముళ్ల తీగలను కూడా అమర్చారు. ఈ పాదయాత్రకు రైతులకు అనుమతి లేదని జింద్ జిల్లాకు చెందిన ఒక పోలీసు అధికారి ఆదివారం తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి 51 మంది రైతులు ఈ యాత్రలో పాల్గొంటారని ఎస్‌కెఎం (నాన్‌పొలిటికల్) నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ సరిహద్దులోని పంజాబ్ వైపు విలేకరులతో అన్నారు. ఈ పాదయాత్ర పూర్తిగా శాంతియుతంగా, క్రమశిక్షణతో సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎస్‌కెఎం



(నాన్‌పొలిటికల్)కు చెందిన సుమారు 200 మంది వలంటీర్లు, మద్దతుదారులు కూడా వారితో పాటు ఉండనున్నట్లు ఆయన చెప్పారు. హర్యానాలో భద్రతా ఏర్పాట్ల గురించి అడిగినప్పుడు దల్లేవాల్ స్పందిస్తూ 'ఈ బారికేడ్ల ఏర్పాటు బిజెపి ప్రభుత్వ నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. గతంలో రైతులు ట్రాక్టర్లతో వచ్చినప్పుడు వారికి సమస్య ఉండేది. ఇప్పుడు కేవలం చిన్న రైతుల బృందం కాలినడకన ఢిల్లీకి వెళ్లాలనుకుంటున్నా, వారికి సమస్యగానే ఉంది, మమ్మల్ని ముందుకు వెళ్లనివ్వడం లేదు. ఇది ప్రభుత్వ రైతువ్యతిరేక వైఖరిని బహిర్గతం చేస్తోంది. మేము శాంతియుతంగా ముందుకు సాగాలని అనుకున్నాము, కానీ వారు భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోడ్లను అడ్డుకునేది రైతులు కాదు, ప్రభుత్వమేనని ఇప్పుడు అందరికీ తెలియాలి' అని ఆయన అన్నారు. ఖనౌరి నుండి ప్రారంభం కావాల్సిన ఈ పాదయాత్రకు ముందు, హర్యానా పోలీసులు తమ సంఘానికి చెందిన కొందరు నాయకులను వేర్వేరు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారని దల్లేవాల్ ఆరోపించారు. ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి మాట్లాడుతూ, ఇది భారతీయ రైతులపై, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తులు భారత్‌లోకి దిగుమతి అవుతాయని, తద్వారా దేశీయ రైతుల ఆదాయాలు, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. తాము ఢిల్లీకి చేరుకుంటే, ఈ వాణిజ్య ఒప్పందంపై తాము అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానాలు ఉండవని వారు భావిస్తున్నారని దల్లేవాల్ అన్నారు. ఇదిలా ఉండగా ఈ పాదయాత్ర 'దాతా సింగ్ వాలా' నుండి ప్రారంభమై నర్వాన, ఉచన, ఖట్కర్ టోల్, జింద్, లుదానా, గోహానా, ఇస్రానా, సమల్ఖా, సింఘు సరిహద్దు మీదుగా జంతర్‌మంతర్ చేరుకుంటుందని ఎస్‌కెఎం (నాన్‌పొలిటికల్) ఒక ప్రకటనలో పేర్కొంది. వ్యవసాయం, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య రంగం, ఇతర అనుబంధ రంగాలను ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం పరిధి నుండి మినహాయించడం; అలాగే స్వామినాథన్ కమిషన్ 'సి2+50 శాతం' సూత్రం ఆధారంగా కనీస మద్దతు ధరకు అన్ని పంటల సేకరణకు హామీ ఇచ్చే చట్టాన్ని తీసుకురావడం వంటివి ఈ పాదయాత్ర ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. రైతులను రుణ విముక్తులను చేసే చర్యలు చేపట్టడం, చెరకుకు 'న్యాయమైన, లాభదాయక ధర' పెంపు, రైతు సంఘాలతో చర్చల సమయంలో కేంద్రం ఇచ్చిన లిఖితపూర్వక హామీల అమలు, రైతు ఉద్యమాలకు సంబంధించి నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవడం వంటివి కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మూడు సెట్ల ప్రశ్నలను ఎందుకు తిరస్కరించారు?

- కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కో-కన్వీనర్ సౌరవ్ దాస్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ సమావేశాల్లో నీట్ యుజి 2026 పరీక్షలో అక్రమాలు, విద్యార్థుల ఆందోళనలపై లేవనెత్తిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో తిరస్కరించడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కోకన్వీనర్ సౌరవ్ దాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రశ్నోత్తరాల సమయం అత్యంత కీలకమైనదని, దీనిని అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోందని ఆయన విమర్శించారు. అనేక వారాల పాటు సాగిన నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు దాస్ ఆదివారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'ఇటీవల ముగిసిన లోక్‌సభ సమావేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలోని యువజన నిరసనలకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతించకపోవడం ఆందోళనకరం. లోక్‌సభ ఎంపి మాథేశ్వరన్ వి.ఎస్. మూడు సెట్ల ప్రశ్నల (నోటీసు రిఫరెన్స్ నెం. 101799, 101801) ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి సమాధానాలు కోరారు. ఈ ప్రశ్నలను పార్లమెంటులో అడగలేకపోతే, ప్రభుత్వాన్ని ఎక్కడ జవాబుదారీగా చేయాలి? నిరసనల ద్వారానా? ఆ కీలక వారాల్లో హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు ముందుకు వచ్చి, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేదు?' అని దాస్ నిలదీశారు. నీట్ యుజి 2026 అభ్యర్థులకు రీఫండ్‌లు, పేపర్ లీక్ ఆందోళనలు, ఢిల్లీలో నిరసనకారులకు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను నిరాకరించడం, శాంతియుత ప్రదర్శనల పట్ల ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలను ఎంపి అడిగారు. అయితే, రూల్ 41(2) కింద అనేక నిబంధనలను ఉటంకిస్తూ ప్రశ్నలను పార్లమెంటరీ అధికారులు తిరస్కరించారు. '1. నీట్ యుజి 2026 దరఖాస్తు ఫీజుల రీఫండ్, 2. ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా అపనమ్మకం 3. ఢిల్లీలో సిజెపి నిరసనకారులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను నిరాకరించడం 4. నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై ప్రభుత్వ వైఖరి 5. విద్యార్థుల సంక్షేమం, పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలు 6. శాంతియుత నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కును వినియోగించుకుంటున్న పౌరుల పట్ల వైఖరి' వంటి ప్రశ్నలను రూల్ 41(2) వివిధ క్లాజులను ఊటంకిస్తూ తిరస్కరించారు' అని సిజెపి నేత సౌరవ్‌దాస్ అన్నారు. ఇలా ప్రజాస్వామ్య సంస్థలు సభలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరాకరించినప్పుడు, పౌరులకు తమ నిరసనలను వీధుల్లోకి తీసుకువెళ్లడం తప్ప మరో మార్గం ఉండదని సౌరవ్ దాస్ అభిప్రాయపడ్డారు. ఎంపిలను ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడం, ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా పార్లమెంట్ పోషిస్తున్న పాత్రను బలహీనపరుస్తుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల కార్యనిర్వాహక నిర్ణయాలకు పార్లమెంట్ ఒక 'రబ్బర్ స్టాంప్'గా మారుస్తుందని అన్నారు. 'కార్యనిర్వాహక వర్గాన్ని ప్రశ్నించే ఎంపి హక్కు ఏదో విధానపరమైన సమస్య కాదు. అది వాస్తవానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటిది. అపారమైన ప్రజా అధికారాన్ని కలిగి ఉన్న మంత్రులు ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులకు జవాబు చెప్పాల్సి ఉంటుంది కాబట్టే ప్రశ్నోత్తరాల సమయం ఉంది. లేకపోతే, ప్రజలు రోడ్లపైకి రావాల్సి వస్తుంది. మీరు పార్లమెంట్‌ను అణచివేసి మీ అసంపూర్ణ విధానాలకు దానిని రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు. మీరు యువతను విస్మరించలేరు. ఇది మా దృష్టిలో భారతదేశం కాదు!' అని సౌరవ్ దాస్ అన్నారు.

# టిఎంసి నేత ఆత్మహత్య

- పార్టీ కార్యాలయంలోనే బలవన్మరణానికి పాల్పడిన ఆశిష్ బెనర్జీ
- ఘటనాస్థలిలో సూసైడ్ నోట్ లభించినట్లు పోలీసులు వెల్లడి

**రాంపూర్‌హట్ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, టిఎంసి సీనియర్ నాయకుడు ఆశిష్ బెనర్జీ (74) ఆత్మహత్యకు చేసుకున్నారు. ఆదివారం ఉదయం బీర్భూమ్ జిల్లాలోని పార్టీ కార్యాలయంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. రాంపూర్‌హట్‌లోని హట్టాలా పరాలో ఆయన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయం నుండి ఒక సూసైడ్ నోట్ లభించిందని పోలీసులు తెలిపారు. ఆశిష్ బెనర్జీకి భార్య, కుమారుడు ఉన్నారు. సోషల్ మీడియాలో సూసైడ్ నోట్ వైరల్ అయింది. ఈ లేఖలో తన మరణానికి ఎవరూ బాధ్యులు కారని, రాజకీయాల్లోకి రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారని బెనర్జీ పేర్కొన్నట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. బెనర్జీ మరణానికి దారితీసిన కచ్చితమైన పరిస్థితులు ఇంకా తెలియరాలేదని, పోలీసులు ఆ లేఖలోని అంశాలను, ఘటనకు సంబంధించిన ఇతర పరిస్థితులను పరిశీలిస్తున్నారని వారు తెలిపారు. సీనియర్ టిఎంసి నాయకుడైన బెనర్జీ, 2001 నుండి రాష్ట్ర అసెంబ్లీలో రాంపూర్‌హట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో పాఠశాల విద్య, వ్యవసాయం వంటి శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని, ఏ పనికైనా ప్రతిఫలంగా డబ్బు తీసుకోలేదని సూసైడ్ నోట్‌లో బెనర్జీ పేర్కొన్నారు. పార్టీలో జరిగే తప్పులను తాను ఎప్పుడూ అంగీకరించలేకపోయినప్పటికీ, వాటిని ఎదిరించలేకపోయానని కూడా ఆయన అందులో రాశారు. ఆ లేఖలో తారాపీఠ్–రాంపూర్‌హట్ డెవలప్‌మెంట్ అథారిటీ (టిఆర్‌డిఎ) ప్రస్తావన కూడా ఉన్నట్లు సమాచారం. టెండర్లకు సంబంధించిన నిర్ణయాలు, చెక్కుల జారీ, ప్రణాళికల ఆమోదం లేదా అభ్యంతర రహిత ధృవీకరణ పత్రాల (ఎన్‌ఓసి) జారీలో తనకు ఎలాంటి పాత్ర లేదని ఆయన పేర్కొన్నారు. తనను అప్రతిష్ట పాలు చేయడానికి, అవమానించడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపించిన ఆయన, రాజకీయాల్లోకి రావడం ఒక పొరపాటు అని భావిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థి దశ నుండే రాజకీయాలతో సంబంధం కలిగి ఉండి, ఉపాధ్యాయుడిగా కూడా పనిచేసిన బెనర్జీ, తన కుటుంబ సభ్యులు రాజకీయాల్లోకి రావద్దని సూచించారని, విద్యార్థుల నుండి పొందిన ఆప్యాయతను గుర్తుచేసుకున్నారు.



బెనర్జీ మరణంపై స్పందించిన టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆ లేఖలోని అంశాలు మాజీ ఎమ్మెల్యే ఎదుర్కొన్నట్లు చెబుతున్న దుష్ప్రచారానికి సంబంధించి తీవ్రమైన, ఆందోళనకరమైన ప్రశ్నలను లేవనెత్తాయన్నారు. 'జీవితకాల ఉపాధ్యాయుడు, ప్రజా సేవకుడైన ఆశిష్ దా, నిజాయితీ, గౌరవం, సరళతతో ప్రజలకు సేవ చేస్తూ దశాబ్దాల పాటు గడిపారు అని అభిషేక్ బెనర్జీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. నిజం తేలకముందే ఆరోపణలను పెద్దవి చేసి, వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసే రాజకీయాల పర్యవసానాలపై బీజేపీ మరియు మీడియాలోని కొన్ని వర్గాలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన అన్నారు. బెనర్జీ ఆత్మహత్య చేసుకున్నారని నిర్ధారించడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందని పేర్కొంటూ, సీనియర్ టిఎంసి నాయకుడు కునాల్ ఘోష్ నిష్పాక్షిక విచారణ జరగాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొన్నారని ఆరోపించిన ఘోష్, ఒక బిజెపి నాయకుడు బహిరంగంగా (రోడ్డుపై) ఆయనను అవమానిస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియోను ప్రస్తావించారు.

### వారణాసి విమానాశ్రయంలో పేలిన తూటా

**వారణాసి:** వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం భద్రతా తనిఖీల సమయంలో ప్రయాణికుడి లైసెన్స్ పిస్టల్ అకస్మాత్తుగా పేలడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఉదయం సుమారు 9:30 గంటల ప్రాంతంలో ముంబయి వెళ్లేందుకు వచ్చిన అజమ్‌గఢ్ జిల్లాకు చెందిన కమలేశ్ రాయ్ అనే ప్రయాణికుడు తన ఆయుధాన్ని అధికారులకు డిక్లేర్ చేస్తుండగా, ఆయుధాన్ని తనిఖీ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 'ఎఎఐ కార్గ్ లాజిస్టిక్స్'కి చెందిన ఒక మహిళా భద్రతా సిబ్బంది కాలికి, సమీపంలో ఉన్న మరో వ్యక్తి బొటనవేలుకు గాయాలవగా, వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గోమతి జోన్ డిసిపి, పింద్రా ఎసిపితో పాటు పలువురు పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించగా, ప్రస్తుతం దీనిపై తగిన చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'సర్' సక్సెస్ వల్లే బిహార్‌లో రికార్డుస్థాయిలో ఓటింగ్

**సిఇసి జ్ఞానేష్ కుమార్**



**పాట్నా:** ఓటరు జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్)ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ తీవ్రంగా సమర్థించుకున్నారు. గత ఏడాది బిహార్‌లో సర్ విజయవంతంగా జరగడం వల్లే, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో ఉన్న సిఇసి, పాట్నా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని ఓటింగ్ శాతం కంటే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లైన వైశాలి ఉన్న నేల బిహార్ అని, ఇక్కడ మొదటిసారిగా సర్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించబడటం గర్వకారణంగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. సుమారు మూడు నెలల పాటు సాగిన ఈ భారీ ప్రక్రియలో ఓటర్ల జాబితా నుండి దాదాపు 70 లక్షల పేర్లను తొలగించిన తర్వాత, ఆ వెంటనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యంలో భారీ పెరుగుదల కనిపించిందన్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 67.25 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల సంఘం ప్రకారం, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ఈ స్థాయిలో ఓటింగ్ జరగడం ఇదే తొలిసారి. కాగా, అధికారుల సమాచారం ప్రకారం, సిఇసి సోమవారం రాజ్‌గిర్‌లోని నలంద యూనివర్సిటీలో సుమారు 500 మంది బూత్‌స్థాయి అధికారులతో (బిఎల్‌ఓ) సమావేశం కానున్నారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలుసుకోవడం, ఎన్నికల ప్రక్రియను మరింత సమర్థవంతంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడానికి తగిన సూచనలు చేయడం ఈ సమావేశం ఉద్దేశ్యం.

### కర్ణాటకలోని చామరాజనగర్‌లో ఉద్రిక్తత

**న్యాయం కోసం నిరసనలు**

**చామరాజనగర్/మైసూర్:** కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లా హనూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది జరిపిన కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై మృతుల కుటుంబసభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ చామరాజనగర్, మైసూర్ జిల్లాల్లో భారీ నిరసనలు చేపట్టారు. ఆగస్టు 15న జరిగిన ఈ ఘటనలో మరణించిన ముగ్గురు వ్యక్తులు తమిళనాడుకు చెందిన వారని ఆ రాష్ట్ర రాజకీయ పార్టీలు డిఎంకె, పిఎంకె వారేమైన వేటగాళ్ల అని ప్రశ్నించినరు. అటవీ సిబ్బంది విచక్షణారహితంగా కాల్పులు జరిపి ముగ్గురి ప్రాణాలు తీశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతదేహాలను మైసూర్‌లోని కె.ఆర్. ఆసుపత్రి మార్చురీకి తరలించగా, బంధువులు తొలుత పోస్టుమార్టానికి నిరాకరించినప్పటికీ, స్థానిక అధికారుల హామీతో అంగీకరించారు. ఈ ఘటనపై హనూరు పోలీసులు అటవీ అధికారులపై హత్య కేసు నమోదు చేశారు. మరోవైపు, ఈ అంశంపై డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చేత విచారణకు ఆదేశించి



నట్లు కోలేగాల సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ దినేష్ కుమార్ మీనా తెలిపారు. పోస్టుమార్టం విచారణ నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ మాట్లాడుతూ, మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించామని, బాధితుల కుటుంబాలకు తగిన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే, అటవీ శాఖ సిబ్బందిపై విచారణ పక్షపాతరహితంగా జరగాలంటే జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ప్రతిపక్ష నాయకుడు ఆర్. అశోక డిమాండ్ చేశారు. ప్రస్తుతానికి ఆ ప్రాంతంలో పరిస్థితి అదుపులోనే ఉందని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు.

## ఇండోనేసియాలో కొనసాగుతున్న గాలింపు

- 900 ఇళ్ళు నేలమట్టం

**రుటెంగ్:** ఇండోనేసియాలో భూకంప శిథిలాలలను వెలికితీసే కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. ఆదివారం మరో నలుగురు పౌరుల మృతదేహాలను సహాయబృందాలు శిథిలాల నుండి వెలికితీశాయి. శనివారం తెల్లవారుజామున ఇండోనేసియాలో 7.7 తీవ్రతతో భయంకరమైన భూకంపం సంభవించింది. అనేక భవంతులు కుప్పకూలాయి. చాలామంది ఇప్పటికీ శిథిలాల్లోనే ఉండిపోయారు. చాలా తక్కువలోతులో (10 కి.మీ లోతు) ఈ భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉంది. ఈ భూకంపం తర్వాత 235 సార్లు భూ ప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు.జాతీయ గాలింపు,పరిశోధనా ఏజన్సీ సమాచారం ప్రకారం 101 మంది గాయపడ్డారు. ఇప్పటివరకూ 57 మంది భూకంపంలో మరణించారు.900 ఇళ్ళు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మరో 450 ఇళ్ళు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 5000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారంతా తాత్కాలిక శిబిరాలలో తలదాచుకున్నారు. ఈ భూకంపం కారణంగా 700 కి.మీ నిడివిగల జాతీయ రహదారిపై రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. అడ్డంగా కొండచరియలు విరిగిపడ్డాయి. 2018లో వచ్చిన భూకంపంలో 4,400 మంది మరణించారు. 2004లో 9.1 తీవ్రతతో 12 దేశాలలో వచ్చిన భూకంపంలో 2.30 లక్షల మంది మరణించారు. 1992లో ఇండోనేసియాలో వచ్చిన సునామీలో 2,.500 మంది మరణించారు.

# వందల డ్రోన్లతో రష్యాపై ఉక్రేన్ దాడి

- ఆరుగురు మృతి
- 822 డ్రోన్లు కూల్చివేసిన రష్యా
- ఉక్రేన్ రిఫైనరీ, స్టీల్‌ప్లాంట్‌పై క్షిపణి దాడులు



**మాస్కో:**రష్యాపై ఉక్రేన్ ఆదివారం పెనుదాడికి దిగింది. గతంలో లేనివిధంగా చేసిన ఈ దాడిలో ఆరుగురు రష్యన్లు మరణించారు. ఇంతవరకూ ఎన్నడూలేని రీతిలో ఉక్రేన్ వందల డ్రోన్లతో భారీ దాడులకు దిగింది. ఐతే 822 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ బలగాలు చెప్పాయి. బెల్గరోడ్, బ్రయాన్స్క్, వ్లాదిమీర్, వోల్గోగార్డ్, వోరోనెజ్, కలుగా, కుర్స్క్, లిపెట్స్క్, నిజనీ నోవ్‌గొరోడ్, ఓర్యోల్, రోస్టోవ్, ర్యాజాన్, తోంబోవ్, తులా ప్రాంతాలలో ఉక్రేన్ డ్రోన్లతో దాడులు చేసిందని వందలాది డ్రోన్లను కూల్చివేశామని రష్యా ప్రకటించింది.రష్యా రాజధాని మాస్కో వైపు వస్తున్న 600 డ్రోన్లను రష్యా కనుగొని వాటిని అడ్డుకుందని రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. మాస్కో రీజియన్‌లో ఒక ప్రైవేటు నివాసాన్ని డ్రోన్ ఢీ కొట్టడంతో 83 ఏళ్ళ వయసుగల ఒక వృద్ధుడు మరణించాడు. రోస్తోవ్ రీజియన్‌లో జరిగిన డ్రోన్ దాడుల్లో ఆరుగురు మరణించారు. రిహ ప్రాంతంలో జరిగిన దాడిలో నలుగురు మరణించారు. దీంతో రష్యా కూడా ఉక్రేన్ రాజధాని నగరం కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులతో ఎదురుదాడులు చేసింది. కీవ్‌లోని క్రెమెంచెంగ్ చమురు శుద్ధికేంద్రంపై రష్యా క్షిపణి దాడి చేసింది. క్రివోవ్ రోగ్‌లో ఉన్న స్టీల్ ప్లాంట్‌పై కూడా రష్యా దాడి చేసింది. నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధంలో ఈ ఏడాది ఉక్రేన్ భారీ నుండి అతి భారీస్థాయిలో దాడులను ఉక్రేన్ ఉద్ధృతం చేసింది. దేశీయంగా డ్రోన్ల ఉత్పత్తిని కీవ్ బాగా పెంచింది. 900 కి.మీ దూరం ప్రయాణం చేసి లక్ష్యాలను ధ్వంసం చేయగల డ్రోన్లను ఉక్రేన్ ఉత్పత్తి చేస్తోంది. ముఖ్యంగా రష్యా చమురు కేంద్రాలను ధ్వంసం చేయడంపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి లక్ష్యాలను దెబ్బతీస్తూ ఉండటంతో ఆ దేశం ఇటీవలికాలంలో తీవ్రంగా నష్టపోతోంది. వందల కి.మీ ప్రయాణం చేయగల డ్రోన్లు,క్షిపణులను ఉక్రేన్ ప్రయోగించడం ద్వారా నల్లసముద్రంలో రష్యా నౌకలను ఉక్రేన్ ధ్వంసం చేస్తోంది. ఉక్రేన్ దాడులు పెంచేకొలదీ రష్యా కూడా రెట్టింపు స్థాయిలో తన దాడులు తీవ్రతరం చేసింది. నల్లసముద్రంలో 100 నౌకలను రష్యా ధ్వంసం చేసింది. ఇదిలా ఉండగా రొమేనియా జాతీయ రక్షణ మంత్రిత్వశాఖ ఆదివారం ఒక ప్రకటన చేస్తూ, స్పానిష్ గగనతలాన్ని ఎఫ్–18 యుద్ధ విమానం ఉల్లంఘించి లోనికి దూసుకువచ్చిందని ప్రకటించింది.

## నెలాఖరులో భారత్‌కు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం

**సిడ్నీ:** ఆస్ట్రేలియాకు కీలకమైన న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ పాలక ప్రతినిధిబృందం ఆగస్టు 31 నుండి సెప్టెంబరు 3వ తేదీ వరకు భారత్‌లోని ముంబై,న్యూఢిల్లీ నగరాలలో పర్యటిస్తుంది. బారత్‌తో విద్యా,సాంస్కృతిక,ఆర్థిక సంబంధాలను అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా ఈ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నది. ఆస్ట్రేలియాలో కీలకమైన సిడ్నీ ప్రాంతం కూడా పాలకవర్గం పరిధిలోనే ఉంది. న్యూసౌత్ వేల్స్ అనేది ఆస్ట్రేలియాలో అత్యధిక జనాభా ఉండే రాష్ట్రం. దేశంలో అతి పెద్ద నగరం,ఆర్థికంగా పరిపుష్టివంతమైన నగరం సిడ్నీలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలున్నాయి.నాలుగు రోజులు ఈ ప్రతినిధిబృందం పర్యటన సందర్భంగా భారతకేంద్ర ప్రభుత్వం కూడా వ్యాపార అవకాశాలు,వాణిజ్య పెట్టుబడుల ఆకర్షణ,ఉద్యోగాల సృష్టి వంటి విషయాలపై దృష్టి కేంద్రీకరించనున్నది. 2024–25 ఆర్థిబుక సంవత్సరంలో న్యూసౌత్‌వేల్స్, భారత్ మధ్య 4.86 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చేసుకుంటున్న తరుణంలో న్యూసౌత్‌వేల్స్ మంత్రివర్గం ఈ ప్రకటన చేసింది. 2024 ఏప్రిల్ నుండి 2026 మార్చి నెల వరకూ దాదాపు 174,000 మంది భారతీయ పర్యాటకులు న్యూసౌత్‌వేల్స్‌కు వెళ్ళారు. 424 మిలియన్ డాలర్ల మేరకు ఖర్చు చేశారు. 28,000 మందికిపైగా భారతీయ విద్యార్థులు కూడా ఈ రాష్ట్రంలో చదువకుంటున్నారు.

## చైనాలో ఈనెల 22 నుండి రెండవ ప్రపంచ హ్యూమనోయిడ్ రోబో గేమ్స్




**బీజింగ్:** చైనాలో ఆగస్టు 22 నుండి 26వ తేదీ వరకూ రెండవ ప్రపంచ హ్యూమనోయిడ్ రోబో గేమ్స్‌కు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పోటీలలో వివిధ విభాగాలలో ప్రపంచవ్యాప్తంగా వచ్చే 666 టీములకు చెందిన రోబోలు పాల్గొనబోతున్నాయి. ఆరు ఖండాలకు చెందిన 16 దేశాల నుండి 2,056 హ్యూమనోయిడ్ రోబోలు బహుమతులకోసం తమ ప్రతిభ కనబరుస్తాయి. మొత్తం 30 ఈవెంట్లలో జరిగే వివిధ క్రీడలలో మానవ క్రీడాకారులు ఏ విధమైన భంగిమలతో పోటీలలో పాల్గొని విజేతలుగా నిలుస్తారో అదే పద్ధతులు,నమూనాలతో రోబో గేమ్స్ కూడా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హ్యూమనోయిడ్ రోబోలను రీఛార్జి చేసేందుకు దాదాపు 1200 పైగా ఛార్జింగ్ సెంటర్లు కావాలి. దాదాపు 1500 రోబోలను జాగ్రత్తగా భద్రపరిచేందుకు సెంట్రలైజ్డ్ స్టోరేజీ కేంద్రాన్ని ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేస్తోంది. ఒక రోబోను కేవలం 30 సెకన్ల వ్యవధిలో ఛార్జింగ్ చేసేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చైనా సెంట్రల్ టెలివిజన్ తెలియజేసింది. పోటీ ప్రాతిపదికపై రోబోలకు ఫుట్‌బాల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు ఒక రోబో హోమ్ ఏర్పాటు చేశారు. సాకర్ తరహాలో ఈ టీమ్ ఈవెంట్లు జరుగుతాయి. ఈ ఏడాది ప్రపంచ పోటీల్లో ఒక రోబో వీధి ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి పోటీలలో ఇదే అతిపెద్ద ఆకర్షణ. ఈ వీధిలో రోబో కేఫ్‌లు ఉంటాయి. ఈ క్రీడా వేడుకల్లో పాల్గొనేవారికి రోబోలే స్వయంగా సెర్వింగ్ చేస్తాయి. డబ్బులు వసూలు చేస్తాయి. కాఫీలు,ఇతర పదార్థాలను తయారు చేస్తాయి.

## హంగరీలో బస్సు ప్రమాదం:12 మంది మృతి



**బుడాపెస్ట్:** సెంట్రల్ యూరప్ దేశం హంగరీలో ఆదివారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన దాడిలో 12 మంది మరణించారు. మరో 37 మంది గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పోలెండ్‌కు చెందిన ఒక పర్యాటక బృందాన్ని తీసుకువెళుతున్న ఈ బస్సు మెజోకెరెస్టెస్ పట్టణం సమీపంలో పక్కకు మళ్ళి పెద్ద గోతిలో బోల్తా పడి పల్లంలోకి దొర్లుకు పోయింది. ఆ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు నిద్రలో ఉన్నారు. బస్సు బోల్తా పడిన తర్వాత అనేకమంది బస్సుకింద పడి నలిగి గాయపడ్డారు. పోలెండ్ విదేశీమంత్రిత్వశబూఖ ప్రతినిధి ఒకరు ఈ ప్రమాదంపై మాట్లాడుతూ, బస్సులో ఉన్నవారంతా పోలెండ్ జాతీయులేనని నిర్ధారించారు. వీరంతా బోస్నియా–హెర్జిగొవీనాలో యాత్ర ముగించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలెండ్ దేశాధ్యక్షుడు కరోల్ నవ్రోకీ ఈ ఘటనపట్ల ఎక్స్ వేదికగా తీవ్ర సంతాపం ప్రకటించారు.

## హూస్టన్‌లో భారత స్వాతంత్ర్య వేడుకలు



**హూస్టన్:**హూస్టన్‌లో భారతీయులు శనివారంనాడు ఆగస్టు 15వ తేదీన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా చేసుకున్నారు.హూస్టన్ యూనివర్సిటీ ఛాన్సెలర్ రేణూ ఖటోర్,పోర్ట్ బెండ్ కౌంటీ న్యాయమూర్తి డేనియల్ వాంగ్,హారిస్ కౌంటీ కమిషనర్ లెస్లే బ్రియోనెస్,ఫోర్ట్‌బెండ్ కమిషనర్లు డెక్స్‌టర్ మెక్కాయ్,ఆండీ మైయర్స్ తదితరులు పాల్గొన్నారు. హూస్టన్ నగరంలో తీవ్రమైన వేడిగాలులు వెంటాడుతున్నప్పటికీ భారతీయులు చిత్తశుద్ధితో త్రివర్ణ పతాకాలను చేపట్టి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన సందేశాన్ని కౌన్సిల్ జనరల్ డి.సి.మంజునాత్ చదివి వినిపించారు.ఎన్నికైన ప్రముఖులు,అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత జాతీయ గీతాన్ని, భారత్‌కు చెందిన ఇతర దేశభక్తియుత గీతాలను ఆలపించారు.

## చంద్రుడి మట్టి – రాళ్ళ నమూనాలలో భిన్నత్వం

పరిశోధనలో చైనా పురోగతి



**బీజింగ్:** చంద్రుడి పై నుండి భూమికి చైనా తీసుకువచ్చిన మట్టి–రాళ్ళ నమూనాలో ఆ దేశ శాస్త్రవేత్తలు పురోగతి సాధించారు. చాంగ్ ఇ–6 మిషన్ ద్వారా భూమి పైకి తెచ్చిన చంద్రుడి నమూనాలను శాస్త్రవేత్తలు పరిశోధించినప్పుడు చాలా భిన్నత్వం కనిపించింది. భూమితో ముడిపడి ఒక సహజసిద్ధమైన ఉపగ్రహంగా భూమిచుట్టూ పరిభ్రమించే చంద్రుడిని ఒకవైపే భూగోళవాసులు చూస్తారు. భూమికి సమీపంగా ఉన్న మట్టి–రాళ్ల నమూనాలలో చంద్రుడిలో సుదూరంగా ఉన్న నమూనాలలో చాలా భిన్నత్వం కనిపించింది. భూమికి దగ్గరగా ఉన్న ప్రాంతంలో (లూనార్ మారియా) మురదురు రంగు బసాల్ట్ మైదానాలు ఉండగా, సుదూరంగా ఉన్న ఎత్తైన ప్రాంతాలు చాలా చాలా ప్రకాశవంతంగా విస్మయపరచేవిగా ఉన్నాయి. ఈ రెండు భిన్న వైరుధ్యాలు చైనా శాస్త్రవేత్తలను విస్మయపరిచాయి. చంద్రుడి ఆవిర్భావం గురించి చైనా పరిశోధకులు సమాచార సేకరణ ప్రయత్నాలు చేస్తున్నారు. లూనార్ మాగ్మా ఓషన్ (ఎల్ఎంఓ) నమూనాను ఉపయోగించి ఈ ప్రాథమిక పరిశోధనలు చేశారు.చంద్రుడి భూమిలోపల పొరలు ఎలా ఉంటాయన్న విషయాన్ని పరిశీలిస్తున్నారు.450 కోట్ల సంవత్సరాల క్రితం ఒక ఉపగ్రహంగా చంద్రుడు ఆవిర్భవించాడని అంచనాలున్నాయి. భూమిని ఒక అంతరిక్ష వస్తువు బలంగా ఢీకొట్టడంతో చంద్రుడు విడిపోయి ఆవిర్భవించాడు. చైనా అకాడమీ ఆఫ్ జియాలజిస్టులు భూమికి దగ్గరగా ఉన్న నమూనాలను, సుదూరంగా ఉన్న నమూనాలను పోల్చి చూస్తున్నారు.










# అభివృద్ధిపై చర్చిద్దాం రా...

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న కాలంలో నిరుద్యోగ యువకుల కోసం ఉద్యోగాల ప్రకటన కానీ, ఉద్యోగాల భర్తీ కానీ చేపట్టిన పాపాన పోలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో విడతలవారీగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, విడతలవారీగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టే బాధ్యత తనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాయ మాటలు నమ్మి యువత మోసపోవద్దని, పోటీ పరీక్షలకు సన్నద్ధమై భవిష్యత్తును తీర్చిదిద్దుకోండని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కానిస్టేబుల్ పోస్టులకు విడతలవారీగా నోటిఫికేషన్లు ఇస్తామని, ఖాళీగా ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. యువత ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ సాధించుకున్నారని అన్నారు. 'ధర్నాలు, ర్యాలీలు అని నిరుద్యోగులు సమయం వృథా చేసుకోకండి. ధర్నాల్లో పాల్గొంటే మీపై కేసులు పడితే మీ భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఉద్యమ సమయంలో కెసిఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టిందని, మొన్న తెలంగాణ భవన్‌లో రక్తదాన కార్యక్రమం చేపట్టారని, రక్తదాన కార్యక్రమంలో కెటిఆర్, హరీశ్‌రావు చుక్క రక్తం ఇవ్వలేదని, బిఆర్ఎస్ కార్యకర్తలు రక్తం ఇస్తే అమ్ముకొని కోట్ల రూపాయలు సంపాదించారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, అది ఇప్పుడు లక్ష కోట్ల వృథాగా మిగిలిపోయింది అన్నారు. తెలంగాణ ఆడపడుచులకు ఇస్తున్న బతుకమ్మ చీరలలోను కమీషన్లు దండుకున్న పాపం గత ప్రభుత్వానిదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వరంగల్ జిల్లా ప్రజలు ఎంతో చైతన్యవంతులని, ఆ చైతన్యంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారని ఆయన గుర్తు చేశారు. అధికారంతో, అహంకారంతో ప్రజలను ప్రజా నాయకులను అణగదొక్కాలని, నియంతృత్వంతో ఆలోచించే ప్రజలపై తిరుగుబాటు చేసే ధోరణిని వరంగల్ ప్రజలు వంట పట్టించుకున్నారని ఆయన గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన బిడ్డను, అల్లుడిని, కొడుకును, ఇంకొకరిని ఎందరినో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చేసిన పాపం మూట కట్టుకున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చేయూతనిస్తూ ఆ వర్గాలకు చెందిన వారిని అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపించుకొని మంత్రులను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి చెందుతుందన్నారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని పిసిసి అధ్యక్షుడిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ సమన్యాయాన్ని ముందుకు తీసుకుపోతున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు వివరించారు. పరకాల నియోజకవర్గంలో సుమారు 425 కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. సోదరుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధను అభిమానాన్ని కలిగి ఉన్నాడని రేవంత్ రెడ్డి గుర్తు చేశాడు. పరకాలలో మినీ స్టేడియం ఇండోర్ స్టేడియం చెక్ డాంల నిర్మాణం కోసం నిధులను విడుదల చేస్తానన్నారు. ఇక్కడ ప్రజలను మద్దతును చూస్తుంటే రానున్న 2029 ఎన్నికలలో తిరిగి కాంగ్రెస్ పార్టీ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న విశ్వాసం తండాలో కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళల కోసం పావలా వడ్డీ రుణాలను ఇచ్చి వారి అభివృద్ధికి పెట్రోల్ పంపులు ఆర్టీసీ బస్సులు ఎన్నో రకాల సౌకర్యాలను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సన్న వడ్లను పండించడం కోసం వారికి భువనసులు అందించడం జరుగుతుందని దానికోసం వందల కోట్లను ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతులకు ఒకే విడతలు 2 లక్షల రుణమాఫీని చేసిన ఘనత ప్రజా ప్రభుత్వాన్నిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,నాయిని రాజేందర్ రెడ్డి,గండ్ర సత్యనారాయణ రావు, కెఆర్ నాగరాజు యశస్విని రెడ్డి, మాధవరెడ్డి, ఎంపీలు కడియం కావ్య, వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఖుస్రూ పాషాతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

## 'ఇ–కోలి' బ్యాక్టీరియా !

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించిన ఉదంతాలతోపాటు, గతంలో నివేదించని పాతకేసులను అవసరమైనచోట 2023–24 తర్వాత జరిగిన ఉదంతాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తెలిపింది.నివేదిక ప్రకారం, నాన్ సబర్బన్ గ్రూప్ (ఎన్ఎస్‌జి) పరిధిలో 5,908 రైల్వే స్టేషన్లు ఉండగా 2023–24లో భారతీయ రైల్వే ప్రతీరోజూ 7,424మందికి పైగా ప్యాసింజర్ రైళ్లను (నాన్–సబర్బన్) నడిపి 292.4 కోట్ల మంది నాన్–సబర్బన్ ప్రయాణికులనూ రవాణ చేసింది. వివరణాత్మక తనిఖీ ఉద్దేశాన్ని కాగ్ వివరిస్తూ 'స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాల కల్పన కోసం రైల్వే బోర్డ్ వివిధ మార్గదర్శకాలను జారీ చేసిందని, స్టేషన్లలో ప్రయణికుల కోసం సౌకర్యాలు, పారిశుద్ధ్యం కల్పించేందుకు భారతీయ రైల్వేస్ చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు అందించాయో, లేదో అంచనా వేయడానికి ఒక ఆడిట్ నిర్వహించబడిందని, ఆడిట్‌లో ఎంపిక చేసిన 512 ఎంపిక చేసిన రైల్లే స్టేషన్లలో 458స్టేషన్లు అంటే 89శాతానికి పైగా కనీస అవసర సౌకర్యాల కల్పన(ఎంఇఎ)లో లోపభూయిష్టంగా ఉన్నాయని తేలింది.ఈ 458స్టేషన్లలో ఎంఇఏలు అసలు ప్రావిన్షియల్ స్థాయిలో లేవని, లేదా నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువ స్థాయిలో అందుబాటులో ఉన్నాయని అది పేర్కొంది. '2018 ఏప్రిల్‌లో, రైల్వే బోర్డ్ (ఆర్‌బి) ఎన్ఎస్‌జి 1నుంచి ఎన్ఎస్‌జి 6వరకు వర్గీకరించబడిన స్టేషన్ల కోసం కనీస అవసరమైన సౌకర్యాలు (ఎంఇఏ), సిఫార్సు చేయబడిన సౌకర్యాలు (ఆర్ఏ),ఆదేశించదగిన సౌకర్యాలు (డిఏ)లను నిర్దేశిస్తూ సమగ్ర సూచనలను జారీచేసింది. 2018 ఆగస్టు 31నాటికి అన్ని స్టేషన్లలో ఎన్ఇఏలను తప్పనిసరిగా నిర్దేశించాలని ఆర్‌బిఐ నిర్దేశించింది' అని కాగ్ నివేదిక తెలిపింది.'2018 ఏప్రిల్ నాటి రైల్వే బోర్డ్ ఆదేశాల ప్రకారం, కేటగిరీతో సంబంధం లేకుండాఅన్ని స్టేషన్లలో మొదటగా కనీస అవసరమైన సౌకర్యాలను అందించాలని నిర్దేశించబడింది. వీటిలో, తాగునీరు, వెయిటింగ్ హాల్స్, సీటింగ్ ఏర్పాట్లు, ప్లాట్‌ఫారమ్ షెల్టర్లు, యూరినల్స్, ల్యాట్రిన్లు, హైలెవల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఫ్యాన్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్(ఎఫ్ఓబి)లు, చెత్తబుట్లలు, గడియారాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు ఉన్నాయి' అని అది జోడించింది.ఎన్ఎస్‌జి–1 కేటగిరీ కిందకు వచ్చే సిఎస్ఎంటి, హౌరా, హౌరా, సీల్దా, న్యూఢిల్లీ, ముంబయి సెంట్రల్ వంటి స్టేషన్లలో కూడా సీటింగ్ ఏర్పాట్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు (యూరినల్స్, ల్యాట్రిన్స్), చెత్త బుట్టలు, ఎలక్ట్రానిక్ రైలు సూచిక బోర్డులు తదితర వాటిలో లోపాలు ఉన్నట్లు కాగ్ కనుగొంది. 'ఎన్ఎస్‌జి–1 కేటగిరీ స్టేషన్ల ఆడిట్ పరిశీలనలో 12 స్టేషన్లలో తాగునీటి కుళాయి ట్యాప్‌లు 8 స్టేషన్లకుగాను ఒక్కో స్టేషన్‌లో ఫ్యాన్లు, వాటర్ కూలర్లు, 5 స్టేషన్లలో సూచిక బోర్డులు వంటి కీలక ప్రయాణికుల స్టేషన్లలో లోపాలు ఉన్నట్లు వెల్లడైంది' అని నివేదిక తెలిపింది.ప్రయాణికుల సౌకర్యాల నిర్వహణ వ్యవస్థను విశ్లేషించిన తర్వాత, కనీస అవసరమైన సౌకర్యాల నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనలో లోపాలున్నాయని నివేదిక కనుగొంది. వాటిలో 201స్టేషన్లలో మరుగుదొడ్ల కొరత, 403 స్టేషన్లలో యూరినల్స్ కొరత, 2,035 స్టేషన్లలో నీటికుళాయిల కొరత వంటివి ఉన్నాయి. తన ప్రధాన సిఫార్సులలో భాగంగా, నీటి సరఫరా వ్యవస్థల తనిఖీకి నిర్దేశించిన ప్రోటోకాల్‌లను పాటించాలని, అలాగే, ఏకరీతి తాగునీటి (యూనిఫామ్ డ్రింకింగ్ వాటర్ క్వాలిటీ ఇన్‌స్టిట్యూషన్) కింద అన్ని పారామీటర్లు సహా తాగునీటిని సమగ్రంగా పరిశీలించాలని రైల్వేలను కాగ్ కోరింది.

## ఎవరి దారి వారిదే!

(మొదటి పేజీ తరువాయి)

పరస్పరం మాట్లాడుకోవడం కంటే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, చాటింగ్, ఆన్‌లైన్ కార్యక్రమాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. గతంలో ఇరుగుపొరుగు వారు ఎదురుపడితే ఆప్యాయంగా పలకరించుకునేవారు. వీధిలో పెద్దలు కనిపిస్తే పిల్లలు గౌరవంగా నమస్కరించేవారు. ఇంటికి బంధువులు వస్తే గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. ఇప్పుడు పక్కింట్లో ఎవరు ఉంటున్నారో కూడా తెలియని పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. ఎదురుగా వచ్చినా చిరునవ్వుతో పలకరించడానికి బదులు చేతిలోని ఫోన్ వైపు చూస్తూ వెళ్లిపోతున్నారు. సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ దాని అతివినియోగం కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతోంది. తల్లిదండ్రులు, పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయం తగ్గుతోంది. పిల్లలతో మాట్లాడాల్సిన తల్లిదండ్రులు ఫోన్‌లో నిమగ్నమవుతుండగా.. తల్లిదండ్రులతో సమయం గడపాల్సిన పిల్లలు మొబైల్ గేమ్స్, సోషల్ మీడియా, వీడియోలతో మునిగిపోతున్నారు. భార్యాభర్తలు ఒకే గదిలో ఉన్నా ఎవరి ఫోన్‌లో వారు నిమగ్నమవడం.. భోజన సమయంలోనూ ఫోన్‌ను పక్కన పెట్టలేకపోవడం నేటి జీవితంలో సాధారణ దృశ్యంగా మారింది. ఒకప్పుడు పండుగలు కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చేవి. బంధువులు, స్నేహితులు కలుసుకుని ఆనందంగా గడిపేవారు. ఇప్పుడు పండుగ సందర్భాల్లోనూ ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కళ్లముందు ఉన్న ఆనందాన్ని ఆస్వాదించడం కంటే దాన్ని ఫోన్‌లో బంధించి ఇతరులకు చూపించాలనే తపన పెరిగింది.

**సాంకేతికత అవసరమే.. కానీ హద్దు ఉండాలి**

సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ఆధునిక జీవితంలో తప్పనిసరి అవసరాలుగా మారాయి. విద్య, ఉద్యోగం, వ్యాపారం, సమాచార సేకరణ, అత్యవసర సేవలు వంటి అనేక రంగాల్లో సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అవసరానికి మించి వినియోగించడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రోజులో కొంత సమయాన్ని మొబైల్‌కు దూరంగా ఉంచి కుటుంబ సభ్యులతో మాట్లాడటం, పిల్లలతో ఆడటం, పెద్దలతో కాసేపు ముచ్చటించడం వంటి చిన్న చిన్న మార్పులు కుటుంబ అనుబంధాలను బలోపేతం చేస్తాయని సూచిస్తున్నారు.

**మళ్లీ ఆ పలుకరింపులు రావాలి..**

సాంకేతికతను వదిలేయాల్సిన అవసరం లేదు.. కానీ మనుషులను మాత్రం మర్చిపోకూడదు. పక్కనే ఉన్న వ్యక్తితో మాట్లాడేందుకు ఫోన్ అవసరం లేని పరిస్థితిని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, రోజులో కొంత సేపు మాట్లాడుకోవడం, ఇరుగుపొరుగు వారిని పలకరించడం వంటి అలవాట్లు మానవ సంబంధాలను నిలబెట్టగలవు.

**చేతిలోని మొబైల్ మనిషికి సాధనం కావాలి..**

మనిషే మొబైల్‌కు బానిస కాకూడదు. లేదంటే ఒకే ఇంట్లో ఉంటూ కూడా.. ఎవరి దారి వారిదే అన్న పరిస్థితి మరింత పెరిగే ప్రమాదం ఉంది.

## సీట్ల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలని, ఫీజు చెల్లించిన అనంతరం 'ఫీ పేమెంట్ రసీదు'ను 'జాయినింగ్ రిపోర్ట్'ను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పాండురంగారెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను, ఫీజు రసీదు, జాయినింగ్ రిపోర్టుతో కలిసి ఈనెల 20వ తేదీలోపు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

## ఇక ఇ.వి.లు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో 11,254 డీజిల్, 7,512 పెట్రోల్ ఆటోలు ఉన్నాయని మంత్రి తెలిపారు. పథకం అమలుకు ప్రభుత్వం రూ.200 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించిందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల నుంచి రూ.50 కోట్ల చొప్పున నిధులు సమకూర్చేలా ప్రతిపాదన రూపొందించామన్నారు.

**కాలుష్యం తగ్గింపు.. డ్రైవర్లకు ఆదా..**

ఎలక్ట్రిక్ ఆటోల వినియోగంతో వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పెట్రోల్, డీజిల్ ఖర్చు నుంచి ఆటో డ్రైవర్లు, యజమానులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌ను స్వచ్ఛమైన గాలి, సుస్థిర ప్రజా రవాణా దిశగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పథకం అమలులో పారదర్శకత కోసం రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ, పథకం అమలు కమిటీ, జిల్లా మంజూరు కమిటీలతో మూడు అంచెల పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, రవాణా అధికారులు ఈ కమిటీల్లో భాగస్వాములుగా ఉంటారని మంత్రి వెల్లడించారు.

# అర్ధ శతకంతో మెరిసిన జురెల్.. టీమిండియా భారీ స్కోర్




గాలే టెస్టులో తొలి రోజే పటిష్ఠ స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు తడబడింది. దేవ్దత్ పడిక్కల్(167) భారీ శతకంతో మెరిసినా.. మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే.. టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4–109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్దత్ పడిక్కల్(167 : 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా.. చూస్తుండగానే రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ.. ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్.. డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా.. జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్‌లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.




## చైనాతో డ్రా.. అవకాశం చేజార్చుకున్న భారత్

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్‌లో భారత జట్టు డ్రాతో ఆరంభించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత చైనాతో ఆదివారం హోరాహోరీ మ్యాచ్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియా ఆఖర్లో పట్టుసడలించింది. పెనాల్టీ కార్నర్ను సద్వినియోగం చేసుకున్న చైనా 2–2తో స్కోర్ సమం చేసింది. దాంతో మన జట్టు గెలవాల్సిన మ్యాచ్ కాస్త డ్రాగా ముగిసింది. భారత్ తరఫున నవ్నీత్, దీపికలు చెరొక గోల్తో రాణించారు. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల జట్టు అదిరే బోణీ కొట్టగా.. మహిళలు మాత్రం డ్రాతో సరిపెట్టుకున్నారు. వాగ్నర్ హాకీ స్టేడియంలో ఆదివారం చైనాను నిలువరించడంలో విఫలమైన టీమిండియా 2–2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే నేహ అందించిన పాస్‌ను నవ్‌నీత్ మెరుపు వేగంలో ప్రత్యర్థి గోల్పోస్ట్‌కి పంపింది. అయితే.. 15వ నిమిషంలో ఝూంగ్ ఇంగ్ చైనాకు తొలి గోల్ అందించగా స్కోర్ 1–1తో సమం అయింది. రెండో అర్ధ భాగంలో దీపిక డ్రాగ్ ఫ్లిక్ గోల్తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆపై బంతిపై నియంత్రణ కోల్పోయింది. పెనాల్టీ కార్నర్ను సద్వినియోగం చేసుకున్న చైనా 2–2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

## క్రికెట్‌లో స్పెయిన్ తుఫాన్.. ఆస్ట్రేలియా 'ఆల్‌టైమ్ రికార్డు' బ్రేక్

యూరప్ ఖండానికి చెందిన స్పెయిన్ ఫుట్‌బాల్ ఆటలోనే కాదు క్రికెట్లోనూ దూసుకెళ్తోంది. ఈ మధ్యే ఆ దేశ సాకర్ జట్టు ఫిఫా వరల్డ్ కప్‌ను ఒడిసిపట్టగా.. తాజాగా స్పెయిన్ పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా 'ఆల్టైమ్ రికార్డు'ను బ్రేక్ చేసింది. అంతర్జాతీయ టీ20ల్లో అనామక జట్టుగా అడుగుపెట్టి.. వరసగా 21 విక్టరీలతో ఆసీస్‌ను రెండో స్థానానికి తోసేసింది యూరప్ జట్టు. అంతేకాదు 2028లో టీ20 వరల్ కప్ బెర్తుకు గట్టి పోటీదారుగా మారింది స్పెయిన్. టెన్నిస్, ఫుట్బాల్ వంటి ఆటలకు పేరొందిన స్పెయిన్ ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్లోనూ అదరగొడుతోంది. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న స్పెయిన్.. టీ20 వరల్డ్ కప్‌లో యూరప్ ఉప ప్రాంతీయ క్వాలిఫయర్ సీ మ్యాచ్‌లో ఆదివారం ఫిన్లాండ్‌పై 8 వికెట్లతో గెలుపొందింది. ఈ విజయంతో రెండేళ్ల తర్వాత రాబోయే పొట్టి ప్రపంచకప్‌లో ఆడే అవకాశానికి మరింత చేరువైంది. ప్రస్తుతం టీ20ల్లో 28వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఇది వరసగా 21 విజయం. దాంతో, వరసగా 20 విజయాలతో రికార్డు నెలకొల్పిన ఆస్ట్రేలియా రెండో స్థానానికి పడిపోయింది. 2023 నుంచి 2026 మధ్య 21 విజయాలతో స్పెయిన్ ఈ మైలురాయిని అందుకుంది. ఈ క్రమంలో జెర్సీ, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, గ్రీస్, ఫిన్లాండ్ వంటి జట్లను ఓడించింది యూరప్ టీమ్. దిగ్గజ సారథి రికీ పాంటింగ్ హయాంలో ఆస్ట్రేలియా 2003లో వరసగా 20 విజయాల (17 వన్డేలు, 3 టెస్టులు)తో చరిత్ర సృష్టించింది. దాదాపు ఇరవై మూడేళ్లుగా చెక్కు చెదరని ఈ రికార్డును స్పెయిన్ బద్ధలు కొట్టింది. ప్రస్తుతం.. రెండో స్థానంలో ఉండగా.. ఉగాండ(17 విజయాలు), పాకిస్థాన్(14 విజయాలు), జపాన్(14 విజయాలు), దక్షిణాఫ్రికా(13 విజయాలు), న్యూజిలాండ్ (13 విజయాలు), మలేషియా(13 విజయాలు), బెర్ముడా(13 విజయాలు)లు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## ఆరోగ్యం



### నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు..

వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా నీటి ద్వారా వ్యాపించే అంటువ్యాధులను నియంత్రించడంలో కొన్ని దశాబ్దాలుగా సాధించిన పురోగతి దెబ్బతినే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం హెచ్చరించింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో ఆన్‌షుట్జ్, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరిశోధన ఫలితాలు 'నేచర్ రివ్యూస్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో, ఐదేళ్లలోపు పిల్లల్లో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు మరణాలు, అనారోగ్యానికి ప్రధాన కారణంగా ఉన్నా యి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, భారీవర్షాలు, కరువు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి తీవ్ర వాతావరణ ఘటనలు తరచుగా సంభవిస్తున్నాయి. ఇవి తాగునీటి వనరులను కలుషితం చేసి వ్యాధికారక సూక్ష్మ జీవుల వ్యాప్తికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కొన్ని బ్యాక్టీరియా, ప్రోటోజోవా వేగంగా పెరగడానికి అనుకూలంగా ఉంటాయి. అయితే నోరోవైరస్, రోటావైరస్, అడెనోవైరస్ వంటి కొన్ని వైరస్‌లు చల్లని, పొడి వాతావరణంలో ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. అందువల్ల అన్నిరకాల వ్యాధులకు ఒకే విధమైన నివారణ చర్యలు సరిపోవని, ప్రతి వ్యాధికారక సూక్ష్మ జీవి స్వభావాన్ని బట్టి ప్రజారోగ్య వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు సూచించారు. వాతావరణ మార్పులను తట్టుకునే నీటి సరఫరా, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థలను మెరుగుపరచడం, టీకా కార్యక్రమాలను విస్తరించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రజారోగ్య చర్యలను మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయగలిగితే నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

## పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసులు



ఫ్యాటీ లివర్ (కాలేయం వాపు) వ్యాధి అంటే చాలామంది మద్యం ఎక్కువగా తాగే వారికి లేదా అధిక బరువు ఉన్న వారికే వస్తుందని భావిస్తారు. కానీ వైద్యులు ఈ అభిప్రాయం పూర్తిగా తప్పని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 'మెటబాలిక్ డిస్‌ఫంక్షన్‌అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్' (ఎంఎఎస్ఎల్‌డి)గా పిలిచే ఈ వ్యాధి యువతలో, ఐటి ఉద్యోగుల్లో, అలాగే బయటకు ఆరోగ్యంగా కనిపించే సన్నని వ్యక్తుల్లో కూడా వేగంగా పెరుగుతోంది. 2026 ఫీనోమ్ ఇండియా అధ్యయనం ప్రకారం భారతదేశంలోని ప్రతి పది మంది పెద్దల్లో దాదాపు నలుగురికి ఫ్యాటీ లివర్ సమస్య ఉంది. ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేసేవారిలో ఇది 75 నుంచి 80 శాతం వరకు ఉన్నట్లు అంచనా. ఈ వ్యాధి ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం దీని అత్యంత ప్రమాదకరమైన అంశం. కాలేయంలో కొవ్వు పేరుకుపోతున్నా అది తన పనిని సాధారణంగానే కొనసాగిస్తుంది. అలసట, కడుపులో అసౌకర్యం, బలహీనత వంటి లక్షణాలు కనిపించే సమయానికి కాలేయంలో వాపు లేదా గాయాలు ప్రారంభమై ఉండే అవకాశం ఉంటుంది. అందుకే చాలామందికి సాధారణ ఆరోగ్య పరీక్షలు లేదా ఇతర కారణాల కోసం చేసిన స్కానింగ్‌లలోనే ఈ సమస్య బయటపడుతోంది. భారతీయుల్లో బయటకు శరీర బరువు సాధారణంగా ఉన్నప్పటికీ పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా పేరుకుపోయే స్వభావం, కండరాల పరిమాణం తక్కువగా ఉండటం వల్ల ఇన్సులిన్ నిరోధకత పెరిగి కాలేయంలో కొవ్వు నిల్వ అవుతుంది. మధుమేహం, అధిక రక్తపోటు, ట్రైగ్లిజరైడ్లు పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం, అధికంగా తీపి పదార్థాలు, శుద్ధి చేసిన పిండి పదార్థాలు, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వంటి అంశాలు ఈ వ్యాధి ప్రమాదాన్ని మరింత పెంచుతాయి. చికిత్స చేయకుండా వదిలేస్తే కాలేయంలో వాపు, క్రమంగా గాయాలు ఏర్పడి చివరకు సిరోసిస్, కాలేయ వైఫల్యం లేదా కాలేయ క్యాన్సర్‌కు దారితీయవచ్చు. అయితే ఈ వ్యాధి ప్రారంభ దశలో గుర్తిస్తే జీవనశైలిలో మార్పులతో తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం సాధ్యమవుతుంది. శరీర బరువును 7నుంచి 10 శాతం వరకు తగ్గించడం, క్రమం తప్పకుండా కండరాలను బలపరిచే వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, చక్కెర పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం, మధుమేహం, కొలెస్ట్రాల్, రక్తపోటును నియంత్రణలో ఉంచడం అవసరం. జీవనశైలిని మార్చుకోవడం ద్వారా కాలేయ వ్యాధులను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## అల్జీమర్స్‌పై పోరాటంలో కొత్త మలుపు



అల్జీమర్స్ వ్యాధి చికిత్సలో కొత్త మార్గాలకు దారితీసే కీలక ఆవిష్కరణను శాస్త్రవేత్తలు సాధించారు. మెదడు కణాల లోపల ఉండే అంతర్గత నిర్మాణంలో ఒక ప్రత్యేకమైన 'ద్వారపాలక' వ్యవస్థను వారు గుర్తించారు. ఈ వ్యవస్థ కణాలు అవసరమైన పదార్థాలను ఎలా గ్రహిస్తాయో నియంత్రిస్తుందని పరిశోధన వెల్లడించింది. పరిశోధకుల ప్రకారం, ఈ అంతర్గత అస్థిపంజరం లాంటి నిర్మాణం కణాల్లోకి ప్రోటీన్లు, ఇతర అణువులు ప్రవేశించే ప్రక్రియను నియంత్రిస్తుంది. ఈ వ్యవస్థలో లోపాలు ఏర్పడితే, అల్జీమర్స్ వ్యాధితో సంబంధం ఉన్న హానికరమైన ప్రోటీన్లు మెదడు కణాల్లో అసాధారణంగా పేరుకుపోయే అవకాశం ఉంది. ఈ 'గేట్‌కీపర్' వ్యవస్థ పనితీరును నియంత్రించే కొత్త ఔషధాలను అభివృద్ధి చేయగలిగితే, అల్జీమర్స్ వ్యాధి పురోగతిని నెమ్మదింపజేయడం లేదా కణాలను దెబ్బతినకుండా కాపాడడం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, అల్జీమర్స్ వ్యాధి ఎలా అభివృద్ధి చెందుతుందనే అంశంపై కొత్త అవగాహనను అందించడంతో పాటు, భవిష్యత్తులో మరింత ప్రభావవంతమైన చికిత్సల అభివృద్ధికి కొత్త లక్ష్యాలను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

## కార్మికుల వేతనాలు పెంచడంలో పాలకులు విఫలం

ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంలో పాలకులు విఫలంమయ్యారని ఎఐటియుసి ప్రధాన జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండలో సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామితో కలిసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అవుతున్నా నేటికీ రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం లేక, పిఎఫ్, ఇఎస్ఐ అమలు కాక శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యారని విమర్శించారు. కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ముఖ్యమైన 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 4 కోడ్లుగా కుదించి కార్పొరేట్ సంస్థలకు, గుత్త పెట్టుబడిదారులకు అనుగుణంగా మార్పులు తెస్తోందని మండిపడ్డారు. కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలకు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్‌రెడ్డి, నాయకులు నూనె వెంకటేశ్వర్లు, దోటి వెంకన్న, ఎండి జానీ, బరిగల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లుగా పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హనుమాండ్లు, తెలంగాణ స్వీపర్స్, స్కావెంజర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా ఎఐటియుసి కార్యాలయంలో స్వీపర్స్, స్కావెంజర్స్ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు వసంత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్లకు, స్కావెంజర్ల వేతనాలను ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లించాలన్నారు. స్వీపర్లు స్కావెంజర్లకు ఇవ్వవలసిన బకాయిలను విడుదల చేయాలన్నారు. స్కావెంజర్లను కార్మికులుగా గుర్తించి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వం కార్మికుల వేతనాలను ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి ఫిరోజ్ అలీ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కమ్యూనిస్టులు ఏకం కావాలి : కూనంనేని

విప్లవ స్వాప్నికుడు చంద్రశేఖర్

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

సమీక్ష అవసరం : సతీష్ చందర్




**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు విప్లవాన్ని స్వప్నించి దానిని నిజం చేయడం కోసం పనిచేసిన ఉత్తమ కమ్యూనిస్టు రాయల చంద్రశేఖర్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆత్మహత్య అది వ్యక్తిగత విషాదం కాదని ఉద్యమంలో సహచరులతో వచ్చిన ఒత్తిల్లే కారణమని దీనిపై లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి వివిధ హోదాలలో పనిచేసిన రాయల చంద్రశేఖర్ జీవితానికి సంబంధించిన రెండు పుస్తకాలను ఆదివారం స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఆయన సహచరి రాయల విమల రాసిన ఓ భగ్న విప్లవ ప్రేమికుడు రాయల చంద్రశేఖర్ అనే పుస్తకంతో పాటు చంద్రశేఖర్ మృతి తర్వాత సహచరులు, బంధుమిత్రులు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవి నల్లమోతు తిరుమలరావు అధ్యక్షత వహించిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ మృతి విచారించదగినదన్నారు. మారుతున్న కాల మాన పరిస్థితులు, పాలకుల నిర్ణయాల నేపథ్యంలో కమ్యూనిస్టులంతా ఒకటి కావాల్సి ఉందని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రానున్న కాలంలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరగనుందన్నారు. ఈసందర్భంలో రాయల చంద్రశేఖర్ లాంటి వ్యక్తులు ఉద్యమానికి అంకితమై పనిచేసి మన నుండి దూరం కావడం అత్యంత బాధాకరమన్నారు. పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సంపాదకులు సతీష్‌చందర్ మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్‌ది వర్గ విబేధాలకు తావివ్వని జీవితమని నాలుగున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాలలో, ప్రజా ఉద్యమాలలో పనిచేశారన్నారు. ఒక వ్యక్తిని బలహీనమైన క్షణాలకు నెట్టివేసే పరిస్థితులకు ఎవరు కారణమనే దానిపైన సమీక్షించాల్సిన అవసరం ఉందని సతీష్ చందర్ పేర్కొన్నారు. విప్లవోద్యమం బయట నుంచి చూసే వారికి, అంతర్గతంగా పని చేస్తున్న వారికి ఉన్న సంబంధాన్ని పాలకులు ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కరచలనం చేసిన చేతులను మళ్లీ తాకుతామో లేదన్న భావన బలపడుతుందని ఈ పరిస్థితులకు ఎదురోడ్డాల్సిన స్థితిలో చంద్రశేఖర్ లాంటి వ్యక్తులు దూరమవుతున్నారన్నారు. ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షులు టి.ప్రసాద్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఏడు ప్రాంతాల్లో తిరుగుతూ విప్లవోద్యమంలో పనిచేశారని ఆయన మృతిపై అన్ని స్థాయిల్లోనూ విచారణ జరగాల్సి ఉందన్నారు. చంద్రశేఖర్ సహచరి విమల మాట్లాడుతూ విప్లవోద్యమంలో పనిచేసిన తమపై నేరస్తులుగా ముద్ర వేసే ప్రయత్నాలు జరిగాయని తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు సమాజం దృష్టికి తీసుకు వచ్చేందుకు పుస్తకం ప్రజల ముందుకు తెచ్చామన్నారు. సభలో ఎఐకెఎంఎస్ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బొంతు రాంబాబు, సిపిఐ నాయకురాలు పోటుకళావతి, ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, ఝాన్సీ, గౌరి, పద్మ, సమాచార హక్కు కమిషనర్ శ్రీనివాసరావు, కెవై రాంచందర్‌రావు, గౌని ఐలయ్య పాల్గొన్నారు.





## ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

శక్తి శాఖలో విలీనాన్ని వెనక్కి తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ నగర సమితి సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అన్నారు. దీనిని శక్తి శాఖలో కల్పడం వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతీనే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేటు పరమైతే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లొమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి కానీ ఆ విద్యకు దూరం చేసే చర్యలు ఉండకూడదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెం. 97ను ఉపసంహరించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్, పవన్, కొమరం మహేష్, సాయి, చరణ్, గోపి, నరేందర్, పవన్, కార్తీక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

సిపిఐ నేత బాగం

చింతల వినయ్ నేతృత్వంలో

వందలాది మంది సిపిఐలో చేరిక




**ప్రజాపక్షం/ ఖమ్మం :** జనాభాలో సగ భాగానికి పైగా కలిగిన యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, ఎఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం చింతల వినయ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నుంచి ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఖానాపురం హవేలీ సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ముఖ్యంగా ఉపాధి కల్పన రంగాలపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. నైపుణ్యత కలిగిన యువతకు సైతం ఉపాధి దొరకడం లేదని నైపుణ్యత లేని వారు ఏదో ఒక రకంగా ఉపాధి పొందేందుకు ప్రయత్నిస్తుంటే పాలకులు రకరకాల చట్టాలతో బతక లేని పరిస్థితిని సృష్టిస్తున్నారని హేమంతరావు తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా యావత్ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టి దేశాన్ని ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు ఎదురు లేదనుకుంటున్న మోదీని ఈ దేశ యువశక్తి మెడలు వంచిందని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటంతో మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్ప లేదని ఆయన తెలిపారు. రాజకీయాల్లో అవినీతిపై యువత భగ్గుమంటున్న సమయంలో యువతకు మద్దతుగా నిలుస్తూ యువజన పోరాటాల్లో పాలు పంచుకున్న సిపిఐలో యువకులు చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన విషయంలో ఆడిన మాట తప్పిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక డిక్లరేషన్లు ఇచ్చిందని ఏ డిక్లరేషన్‌ను అమలు చేసే పరిస్థితిలో లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సిపిఐ ఇటీవల జన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా ఉద్యమాలకు నూతన జవసత్వాలను తీసుకువచ్చిందన్నారు. చింతల వినయ్‌తో సహా పార్టీలో చేరిన వారందరిని సిపిఐ సగర్వంగా ఆహ్వానిస్తుందని హేమంతరావు తెలిపారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రసంగించగా నానబాల రామకృష్ణ, యర్రాబాబు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, ప్రతాపనేని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్, విజయ్, రాకేష్, పవన్, రాజు, కిషోర్, కిరణ్, రంజిత్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి సిపిఐలోకి ఆహ్వానించారు.



# పేదల ఆత్మబంధువు స్మార్ట్ రేషన్ కార్డు

- మరింత చేరువగా సంక్షేమ సేవలు
- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** స్మార్ట్ రేషన్ కార్డు పేదలకు ఆత్మబంధువు లాంటిదని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీం ఆదివాసి భవన్‌లో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందచేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అందించడంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఒక కీలక ముందడుగన్నారు. మాన్యువల్‌గా వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఉండేవని స్మార్ట్ రేషన్ కార్డులతో అవన్నీ దూరమవుతాయన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు సన్నబియ్యం సజావుగా పంపిణీ సజావుగా చేపట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని చెప్పారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికర్ అలీ, కౌసర్ మొహియొద్దీన్, దానం నాగేందర్, శ్రీనవేష్, ఎమ్మెల్సీలు కోదండరాం, మీర్జా రహ్మత్ బేగ్‌లు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి ఆహార భద్రత కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 8,43,607 ఆహార భద్రతా కార్డులు ఉండగా వాటి పరిధిలో 32,29,131 మంది కుటుంబ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చేందుకు వచ్చిన దరఖాస్తుల్లో 3,15,766 దరఖాస్తులను పరిశీలించి ఆమోదించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ ఇతర అధికారులు, సిబ్బంది, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కెబిఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్‌కు భారీ ఊరట

- రూ.1,090 కోట్లతో హెచ్-సిటీ ప్రాజెక్టు పనులు
- సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు
- 18 నుంచి కెబిఆర్ పార్క్ చుట్టూ వన్ వే: సిపి సజ్జనర్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో అత్యంత రద్దీగా ఉండే కెబిఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను చేపట్టింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సిటీ) ప్రాజెక్టులో భాగంగా రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో 7 మల్టీ లెవెల్ స్టీల్ ఫ్లైఓవర్లు, 7 డైరెక్షనల్ అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు ఆగస్టు 18 నుంచి కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానం అమలు చేయనున్నారు.

**14 భారీ నిర్మాణాలు..**

కెబిఆర్ పార్క్ చుట్టూ ఉన్న ప్రధాన జంక్షన్లను రెండు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 14 నిర్మాణాలను చేపడుతున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కెబిఆర్ పార్క్ ఎంట్రెన్స్, ముగ్ధ జంక్షన్‌లతో కూడిన ప్యాకేజీ1లో 3 జంక్షన్ల వద్ద అండర్‌పాస్‌లు, స్టీల్ ఫ్లైఓవర్లు నిర్మిస్తారు. రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్లతో కూడిన ప్యాకేజీ2లో మరో 8 నిర్మాణాలు చేపడుతున్నారు. మొత్తం ప్రాజెక్టును 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కెబిఆర్ కారిడార్ కోర్ సిటీని ఐటీ కారిడార్‌తో అనుసంధానించే కీలక మార్గం కావడంతో ఇక్కడ వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. పీక్ అవర్‌లో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద గంటకు 15,321 పిసియులు, కెబిఆర్ పార్క్ ఎంట్రెన్స్ వద్ద 13,516 పిసియులు నమోదవుతున్నాయి. మహారాజా అగ్రసేన్ జంక్షన్‌లో 10,356, రోడ్ నంబర్ 45 వద్ద 9,966, ఫిలింనగర్‌లో 9,605, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్‌లో 5,880 పిసియుల ట్రాఫిక్ ఉంటోంది.

**సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యం..**

నిర్మాణాలు పూర్తయిన తర్వాత కెబిఆర్ పార్క్ ఎంట్రెన్స్, రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ తెలిపారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద సుమారు 80 శాతం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. ప్రయాణ సమయం, ఇంధన వినియోగం తగ్గడంతో పాటు వాహనాల నుంచి వెలువడే కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి..**

వన్ వే విధానం అమలుతో తొలిరోజుల్లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో కొంత అసౌకర్యం కలగవచ్చని సజ్జనర్ తెలిపారు. రెండు విడతల ట్రయల్ రన్స్, సమగ్ర అధ్యయనం అనంతరం జిహెచ్ఎంసి సహకారంతో ట్రాఫిక్ ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. కెబిఆర్ పరిసర కాలనీవాసులు, వాకర్స్, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి మార్పులు చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సిగ్నల్ రహిత, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం తాత్కాలికంగా అమలు చేసే వన్ వేకు వాహనదారులు, స్థానికులు, నగరవాసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఏడవ పిఆర్‌సి వేతన సవరణ బకాయిలు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లైబ్రేరియన్సు, ఫిజికల్ డైరెక్టర్లకు ఏడవ పిఆర్‌సి వేతన సవరణ బకాయిలను విడుదల చేసి, వాటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ సుభాష్ రెడ్డి ప్రతినిధుల బృందం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై కోదండరామ్ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేందుకు తక్షణమే చర్య తీసుకునేందుకు తన వంతు కృషిచేస్తానని హామీనిచ్చారు. అనంతరం బ్రిజేష్ మాట్లాడుతూ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న నూతన పెన్షన్ పథకానికి (సిపిఎస్) చెందిన అధ్యాపకులకు ఈ మూడున్నర సంవత్సరాల కాలానికి సంబంధించిన వేతన సవరణ బకాయిలు నేటికీ అందలేదన్నారు. రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాలకు పనిచేస్తున్న అధ్యాపకులు,ఆచార్యులు, పాత పెన్షన్ విధానానికి సంబంధించిన అధ్యాపకులు ఈ ఏడవ వేతన సవరణ బకాయిలు సకాలంలో అందుకున్నారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలై నేటికీ ఏడవ పిఆర్సీ బకాయిలు అందక ఎదురు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు 'మండల ప్రజావాణి' ప్రారంభం

అవసరమైతే రైతు వేదికను ఉపయోగించుకోండి: చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి 'మండల స్థాయి' ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రజావాణి కార్యక్రమానికి అవసరమైన స్థలం లేకపోతే ఆయా మండలాల్లో ఉన్న రైతు వేదికలను ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైతే 'రైతు వేదిక'లను ఉపయోగించుకోవాలని ఎంపిడిఒలకు రాష్ట్రస్థాయి ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి సూచించారు. రాష్ట్రంలో రైతు వేదికలలో ప్రజావాణి నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరగా, అందుకు ఆయన అంగీకరించారని చిన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని మండలాల ఎంపీడీవోలకు ఇటీవల ప్రజా భవన్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సూచించిన విధంగానే అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని దరఖాస్తుదారులకు అన్ని రకాల కనీస సౌకర్యాలు కల్పించాలని, మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చిన్నారెడ్డి సూచించారు.

## ప్లాంట్ కలుషిత నీరు తాగి 19 మేకల మృతి

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీరు వల్ల అనేక మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. సమితి సింగారం చెందిన రాచకొండ రాములుకు చెందిన 19 మేకలు ఎస్ఎంఎస్ ప్లాంట్ నుండి వెలువడే కలుషిత నీటిని తాగి మృతి చెందాయి. గత ంలో కూడా అనేక పర్యాయాలు ఈ నీరు దాగి మూగజీవాలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. గతంలో సాయిలుకి చెందిన 20 మేకలు, ఇస్లాక్ చెందిన 40 మేకలు కూడా ఈ నీరు తాగి మృతి చెందినట్లు ఆరోపణలు ఉన్నాయి.. వాగుల్లోకి పంపించకుండా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకొని మూగ జీవుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## 'లా' ఎన్‌రోల్‌మెంట్‌కు బ్రేక్

- హైకోర్టు కీలక ఆదేశాలు
- 17న జరగాల్సిన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ నిలిపివేత
- దాదాపు 200 దరఖాస్తులపై ప్రభావం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** రాష్ట్రంలో 'లా' ఎన్‌రోల్‌మెంట్‌కు బ్రేక్ పడింది. దీంతో ఈ నెల 17న జరగాల్సిన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో తెలంగాణ బార్‌కౌన్సిల్‌లో న్యాయవాదులుగా ఎన్‌రోల్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్న దాదాపు 200 మంది నూతన న్యాయవాద విద్యార్థులు, లా గ్రాడ్యుయేట్లపై ప్రభావం పడింది. ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ బార్ కౌన్సిల్‌లో ఏర్పాటు చేసిన ఇంటరిమ్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. బి.జగదీశ్వర్ దాఖలు చేసిన ఈ రిట్ పిటిషన్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్, దాని ఎన్‌రోల్‌మెంట్ కమిటి ఏర్పాటుపై జూన్ ఆరోతేదీన జారీ చేసిన లేఖను సవాల్ చేశారు. ఇంటరిమ్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ ఏర్పాటు అడ్వకేట్ యాక్ట్ 1961లోని సెక్షన్ 58కి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈపిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు, ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ పూర్తయి తీర్పుకోసం పెండింగ్‌లో ఉన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుంది. ఈ పరిస్థితుల్లో బ్యాలెన్స్ ఆఫ్ కన్వీనియన్స్‌ను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఇంటరిమ్ ఎన్‌రోల్‌మెంట్ కమిటి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను రిట్ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు వెలుబడేవరకు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది.

## కాంగ్రెస్‌ను పటిష్టపర్చాలి

రంగారెడ్డి జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.మోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయిలో పటిష్టంగా ఉంటే ఖచ్చితంగా గెలుస్తుందని, అందుకే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.మోహన్ సూచించారు. భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్రలో రాహుల్ గాంధీ అనేక అంశాలను తెలుసుకున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో 'సర్2'పైన ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై కోఆర్డినేటర్లకు శిక్షణనిచ్చారు.అనంతరం మోహన్ మాట్లాడుతూ సంఘ్టన్ సృజన్ అభియాన్ అనేది భారత జాతీయ కాంగ్రెస్ చేపట్టిన ఒక దేశవ్యాప్త సంస్థాగత పునరుద్ధరణ కార్యక్రమమని, ఇందులో భాగమే బూత్ స్థాయి నుండి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) వరకు పార్టీని బలోపేతం చేయడమని వివరించారు. సమర్థులైన, నిబద్ధత కలిగిన డిసిసి అధ్యక్షులను గుర్తించి, నియమించడంతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ తర్వాత డిసిసి, బ్లాక్, మండల, గ్రామ/వార్డు, బూత్ స్థాయి సంస్థలను పునర్నిర్మించి, బలోపేతం చేస్తామన్నారు. కేవలం కార్యవర్గాన్ని మార్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం కాదని, క్రియాశీలకమైన, జవాబుదారీతనమైన, వికేంద్రీకృత,క్షేత్రస్థాయి ఆధారిత సంస్థను సృష్టించడం ముఖ్యఉద్దేశమని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 1,054 సంస్థాగత జిల్లాలు ఉన్నాయని, 24 జూలై 2026 నాటికి 762 జిల్లాలలో డీసీసీ అధ్యక్షులను ప్రకటించామన్నారు.



## ఉద్యమ సాహితీకిరణం డాక్టర్ సిధారెడ్డి

- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం అందుకున్న సందర్భంగా డాక్టర్ నందిని సిధారెడ్డిని వరంగల్‌లోని ఐదు ప్రధాన సాహితీ సంస్థలు ఘనంగా సన్మానించాయి. శతావధాని చేపూరి శ్రీరాం అధ్యక్షతన నిర్వహించబడిన ఈ సమావేశానికి ప్రముఖ నవలా రచయిత కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ ముఖ్య అతిథిగా హాజరై సిధారెడ్డి కవిత్వంలో చైతన్యంతో పాటు మానవీయవిలువలు మెండుగా ఉంటాయని ప్రశంసించారు. విశిష్ట అతిథిగా, ప్రధాన వక్తగా హాజరైన హైదరాబాద్ సిటీ కాలేజీ ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు పల్లె, రైతు,మట్టి, శ్రామికులు, ప్రకృతి, తెలంగాణ జీవన తాత్త్వికతకు మూలాలని, ఇవే సిధారెడ్డి కవితా వస్తువులని వాటిని ఉపయోగించి తన స్పష్టమైన నిబద్ధతతో సిధారెడ్డి చక్కని కవిత్వం సృజించారని ఉత్పత్తి మూలాలను, ఉత్పత్తి పరికరాలను ఉన్నతీ కరించే వైఖరి వారి కవిత్వంలో కనబడుతుందని అన్నారు. మరో విశిష్ట అతిథి డాక్టర్ బన్న అయిలయ్య సిధారెడ్డి కవితలోని మానవీయతను విశ్లేషించారు. సైనిక కవి, ఖండాంతర కవి, వి.ఆర్. విద్యార్థి, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు పొట్లపల్లి శ్రీనివాసరావు అభ్యుదయ రచయిత సంఘం బాధ్యులు బూర భిక్షపతి తమ ప్రసంగాలతో డాక్టర్ నందిని సిధారెడ్డిని అభినం దించారు. అనంతరం డాక్టర్ సిధారెడ్డికి అన్ని సంఘాలు సంయుక్తంగా సన్మానం నిర్వహించాయి. ప్రముఖ కవి బిల్ల మహేందర్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కవులు వల్లంపట్ల నాగేశ్వరావు, డాక్టర్ ఏరుకొండ నరసింహుడు, డాక్టర్ బండారు సుజాత, గట్టు రాధిక, తాడిచర్ల రవి, వెలుగు ప్రభాకర్, డాక్టర్ మంథని శంకర్, శశిధర్, షాలిని, రాంబ్రహ్మం, వజ్జీరు ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

# నల్సార్ వర్సిటీ విద్యార్థుల నిరసనకు మద్దతివ్వండి

- ప్రతిపక్ష పార్టీలకు ఐసా అధ్యక్షురాలు నేహాబోరా విజ్ఞప్తి



**హైదరాబాద్ :** జార్ఖండ్, హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులు చేస్తున్న నిరసనలకు మద్దతు తెలపాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) అధ్యక్షురాలు నేహా బోరా ప్రతిపక్ష పార్టీకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఆదివారం ఆమె పిటిఐ వీడియోతో మాట్లాడారు. నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులు, తమ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ప్రధాన అతిథిగా భారత ప్రధాన న్యాయమూర్తిని (సిజెఐ) ఆహ్వానించే ప్రతిపాదనను వ్యతిరేకించిన విషయం తెలిసిందే. జార్ఖండ్‌లో జెపిఎస్‌సి-జెఎస్ఎస్‌సి సంస్కరణల వేదిక ఆధ్వర్యంలో నియామక పరీక్షలలో జరిగిన అక్రమాలపై విద్యార్థులు నిరసనలు చేస్తున్నారు. సిపిఐ లేదా రాష్ట్రం వెలుపలి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తుల బృందంతో స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, ఉద్యోగార్థులు జులై 25 నుండి ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల డిమాండ్లను లేవనెత్తడం, క్షేత్రస్థాయి నుండి వస్తున్న గొంతుకలను బలోపేతం చేయడం పార్లమెంటు సభ్యుల బాధ్యత అని బోరా అన్నారు. 'దేశంలోని వీధుల్లో ప్రజలు లేవనెత్తుతున్న అంశాలను పార్లమెంటులో ప్రస్తావించడం వారి పని. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల సమయంలో ప్రతిపక్ష పార్టీలు, ముఖ్యంగా ఇండియా కూటమి పార్టీలు అలా చేయడం అభినందనీయం. అయితే, మాకు మద్దతుగా నిలిచిన ఈ రాజకీయ పార్టీలన్నీ జార్ఖండ్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ విద్యార్థులకు కూడా మద్దతుగా నిలవాలని కోరుతున్నానని బోరా అన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన కొంతమంది విద్యార్థులు ఈ ఏడాది జూలైలో సంస్థ వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లకు లేఖ రాస్తూ, ఈ ఏడాది స్నాతకోత్సవానికి సిజెఐ సూర్య కాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకించారు. నీట్ పేపర్ లీక్‌లపై జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసన సమయంలో ఢిల్లీలో కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి 23 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన బోరా మాట్లాడుతూ, ఆ నిరసన విద్యా వ్యవస్థలో ఉన్నట్లు ఆరోపించబడుతున్న లోపాలపై జరిగిందని, నిరాహార దీక్ష ద్వారా దేశ ప్రజల మనస్సాక్షిని తాము తట్టిలేపే ప్రయత్నం చేశామని అన్నారు. 'ఇది దేశంలోని యువతకు ఏళ్ల తరబడి అన్యాయం చేస్తూ వస్తున్న వ్యవస్థను బట్టబయలు చేసింది. ఇది కేవలం ప్రశ్నపత్రం లీక్ సమస్య మాత్రమే కాదు, నిరుద్యోగ సమస్య అనే తీవ్ర సంక్షోభానికి సంబంధించిన విషయం... ప్రజలకు విసుగు వచ్చింది, వారు మార్పును కోరుకున్నారు' అని ఆమె అన్నారు. జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెఐ) ఆధ్వర్యంలో జూన్ 20న ప్రారంభమైన నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో 36 రోజుల తర్వాత జూలై 25న ముగిశాయి.

## ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి సహకారం

- సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరంలో వక్తలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సామాజిక ప్రజాస్వామ్య పరిరక్షణ కర్తవ్యంగా రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు పనిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రెండవ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరిగాయి. ఈ సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విలువలతో కూడినదిగా అమలు కావడం లేదని ఈ విషయాన్ని రచయితలు, కవులు గుర్తించాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించి చర్చా కార్యక్రమాలను నిర్వహించారు.దేశంలో వర్తమాన పరిస్థితులు, యువత అర్థం చేసుకుంటున్న తీరు, భవిష్యత్తు పరిణామాలను గురించి పలువురు చర్చించారు. ప్రజాస్వామ్యం సాంస్కృతిక సంభాషణ అనే అంశంపై ప్రముఖ కవయిత్రి మార్గరేట్, కథకుడు దాదాహయేత్ తదితరులు ప్రసంగించారు. కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు ప్రసేన్ సమూహ సభల ప్రారంభోపన్యాసం చేయగా విద్యాసాగర్, రూప, రుక్మిణి సమూహ లక్ష్యాలను వివరించారు. ప్రజాస్వామ్యం పౌరసత్వ సమస్య అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్. మల్లారెడ్డి, ప్రముఖ సామాజిక విశ్లేషకులు జహఅరా ప్రసంగించారు. వివిధ అంశాలపై సుంకిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం, ప్రముఖ వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, ధరణికోట రమేష్, ఫణీ మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమూహ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు.

## గురుకులంలో ర్యాగింగ్ కలకలం

- ఇంటర్ విద్యార్థులు దాడి చేశారని 10వ తరగతి విద్యార్థుల ఆరోపణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాంధీపురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఇంటర్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను గదిలోకి తీసుకెళ్లి బట్టలు విప్పించి తీవ్రంగా కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో కబడ్డీలో 10వ తరగతి విద్యార్థులు విజయం సాధించడమే ఘటనకు కారణంగా తెలుస్తోంది. శనివారం అర్ధరాత్రి దాడి జరిగినట్లు బాధిత విద్యార్థులు పేర్కొన్నట్లు సమాచారం. భయంతో కొందరు విద్యార్థులు రాత్రంతా రైల్వే స్టేషన్, సమీప ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కారేపల్లి పోలీసులు పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

## ముల్కనూరులో వెలుగులోకి మరో చారిత్రక శిల్పం

కాటమయ్య గుండుపై అయ్యదేవుడు



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఇటీవలనే కళ్యాణీ చాళుక్యుల శాసనాన్ని గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుడికందుల కిషోర్, సిద్ధమల్ల రమేష్ మరో చారిత్రక శిల్పాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. కళ్యాణి చాళుక్యుల శాసనం ఒక పరుపుబండపై ఉండగా దీనికి ఎదురుగా కొంత దూరంలో ఒక్క పెద్ద రాతి గుండు ఉంది. దీన్ని స్థానికులు కాటమయ్య గుండుగా పిలుస్తారు. ఈ గుండుకు ఉత్తరాభిముఖంగా మూడు అర్ధ శిల్పాలు ఉన్నాయి. వాటిలో గుర్రాన్నెక్కి కుడిచేత ఆయుధాన్ని భుజం మీద పెట్టుకుని, ఎడమచేత కళ్ళెం పట్టుకున్న అయ్యదేవుడిని స్థానిక ప్రజలు కాటమరాజుగా పిలుస్తున్నారు. అతని గుర్రం ముందు ఒక కుక్క ఉంది. గ్రామాలను రక్షించే అయ్యదేవుళ్లను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా పిలుస్తారు. కొన్ని ప్రాంతాల్లో కాటమయ్య అని పిలువగా మరికొన్ని ప్రాంతాల్లో కాటమరాజుగా పిలుస్తారు. ఈ శిల్పాలు కళ్యాణి చాళుక్యుల కాలానికి దగ్గరగా ఉన్నాయని, అయితే ఇవి ఎక్కువగా స్థానికంగా చేయించినవి కావడం వల్ల భిన్నమైన శైలిలో ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షులు శ్రీరామోజు హరగోపాల్ స్ప ష్టం చేశారు. అయ్యదేవుని వెనుక, చేతు ల్లో పూజా ద్రవ్యాలతో ఒక్క శ్రీ శిల్పం ఉంది. అయ్యదేవుడు కొన్ని సార్లు దేవేరితో కనిపిస్తాడని, ఇక్కడ పూర్తి భిన్నంగా ఉన్నాడని తెలిపారు. స్థానికులు ఒక ముఠా గా ఏర్పడి ఇటీవలనే డిక్టేటర్ సహాయంతో త్రవ్వకాలు జరిపారని, రాత్రిళ్ళు చాలాసార్లు జంతు బలులు ఇచ్చారని స్థానికులు వెల్లడించారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/గూడూరు;** గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గూడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 15 వ తేదీ రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అందిన విశ్వసనీయ సమాచారంతో లక్ష్మీపురం గ్రామంలోని సిద్ధి వినాయక రైస్ మిల్ వద్ద తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో ఎపి 08యూజే 7989 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల పిడిఎస్ బియ్యం మొత్తం 25 క్వింటాళ్లను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ 75 వేలుగా పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా చిర్రకుంట తండాకు చెందిన కొర్రా వెంకన్న ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో పొనుగోడు గ్రామానికి చెందిన మేడి మల్లేశం తక్కువ ధరకు పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలించినట్లు వెల్లపైనట్లు పోలీసులు తెలిపారు.సిద్ధి వినాయక రైస్ మిల్ యజమానులు సామ వెంకట్‌రెడ్డి షేక్ అంకుష్‌లకు బియ్యా న్ని అప్పగించేందుకు తీసుకువచ్చినట్లు విచారణలో తేలి ందన్నారు. ఈవ్యవహారంలో సంబంధిత వ్యక్తుల పాత్రపై పోలీసులు మరింత విచారణ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ బాబు మాట్లాడుతూ పీడిఎస్ బియ్యాన్ని అక్రమంగా అక్రమంగా కొనుగోలు చేయడం నిల్వచేయడం రవాణా చేయడం విక్రయించడం చట్టరీత్యా నేరమని గూడూరు ఎస్ఐ హెచ్చరించారు.

## పేద కుటుంబాల కలలు నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేద కుటుంబాల కలలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందని మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరం లో పల్ల మహేష్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశాన్ని మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి పథకంతో పేదల జీవితాల్లో ఆశ, ఆత్మ విశ్వాసం, భద్రత కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు రామస్వామి, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడు యూసుఫ్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకల్లో చామకూర మల్లారెడ్డి



**ప్రజాపక్షం/కీసర :** క్రమశిక్షణ, నిరంతర కృషి, పట్టుదలే విద్యార్థుల భవిష్యత్తు నిజమైన పునాదులని మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి పేర్కొన్నారు. కీసర మండలం చిర్యాల గ్రామంలోని గాయత్రి జూనియర్ కాలేజ్ డిఫెన్స్ అకాడమీలో ఘనంగా నిర్వహించిన ఫ్రెషర్స్ డే నూతన విద్యార్థుల ఆహ్వానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ పలు కీలక సూచనలు చేశారు. జూనియర్ కాలేజీ దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశసేవలో భాగస్వాములయ్యేలా డిఫెన్స్ అకాడమీ ద్వారా యువత క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందడం అభినందనీయమని కొనియాడారు. స్వయంకృషితోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, సమయాన్ని వృథా చేయకుండా చదువుపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా కాలేజీ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, డిఫెన్స్ అకాడమీ శిక్షకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం ఐక్యపోరు


రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం పటేల్ పిలుపు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్ పిలుపునిచ్చారు. కులాల వారీగా జనగణన జరగనున్న నేపథ్యంలో మున్నూరు కాపులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ మేరకు జవహర్ నగర్‌మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఆయన నూతన అధ్యక్షుడు కాశెట్టి మహేందర్ పటేల్, ప్రధాన కార్యదర్శి ఎలుగల మధుసూదన్ పటేల్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది మందితో మొదలైన సంఘం.. 200 మంది క్రియాశీల సభ్యులకు చేరడంపై ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వెల్పుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు మామిండ్ల శ్రీనివాస్, పర్వతనేని సతీశ్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వాసాల వెంకటేశ్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, జవహర్ నగర్ సంఘం ఉపాధ్యక్షులు మంచికంటి శేఖర్ పటేల్ తదితరులు హాజరయ్యారు.

## లాల్‌గడిలో ఘనంగా రేణుక విగ్రహ ప్రతిష్ట

ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేటలో గరుడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు విచ్చేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్‌పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, వైస్‌చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, తుంకి రమేష్, కమఠం కృష్ణారెడ్డి లను శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముద్దం సుధాకర్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, స్వప్న రాంప్రసాద్ గౌడ్, తలారి మౌనిక బాబు, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు బొమ్మక్ శ్రీనివాస్, చీరాల శ్రీనివాస్, కోడూరి దినేష్, గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** మైనర్ బాలికపై లైగింక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నుండి బదిలీ అయిన కేసును కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో పునఃనమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు అభిషేక్(24) మైనర్ బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ కేసుల్లో అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితునిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోనబడతాయని,బాధితురాలు మైనర్ కావడడంతో ఆమె వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# మహానగరంలో దోమల బెడద

- మూసీనది పరీవాహక ప్రాంతంలో పరిస్థితి దారుణం
- గాంధీ ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులతో పాటు బస్తీ దవాఖానాలకు పెరుగుతున్న డెంగీ బాధితుల సంఖ్య



**హైదరాబాద్ :** వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటంతో దోమలు వృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది. అలా మహానగరం అంతటా దోమలు ప్రస్తుతం స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ దోమల బెడద ఎక్కువగా ఉండటంతో సమస్య తీవ్రంగా మారింది. ప్రధానంగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గాంధీ ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులతో పాటు బస్తీ దవాఖానాలకు డెంగీ బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది. జిహెచ్‌ఎంసి, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 270 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు మున్సిపల్ శాఖలోని ఎంటమాలజీ విభాగం దోమల నివారణకు సమన్వయంతో పనిచేయాలి. కానీ కొందరు అధికారులు మాత్రం సమావేశాలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కువగా ఫిర్యాదులు వచ్చే ప్రాంతాల్లోనే అడపాదడపా ఫాగింగ్ చేసి వదిలేస్తున్నారు. కానీ జిహెచ్‌ఎంసి, ఆరోగ్యశాఖ సంయుక్తంగా యాంటీ లార్వా ఆపరేషన్లు, నివాస ప్రాంతాల్లో ఫాగింగ్, ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాల్సి ఉంటుంది. అవి చేయకపోవటంతో నగరంలో చాలా ప్రాంతాలు లార్వా వృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి.

### దోమల నివారణ

☞ వానాకాలంలో జిహెచ్‌ఎంసి, వైద్య ఆరోగ్యశాఖ కలిసి సమన్వయంతో పనిచేయాలి.

☞ డెంగీ, చికున్‌గన్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల కేసులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.

☞ అధిక ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్లు, రసాయనాలు స్ప్రేయింగ్‌తో పాటు ఫాగింగ్ చర్యలను తక్షణమే చేపట్టాలి.

☞ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, మందుల కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

☞ అధికంగా నీరు నిలిచే నివాస ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేయాలి. అక్కడ దోమల లార్వాపై డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేయాలి.

## ఉప్పల్‌లో స్టార్ హీరోయిన్ శ్రీలీల సందడి

పిహెచ్‌టి షాపింగ్ మాల్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ పిహెచ్‌టి షాపింగ్ మాల్ మరో నూతన బ్రాంచ్ ఆదివారం ఉప్పల్‌లో ఆర్భాటంగా ప్రారంభమైంది. మాల్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన స్టార్ హీరోయిన్ శ్రీలీల సందడి చేశారు. మాల్ మేనేజింగ్ పార్టనర్స్ గడ్డం వెంకటేష్, చిరాన్దాసు, ధనుంజయ, వనం నరసింహా, గోషిక కృష్ణ, గుజ్జా సత్యనారాయణలు నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాల్‌ను ప్రారంభించారు. శ్రీలీల రాకతో ఉప్పల్ బస్‌స్టాప్ పరిసరాలు అభిమానులతో కిక్కిరిసి పోయాయి. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో మాల్ ప్రాంగణ పరిసరాల ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. అభిమానులు హీరోయిన్‌తో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపటంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ప్రారంభోత్సవంలో భాగంగా శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాల్లో కలియ తిరుగుతూ పట్టు వస్త్రాలు, చీరలు, ఇతర వస్త్రాలను పరిశీలించారు. మాల్‌లో తిరుగుతున్న సమయంలో తన కోసం వచ్చిన అభిమానులకు మాట్లాడుతూ కరచాలనాలివ్వటంతో పాటు వారితో కలిసి ఫొటోలు దిగుతూ ఆనంద డోలికల్లో ముంచెత్తారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చి అభిమానులను నేరుగా కల్సుకోవటం తనకు ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ తనపై కనపరచిన ప్రేమాభిమానాలకు నటి శ్రీలీల కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన పండుగలకు అడ్డంకులపై బిజెపిపై ఫైర్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గిరిజనులు ఏళ్లుగా నిర్వహిస్తున్న సాంప్రదాయ పండగలను అడ్డుకోవడం సరికాదని గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాము నాయక్,మాజీ ఉపాధ్యక్షురాలు ధారవత్ అనుజ అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌ఎఫ్సీనగర్ బ్యూటీనెస్ట్ కాలనీలో గిరిజన కుటుంబాలు ఆరేళ్లుగా పార్కు స్థలంలో తీజ్,శీత్ల పండుగలు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహిస్తున్నారని తెలిపారు.గత రేండుళ్లుగా స్థానిక బిజెపి నాయకుడు మహిపాల్‌రెడ్డి మరికొందరు నాయకులు పండగలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్కు స్థలాన్ని కబ్జా చేశారంటూ గిరిజనులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు. అడ్డంకులు కొనసాగితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని అన్నారు. కార్యక్రమంలో చందర్, గుగులోత్ తిరుపతి, భుక్య రాజీ మాలోత్ రాజు,పాల్గొన్నారు.



## బిఆర్‌ఎస్ మరోసారి అధికారం చేపట్టడం తథ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగి పోయి మరో సారి బిఆర్‌ఎస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని, రాష్ట్రంలో బిఆర్‌ఎస్ రెండవ సారి అధికారం చేపట్టటం తథ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. వివిధ పార్టీల నుండి కార్యకర్తలు, యువత బిఆర్‌ఎస్‌లో చేరి ముందుకు నడిపించేందుకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగి పోవటమే దీనికి నిదర్శనమన్నారు. బిఆర్‌ఎస్‌లో ఆదివారం చేరిన మాశెట్టి అనిల్ ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ పలువురు యువకులకు ఎమ్మెల్యే గులాబి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, కెసిఆర్ చేపట్టిన పథకాలు, ప్రజారంజక పాలన గురించి ప్రజల ముందుంచటం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

## మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా స్వప్న

**ప్రజాపక్షం/బంట్వారం :** రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ గోపాల్, జిల్లా అధ్యక్షురాలు నందిని నరేందర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి నగేష్ అధ్వర్యంలో బంట్వారం మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా మంగలి స్వప్న నర్సిములు అదివారం ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపధ్యక్షులుగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, కోశాధికారిగా రియజుద్దీన్, ఉమ్మడి కార్యదర్శిగా అభి, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.



## నాగారంలో 21 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** నాగారం డివిజన్ పరిధిలోని సుచిత్ర కాలనీలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో రూ.21 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు.కాలనీలో డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి,భూమయ్యయాదవ్,బాల్‌రాజ్‌యాదవ్,శ్రీశైలం, పరమేశ్, బాలనర్సింహ,రమేష్,ప్రవీణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి!

ముబారక్పూర్ గ్రామ సర్పంచ్ జామ జయయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రభుత్వ పెన్షన్‌కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని నవాబుపేట్ మండలంలోని ముబారక్ పూర్ గ్రామ సర్పంచ్ జామ జయయ్య సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని అర్హులైన వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితరులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారు తమకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ విషయాన్ని సద్వినియోగం చేసుకొని, పెన్షన్‌కు అర్హత ఉన్న వారు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని జామ జయయ్య ఒక ప్రకటనలో కోరారు.

## నేడు బాలాజీ నగర్ సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** బాలాజీ నగర్ 33/11 కేవీ బాలాజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శివాజీ నగర్ ఫీడర్ కింద నిర్వహణ పనులు, పిఎమ్‌ఐ పనులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా తేదీ 17082026 న విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బాలాజీ నగర్ అసిస్టెంట్ ఇంజనీర్ హెచ్. సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10:00 గంటల నుండి 11:00 గంటల వరకు 1 గంట పాటు ఫీడర్: 11 కేవీ శివాజీ నగర్ ఫీడర్ ప్రభావితమయ్యే ప్రాంతాలు: కెసిఆర్ మార్కెట్ రోడ్ ఎదురుగా ఉన్న ప్రాంతం, సంతోష్ నగర్, సుక్కమ్మ కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, శివాజీ నగర్, సుభద్రమ్మ కాలనీ, భద్రయ్య వెంచర్, కళ్యాణ్ సులోచన, కళ్యాణ్ రాఘవ, వికే ఎన్‌క్లేవ్ మరియు వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, ఈ శ్రమదాన పనులకు వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు. సేవలకు కలిగే అంతరాయానికి చింతిస్తున్నామని తెలిపారు.

## పింఛన్‌లకు దరఖాస్తుల స్వీకరణ

- గ్రామ పంచాయతీల్లో, మున్సిపాటీల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అర్జీలు స్వీకరణ
- ఈనెల 31వరకు అవకాశం ,అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా 20 మండలల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో, నాలుగు మున్సిపల్‌ల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న, చేయుత పింఛన్ల పథకంలో భాగంగా 14 నుండి కొత్త లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరించానున్నారు. ఈ నెల 31 వరకు అర్హులైన వారు దరఖాస్తులు సమర్పించుకోవలని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో జిపిలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాలతో పాటు ఎంపిడిఒ, తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామపంచాయతీలోని కార్యదర్శిలకు అర్జీలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందులో ముఖ్యంగా వృద్ధులు ఒంటరి మహిళలు వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఫ్లైలేరియా బాధితులు, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, రేషన్ కార్డు ఆధాయ, నివాస ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు అవసరమైతే వైద్య ధ్రువపత్రాలు జతచేయల్సి ఉంటుందన్నారు. జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు సంఖ్య చేనేత కార్మికులు142, దివ్యాంగులు 12,326, వితంతువులు 48,508 వృద్ధులు 39,665 ఒంటరి మహిళలు 4,564 , కల్లుగీత కార్మికులు 403, హెచ్ఐవి రోగులు 1,130 , బోధకాలు 134 , డయాలసిస్ 181 మొత్తం 1,07,113 మంది ఇప్పటి వరకు పింఛన్లు పోందుతున్నారు. ఎవరైన ప్రజాపాలన, ప్రజావాణి, గ్రామసభల్లో అవసరమైన పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు పరిశీలిన అనంతరం అర్హుల జాబితాను అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనుంది. సర్కారు అమోదం లభించిన వారికి కొత్త పింఛన్లు మంజూరు కానున్నాయి. ఈనెల 31వరకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకునేల ఎంపిడిఒలు అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించేలా చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు.

## నేడు తహసీల్దార్‌కు వినతిపత్రం

**ప్రజాపక్షం / బొంరాస్పేట్ :** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్పేట్ మండల బిజెపి అధ్వర్యంలో రేషన్‌కార్డులో ప్రధాన మంత్రి ఫొటోను ముద్రించాలని మండల పార్టీ అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్‌సాగర్ అధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇవ్వలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గోనలని కోరారు.

## భక్తిశ్రద్ధలలో రంగనాయకుడి కల్యాణం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఎదులాబాద్ గ్రామంలోని శ్రీగోదా సమేత మన్నార్ రంగనాయక స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదా రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. పట్టు వస్త్రాలు ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు వజ్రేష్ యాదవ్ తెలిపారు. బ్రహ్మోతవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఎదులాబాద్, ఘట్‌కేసర్, పోచారం డివిజన్ అధ్యక్షులు సామల అమర్,బొక్క ప్రభాకర్ రెడ్డి, కర్రె రాజేష్,ఘట్‌కేసర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి,ప్రవీణ్ రావు,తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తుకు రూ.50 ఇచ్చుకోవాల్సిందే


పింఛన్ దరఖాస్తు దారుల నుంచి వసూలు చేస్తున్న బంట్వారం పంచాయతీ కార్యదర్శి

జనన, మరణ ధృవీకరణ పత్రాలు కావాలన్నా అధికారులు చేతులు తడపాల్సిందే



**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వా రం మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి పింఛన్ దరఖాస్తుకు రూ.50 వసూలు చేయిస్తున్నట్లు గ్రామస్తులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ దరఖాస్తుకు ఎలాంటి రుసుం లేకుండా ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి మీరేదు కు డబ్బులు వసూలు చేయిస్తున్నారని గ్రామ యువకులు నిలదీశారు. పింఛన్ వరఖాస్తూకు రూ.50 ఇవ్వాలని ఏదైన నిబంధన ఉంటే మాకు రశీదు అందించాలని, మరి మీరు రశీదు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆసరా కోసం దరఖాస్తూ చేసుకునే సమయంలో కార్యదర్శి నిర్వహక వైకరి గ్రామంలో చర్చనీయాంశంగా మారిం ది. పింఛన్ దారులు తమ వెంట తెచ్చుకున్న జిరాక్స్ కాగితాలు చెల్లవని సిబ్బం ది దగ్గర యాభై రూ.లు చెల్లించి తీసుకోవాలని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోంటున్న లబ్ధిదారుల నుంచి పింఛన్ ఫారం కోసం డబ్బులు వసూలు చేయడం పట్ల గ్రామస్తులు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తూన్నారు. అంతేకాకుండా మండల పరిధిలో ఉన్న అయా గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు, కింది స్థాయి సిబ్బంది సహితం జనన, మరణ ధృవీకరణ పత్రా లు, అందించాలంటే తప్పనిసరిగా వారి చేతులు తడిస్తేనే జనన, మరణ ధృవీకరణ పత్రం వెంటనే అన్‌లైన్ చేసున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే కాకుండా ప్రజలు తమ ఆధార్ కార్డులో తమ చిరునామాను మార్చలని ఆధార్ ఫారంపై సంతకం కోసం వెళ్లిన, కాల్యాణ లక్ష్మీ, షాధీ ముభారక్ పత్రాలపై సంతకాలు కావాలన్నా టాక్స్ చెల్లిస్తే తప్ప ఆ పత్రాల పైన సంతకాలు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. బంట్వారం గ్రామానికి చెందిన పి శ్రీనివాస్ మాట్లాడుతూ జిరాక్స్ సెంటర్లలో 10 రూ.లకు లభించే ఫారం పంచాయతీ కార్యదర్శి రూ.50 తప్పనిసరిగా అడగడమేంటని సంబందిత మండల స్థాయి అధికారులు మండల కేంద్రంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణి పింఛన్ దారుల వద్ద తమ సిబ్బంది చేత వసూలు చేస్తున్న విషయం పట్ల విచారణ జరిపి కార్యదర్శి పైన తగిన చర్య తీసుకోవాలని పేర్కోన్నారు.

## భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రధానిగా భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి చేపట్టిన సంస్కరణలు, సేవలు చిరస్మరణీయమని వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరాండబరం, దేశభక్తి, ప్రజాసేవ, విలువలతో కూడినరాజకీయాలకు ఆయన ప్రతీకగా నిలిచారన్నారు. ఆయన ఆదర్శాలు, ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగు జాడల్లో ముందుకు నడుద్దామని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు ఓం ప్రకాష్, సాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారెగూడా అంగన్‌వాడీ టీచర్ రాజీనామా

ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిశాక విధుల్లో చేరుతానని పైరవీలు

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓటరు సవరణ కార్యక్రమానికి ముందే నవాబుపేట మండలం నారెగూడ గ్రామ అంగన్‌వాడీ టీచర్ ఎల్లమ్మ తన పదవికి రాజీనామా చేశారు. దాంతో అంగన్‌వాడీ టీచర్‌కు అదనంగా ఉన్న బిఎల్ఓ పోస్టును తొలగించి అదే గ్రామానికి చెందిన గంగ్యాడ కృష్ణను బిఎల్ఓగా నియమించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కొత్తగా నియమించిన బిఎల్ఓ కృష్ణతో ఓటరు సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయించినట్లు తహసిల్దార్ బుచ్చయ్య పేర్కొన్నారు. అకస్మాత్తుగా ఎస్ఐఆర్‌కు దుమ్మా కొట్టిన అంగన్‌వాడీ టీచర్ ఎల్లమ్మ విషయమై ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసిల్దార్ తెలిపాడు. ఓటర్ సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ముందు అకస్మాత్తుగా తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన ఎల్లమ్మ.... ఓటర్ సవరణ పూర్తి అయిన అనంతరం తాను మళ్లీ పని చేస్తానని తనను విధుల్లోకి తీసుకోవాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. ఆమె రాజీనామా చేసి రెండు నెలలు అవుతున్న ఐసిడిఎస్ అధికారులు రాజీనామాను ఆమోదించక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజీనామా చేసి రెండు నెలల అవుతున్నా ఐసిడిఎస్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజీనామా విషయమై సిడిపిఒ శ్రీలతను సంప్రదిస్తే రాజీనామా విషయమై డిడబ్ల్యూఓ కాంతారావు నివేదించినట్లు పేర్కొంటున్నారు. బిడబ్ల్యుఒను సంప్రదిస్తే రాజీనామా విషయం. రాజీనామా లెటర్ సిడిపిఒ మనకు ఇంకా పంపలేదని పేర్కొనడం గమనార్హం. బాధ్యత గల అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలకు తవిస్తుంది. అంగన్‌వాడీ టీచర్ రాజీనామా చేయడంతో గత రెండు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రం మూతపడింది. దాంతో కేంద్రానికి వచ్చే పిల్లలకు గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందకుండా పోయింది. పాలు, గుడ్లు, బాలామృతం తదితరవ వస్తువులు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



'నారి నారి నడుమ మురారి', 'బైకర్' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకున్నశర్వానంద్ తొలిసారిగా దర్శకుడు శ్రీను వైట్లతో జతకట్టారు. ఏటీవి సమర్పణలో, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

రీల్



## 'ధర్మో రక్షతి రక్షితః' పాట ఆవిష్కరణ

ధర్మపురి నియోజకవర్గం' చిత్రంలోని 'ధర్మో రక్షతి రక్షితః ' పాటను ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి , ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్ర బోస్ సంయుక్తంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.సినిమా కథాంశానికి అనుగుణంగా రూపొందించిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని చిత్ర బృందం తెలిపింది ధర్మో రక్షతి రక్షితః. పాట విడుదల కార్యక్రమంలో చిత్ర దర్శకులు జై జ్ఞాన ప్రభ తోట, చిత్ర నిర్మాత మెరుగు భాస్కర్ సినిమాకి దర్శకుడు యేలేందర్ , సినిమాటో గ్రాఫర్ వెంకట్ హనుమ, అతో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొని, సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నటరాజ, రాయంచ కొర్కుర, సుమన్, సాయికుమార్, రాజీవ్ కనకాల , రాజా రవీంద్ర, శివకుమార్ రామచంద్ర వారపు,వివేక షేర, వరుణ్ సందేశ్, కస్తూరి, పోలీస, కాలకేయ ప్రభాకర్, షఫీ, ఛత్ర పతి శేఖర్ ఐ డ్రీమ్ అంజలి, సత్య ప్రకాశ్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: చంద్రబోస్, గానం: సాయి చరణ్, ఛాయాగ్రహణం: వెంకట హనుమ, ఫైట్స్: నందు మాస్టర్, మాటలు: అస్లాం, ఎడిటింగ్: సాయిబాబు తలారి, సంగీతం; మహా వీర్ యేలేందర్ .

## కొన్ని సినిమాలను వసూళ్లతో కొలవలేము

### 'విశ్వనాథ్ అండ్ సన్స్' 'సక్సెస్ మీట్' లో హీరో సూర్య



తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. రాధిక శరత్కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ వేదికలో ప్రముఖ దర్శకులు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు భవిష్యత్తులో ఐకానిక్ సీన్స్ గా మిగిలిపోతాయి. ఒక్క ఏడాది వ్యవధిలో కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్ లాంటి రెండు పూర్తి విభిన్న సినిమాలు చేశారు. ఇప్పుడు తమిళ సినిమా, తెలుగు సినిమా, హిందీ సినిమా అనే హద్దులు లేవు. ఇప్పుడు అన్ని భాషలు కలిసి ఇండియన్ సినిమా అయింది. ప్రపంచ వేదికపై భారతీయ సినిమా సత్తా చాటాల్సిన సమయం ఇది. ఆ దిశగానే మేమందరం పని చేస్తున్నాం అన్నారు. కథానాయకుడు సూర్య మాట్లాడుతూ ఫ్యామిలీ సినిమాలకు ప్రేక్షకులు మళ్ళీ లైఫ్ ఇచ్చారు. అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుంది. మా అందరికీ ఫ్యామిలీ జానర్ ఎంత ముఖ్యమో మళ్ళీ తెలియజేసింది ఈ సినిమా. ఫ్యామిలీ సినిమాల విషయంలో త్రివిక్రమ్ స్ఫూర్తి ఎంతో ఉంటుంది.కొన్ని సినిమాలను వసూళ్లతో కొలవలేము. ప్రేక్షకులు పొందిన అనుభూతిలోనే ఈ సినిమా అసలు విజయం దాగుంది. వెంకీ రచనకు హ్యాట్సాఫ్. అలాగే తెలుగు ప్రేక్షకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. నటి రవీనా టాండన్, దర్శకుడు వెంకీ అట్లూరి , నిర్మాత సూర్యదేవర నాగవంశీ పాల్గొన్నారు.

## 'ధరణి ఐ లవ్ యూ' షూటింగ్ పూర్తి



హెచ్ఎస్ క్రియేషన్స్ బ్యానర్ 'అనగనగా ఒక ఊళ్లో' చిత్రానికి దర్శకత్వం వహించిన సాయి కృష్ణ కె.వి దర్శకత్వంలో రాజశేఖర్ మద్దికుంట నిర్మిస్తున్న తాజా చిత్రం 'ధరణి ఐ లవ్ యూ' షూటింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. బొమ్మరాశిపేట, ఎల్లగూడ, ఉద్దమర్రి, లాల్లామిడకట్టెల్, శామీర్పేట్, తూప్రాన్, వెంకటరత్నాపురం తదితర ప్రాంతాల్లోని అందమైన లోకేషన్లలో చిత్రీకరణను పూర్తి చేసినట్టు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో వంశీ ఆకుల హీరోగా, మహిత హీరోయిన్గా నటిస్తున్నారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి.పట్నాయక్ ఒక సెంటిమెంట్ సాంగ్ పాడటం జరిగింది..త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేయనున్నారు. అర్చనా లోహా, ఆమని, విహార్ కుమార్, మధుసూదన్, సత్య ప్రకాష్, దేవి ప్రసాద్, అశోక్ కుమార్, బలగం సంజయ్, చిత్రం శ్రీను, పేకింగ్ శేషు, చిట్టిబాబు, రాజశేఖర్ మద్దికుంట, బాల సూర్య, పార్వతి, శకుంతలమ్మ, స్మృతి పాండే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకుంటుండటంతో సినిమా విడుదలకు సంబంధించిన వివరాలను, ఫస్ట్ లుక్ పోస్టర్ను త్వరలోనే చిత్రబృందం ప్రకటించనుంది. ఈ చిత్రానికి సమర్పణ: శ్రీమతి బాలామణి, మాటలు: కామన వి.సాయి, బాలసూర్య, పాటలు: ఉమా వంగూరి, చాందిని, ప్రసాద్ సానా, విశ్వనాథ్, సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్, ఎడిటింగ్: నందమూరి హరి, ఎస్.టీ.ఆర్,సినిమాటోగ్రఫీ: చిన్నయోగి అన్నం.

## 'ఫౌజీ' పోస్టర్ రిలీజ్



రెబెల్ స్టార్ ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఫౌజీ' డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. హను రాఘవపుడి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టిసిరీస్ సమర్పిస్తున్న ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రానికి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. టైటిల్ పోస్టర్ నుండి ప్రీలుక్, ఫస్ట్ లుక్ వరకు, ప్రతి ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.'ఫౌజీ' చిత్ర నిర్మాతలు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బలమైన భావోద్వేగ, చారిత్రక నేపథ్యం ఉన్న పోస్టర్ను విడుదల చేశారు. భారతదేశం నేడు జరుపుకుంటున్న స్వాతంత్ర్యం వెనుక ఉన్న త్యాగానికి నివాళిగా నిలిచిన ఈ పోస్టర్ అందరినీ కట్టిపడేసింది.పోస్టర్లో ప్రభాస్ ముఖం కనిపించకపోయినా, ఆయన లుక్ మాత్రం పవర్ ఫుల్ ఉంది. రక్తం, మట్టితో నిండిన దుస్తులతో, గాయాలతో కనిపిస్తున్న ప్రభాస్.. రెండు చేతుల్లో రెండు చిన్న తుపాకులు పట్టుకుని, చెప్పులు లేకుండా ధ్వంసమైన వీధుల్లో నడుస్తున్నారు. ఆయనకు ముందుగా సంప్రదాయ భారతీయ దుస్తుల్లో మరో వ్యక్తి చేతిలో పొడవాటి కర్రతో నడుస్తూ కనిపించారు.
స్వతంత్రం కోసం పోరాడిన ప్రతి ఫౌజీకి నివాళి అర్పించారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్గా నటిస్తున్నారు. ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తున్నారు. అనిల్ విలాస్ జాదవ్ ప్రొడక్షన్ డిజైన్, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాధ్యతలు చూస్తున్నారు.



## రూ. కోటి ముప్పై లక్షల గ్రాస్ వచ్చింది

### 'హుషారు పిట్టలు' సక్సెస్ మీట్ లో నిర్మాత సురేష్ బాబు

'అన్స్, వాసవి గణేషన్ జంటగా రూపొందిన యూత్ఫుల్ ఎంటర్టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఆగస్ట్ 15న భారీ ఎత్తున విడుదలైంది. గత నాలుగైదు రోజులుగా వేస్తున్న ప్రీమియర్లకు ఆల్రెడీ అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక సినిమా రిలీజ్ అయిన తర్వాత సక్సెస్ ఫుల్గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో ఆదివారం నాడు సక్సెస్ మీట్ను నిర్వహించారు. నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ ''హుషార్ పిట్టలు' సినిమాని ఇప్పటి వరకు లక్ష మంది చూశారు. దాదాపు కోటి ముప్పై లక్షల గ్రాస్ వచ్చింది. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ సినిమాని చూస్తారు. ప్రీమియర్ల నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. టీజర్, ట్రైలర్ ద్వారా మంచి బజ్ ఏర్పడింది. సక్సెస్ అవ్వడంతో టీం అంతా సంతోషంగా ఉంది. చాలా ఏళ్లకి మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్కి బ్రేక్ వచ్చింది. ఇంకా పది, ఇరవై లక్షల మంది సినిమాని చూస్తే టీంకు లాభాలు వస్తాయి అన్నారు. ఈ సక్సెస్ మీట్ లో బెక్కం వేణుగోపాల్, దర్శకుడు భిక్షు, నిర్మాత వెంకట్ యాదవ్, హీరో అన్స్, హీరోయిన్ వాసవి గణేశన్ సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## 'అ' ఫస్ట్ లుక్ విడుదల..



స్టార్ బాక్స్ స్టోరీస్, రిప్పుల్ స్లైడ్ స్టూడియోస్ తొలిసారిగా ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కనకరావు తొనంగి, అభిషేక్ , ప్రముఖ ఎడిటర్‌డైరెక్టర్ గ్యారీ నిర్మిస్తున్నారు. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్కు సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'అ' అనే ఆసక్తికరమైన టైటిల్ను హీరో అడివి శేష్ ఆవిష్కరించారు. టైటిల్ చుట్టూ 'అమ్మాయి, అదృశ్యం, అన్వేషణ' అనే పదాలను పొందుపరిచారు. అమ్మాయిలు అదృశ్యం కావడం, ఆ తర్వాత జరిగే దర్యాప్తు చుట్టూ కథ తిరుగుతుందని ఈ పదాలు సూచిస్తున్నాయి. ఇక ఫస్ట్ లుక్ ఈ క్యూరియాసిటీని మరింత పెంచింది. రాహుల్ విజయ్ ఓ ప్రదేశంలో చేతిలో లాఠీ పట్టుకుని కూర్చుని కనిపిస్తున్నారు. ఆయన చుట్టూ నేలంతా రక్తపు మరకలతో కనిపిస్తోంది. ఈ ఇంటెన్స్ విజువల్కు బ్యాక్గ్రౌండ్లో చార్మినార్ కనిపించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీంతో ఈ థ్రిల్లర్ కథ హైదరాబాద్ నేపథ్యంగా సాగుతుందని అర్థమవుతోంది.శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా, మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.

### యువతను అణిచివేస్తే

## ''మిలిటెంట్ పోరాటాలు తప్పవు''

### ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. వలి ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హక్కుల కోసం ప్రశ్నించే యువతను అణిచివేస్తే మిలిటెంట్ పోరాటాలు తప్పవని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. వలి ఉల్లా ఖాద్రీ హెచ్చరించారు. భవిష్యత్తు ద్వారాలను బద్దలు కొట్టేందుకే నేడు దేశంలో యువత తిరుగుబాటు ప్రారంభించిందని తెలిపారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఆదివారం ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా 25వ మహాసభలు జిల్లా అధ్యక్షులు ఆర్. బాలకృష్ణ అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వం, హక్కులను కాపాడుతున్న భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని ప్రధాని మోదీ నేతృత్వంలోని నిరంకుశ బిజెపి ప్రభుత్వం ఖునీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే ప్రగతిశీల, ప్రజాస్వామ్యవాద శక్తులను లక్ష్యంగా దిమాగీ నక్సల్స్ అనే ముద్రను వేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలిపారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని యువతను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, మతం పేరుతో యువతను తప్పు దారి పట్టించడం తప్ప వారికి చేసింది ఏమిలేదని అన్నారు. బిజెపి అసలురంగు తెలుసుకున్న యువత తిరుగుబాటు చేస్తున్నారని, నైతిక విశ్వాసం సంఘటిత పోరాట రూపం దాల్చినప్పుడే సంఘీభావం ఒక విప్లవాత్మక శక్తిగా మారుతుందన్నారు. ప్రధాని మోదీను గద్దె దించే శక్తి యువతకు మాత్రమే ఉందని, విద్యార్థి, యువత ఏకమై నియంతృత్వ కాషాయ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనపాలని వలి ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, నాయకులు షేక్ మమూద్, మాజీద్ అలీ ఖాన్, కే మహేష్, కే కళ్యాణ్, మామిడి చెట్ల భగత్ సింగ్, ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### టెక్నాలజీతో న్యాయవ్యవస్థ

## పునర్నిర్మాణ కేంద్రంగా నిష్పక్షపాతం

- ఎ.ఐ బోధన–వినియోగంలో న్యాయవిద్య అగ్రభాగాన ఉండాలి
- సాంకేతికత న్యాయవ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దుతుంది
- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఉద్ఘాటన



**జోధ్‌పూర్:** సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు వీలుగా న్యాయ వ్యవస్థను పునర్నిర్మించడంలో నిష్పక్షపాతం, విచక్షణ, మానవత్వం కేంద్రంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. జోధ్‌పూర్‌లో ఆదివారం నేషనల్ లా యూనివర్సిటీ 2.0 వైస్–ఛాన్సలర్స్ సదస్సులో జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగిస్తూ,న్యాయ పాఠ్యాంశాల ప్రణాళికలో,బోధనా పద్ధతులలో కృత్రిమ మేధను ఉపయోగించడంలో చాలా బాధ్యత పాటించాలని కోరారు. న్యాయ విద్యాలయాలు నూతన సాంకేతికత పరివర్తనలో అగ్రభాగాన ఉండాలన్నారు. కేవలం కృత్రిమ మేధపైన మాత్రమే ఆధారపడే న్యాయ విద్యార్థులు విద్యాభ్యాసంలో తన స్వీయ శక్తిసామర్థ్యాలను కోల్పోతారని హెచ్చరించారు. అదేసమయంలో అనివార్యంగా మారిన సాంకేతిక మార్పులను తిరస్కరించే సంస్థలు వాటిని తీర్చిదిద్దుకోవడంలో అవకాశాలను నష్టపోతాయన్నారు. న్యాయ విశ్వవిద్యాలయాలు తమ దిశను మార్చే సాంకేతికత అభివృద్ధి కోసం ఎదురుచూడకుండా సాంకేతికతను న్యాయ విలువలకు అనుగుణంగా మార్చుకోవాలన్నారు.న్యాయ సంస్థలను, సేవలను సాంకేతికత మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతుందన్నారు. న్యాయవిద్యాగ్రాడ్యుయేట్లు సాంకేతికతను న్యాయవ్యవస్థలో అంతర్భాగంగా చేర్చి ఉపయోగించడంలో అగ్రభాగాన ఉండాలని,న్యాయవ్యవస్థ పునర్నిర్మాణంలో తీర్పులలో నిష్పక్షపాతం,విచక్షణ,మానవత్వం ప్రస్ఫుటంగా కనిపించాలన్నారు. ఈ మూడు అంశాలు న్యాయవ్యవస్థకు కీలకంగా ఉంటాయన్నారు.సాంకేతికతను ఉపయోగించుకోవడంలో వెనకబడకూడదని కోరారు. ''కేవలం ముందంజలో ఉండి సాంకేతికతను అనుసరించినంత మాత్రాన సరిపోదు,కీలకమైన మూల విలువలకు అనుగుణంగా సాంకేతికతను సద్వినియోగం చేయాలి, కృత్రిమ మేధకు సంబంధించిన పరికరాలు ఉపయోగించకుండా, సంబంధిత విద్యను న్యాయవ్యవస్థలో ప్రవేశపెట్టకుండా ఇంకెంతమాత్రం దూరంగా ఉంచలేం,దానిని నిర్ద్వంద్వంగా తిరస్కరించడం సాధ్యం కాదు''అన్నారు.
విద్యాపరమైన చిత్తశుద్ధితోపాటు న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ వినియోగించడంలో చాలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే కృత్రిమ మేధను ఉపయోగించి సృష్టించే సాక్ష్యాలు,నేరాలు కనిపెట్టడంలో విచక్షణతో,విలువలతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.ఈ నూతన సాంకేతికత మనకోసం ఎదురుచూడదని,అది శరవేగంగా మారుతూ,విస్తరిస్తూ, ప్రభావం చూపిస్తూ ఉంటుందని, అందువల్ల మన వ్యవస్థాగతమైన సదుపాయాలకోసంఎదురుచూసే ధోరణిలో దీనిని ఉపయోగించకుండా దూరంగా పెట్టకూడదన్నారు.
వేలకొద్దీ ఉన్న న్యాయ సంప్రదాయాలు,అనుభవాలను సెకన్ల సమయంలో అధ్యయనం చేసి తన అధీనంలోకి తెచ్చుకునే కృత్రిమ మేధ పరికరాలను, వాటి సామర్థ్యాలను న్యాయ విద్యా గ్రాడ్యుయేట్లు పలు పార్శ్వాలలో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. కృత్రిమ మేధ న్యాయపరంగా ఉన్న నియంత్రణ సమస్యలను,సులభంగా గుర్తిస్తుందని, వివాదాలను పరిష్కరించే యంత్రాంగంలో న్యాయస్థానాలకు ఈ పరికరాలు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు.సాంకేతికపరమైన సాధనాలను అర్థం చేసుకుని వాటిపై ఆధారపడేవారు సంబంధిత ఫలితాలను అర్థం చేసుకున్నవారు గుడ్డిగా అనుసరించకుండా ధృవీకరణల ద్వారా స్వయంనిర్ణయాధికార శిక్షణ పొందాలని, అప్పుడే వారు బాధ్యతతో నిష్పక్షపాతంగా ఉంటారన్నారు.

## యుజిసి - నెట్ జూన్ పరీక్షల 'ఆన్సర్ కీస్' విడుదల చేసిన ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జూన్ నెలలో జరిగిన యుజిసి–నెట్ పరీక్షల ''ఆన్సర్ కీస్''ను నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) విడుదల చేసింది. ఎక్స్ వేదికగా ఎన్‌టిఎ ఆదివారం ఒక పోస్టింగ్ పెడుతూ,84 సబ్జెక్టులకు సంబంధించి విడుదల చేసిన తాత్కాలిక సమాధానాలపై ఛాలెంజ్ విండో (ఎవరైనా సవాలు చేస్తే)ఆగస్టు 16వ తేదీ నుండి 18వ తేదీ రాత్రి 11.59 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని తెలియజేసింది. అభ్యర్థులు ఒక ప్రశ్నకు రూ.200లు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలియజేసింది. మిగిలిన ఇంగ్లీషు,కామర్స్,సోషియాలజీ మూడు సబ్జెక్టులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించేందుకు వీలుగా ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ప్రశ్నాపత్రాలలో ఉండే వివిధ రకాల తప్పులపై వచ్చిన ఫిర్యాదులను ఈ కమిటీ పరిశీలిస్తుందని పేర్కొంది. దీంతోపాటు ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించి కమిటీ చేసిన సిఫార్సులకు అనుగుణంగా ఒక ప్రత్యేకమైన బహిరంగ ప్రకటనను ఆదివారం తర్వాత విడుదల చేస్తామని ఎన్‌టిఎ ప్రకటించింది. ఎన్‌టిఎ వెబ్‌సైటు ద్వారా ప్రచురితమైన అధికారిక సమాచారంపైన మాత్రమే అభ్యర్థులు ఆధారపడాలని కూడా తెలియజేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్,పిహెచ్‌డి ప్రోగ్రామ్ పోస్టుల కోసం అభ్యర్థుల అర్హతలను నిర్ధారించడానికి యుజిసి–నెట్ నిర్వహించారు. ఈ పరీక్షలలో రెండు ప్రశ్నాపత్రాలున్నాయి. పేపర్–1లో 50 ప్రశ్నలు ఉన్నాయి. ఇవన్నీ టీచింగ్ యాప్టిట్యూడ్,రీజనింగ్ సామర్థ్యం,జనరల్ ఎవేర్‌నెస్‌లపై ఆధారపడినవి. పేపర్–2లో పాఠ్యాంశాలకు సంబంధించిన 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రావిజినల్ ఆన్సర్ కీలను, ఛాలెంజ్ విండోను కూడా జాయింట్ సిఎస్ఐఆర్ యుజిసి నెట్ జూన్–2026 అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని ఎన్‌టిఎ తెలియజేసింది. ''దయచేసిన చాలా జాగ్రత్తగా వివరాలను సమీక్షించండి, 2026 ఆగస్టు 16 నుండి 18వ తేదీ రాత్రి 11.00 గంటల వరకూ అభ్యర్థులు తమ సవాళ్ళను సమర్పించడానికి అధికారిక పోర్టల్ అందుబాటులో ఉంటుంది'' అని ఎన్‌టిఎ తెలియజేసింది. ఉమ్మడి సిఎస్ఐఆర్–యుజిసి నెట్ జూన్–2026 పరీక్షలు జులై 17–18 తేదీలలో కంప్యూటర్ ఆధారంగా పరిగాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోస్ అర్హతలను నిర్ధారించడానికి ఈ పరీక్ష నిర్వహించారు. ఈ అర్హతలు సంపాదించుకున్నవారు అసిస్టెంట్ ప్రొఫెసర్గా, పిహెచ్.డిలలో దేశవ్యాప్తంగా సంస్థలో ప్రవేశాలకు అర్హులవుతారు.

## టిజి సేఫ్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు జిఒ నంబర్ 67ను, అలాగే 'టిజి సేఫ్'కు కమిషనర్గా అవినాశ్ మహంతిని నియమిస్తూ జిఒ 1135ను జారీ చేశారు. టిజి సేఫ్ ముందుగా క్యూర్ పరిధిలో ప్రారంభంకానుంది. టిజి సేఫ్కు కావాల్సిన సిబ్బందిని డిప్యూటేషన్, మరి కొన్ని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకోనున్నారు. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006', డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940'ల పరిధిలోని చట్టబద్ధ అధికారాలకు ఎటువంటి భంగం కలగకుండా రెండు డిపార్ట్‌మెంట్లను విలీనం చేశారు.

**టిజి సేఫ్‌లో ఆరు విభాగాలు**

'టిజిసేఫ్' పరిధిలో 6 కీలక విభాగాలు పని చేస్తాయి. డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ వింగ్, ఫుడ్ సేఫ్టీ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్,లీగల్ అండ్ ప్రాసిక్యూషన్ వింగ్, ల్యాబరేటరీ వింగ్, అడ్మినిస్ట్రేషన్ వింగ్ ను ఏర్పాటు చేశారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940' కింద లైసెన్సులు, తనిఖీలు, శాంపిల్ల పరీక్షలు, దర్యాప్తు బాధ్యతలు డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్ పరిధిలో ఉండగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ద్వారా లైసెన్సులు జారీ, నమోదు, తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలను ఫుడ్ సేఫ్టీ వింగ్ నిర్వహిస్తుంది. పోలీసు శాఖ నుంచి కేటాయించే సిబ్బందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పని చేస్తుంది. కోర్టు కేసులు, చట్టపరమైన సలహాల కోసం లీగల్ అండ్ ప్రాసిక్యూషన్ వింగ్, ఫుడ్ సేఫ్టీ ల్యాబ్, డ్రగ్స్ టెస్టింగ్ ల్యాబ్‌లను కలుపుతూ లాబొరేటరీ వింగ్, మానవ వనరులు, బడ్జెట్, ఖాతాల పర్యవేక్షణకు అడ్మినిస్ట్రేటివ్ వింగ్‌ను ఏర్పాటు చేశారు. తనిఖీల నిమ్మితం అవసరమైన పోలీసు సిబ్బందిని పోలీసు శాఖ నుంచి తీసుకోనేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. .

**రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు...**

టిఎస్ సేఫ్ ఆధునీకరణ, నిబంధనల సవరణ, కేడర్, ల్యాబ్, క్షేత్ర స్థాయిలో మౌలిక వసతుల అవసరం, తదితర అంశాలపైన అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీ తొలుత క్యూర్ పరిధిలో అంశాలను పరిశీలించి, రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి శాఖ అమలు తీరుపైన పలు సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనుంది.

## ఎదురు నిలిచిన యువత

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల మధ్య ఈ సంభాషణ జరిగింది. ఆ వీడియోతో పాటు హిందీలో రాహుల్‌గాంధీ హిందీలో పోస్టు చేస్తూ 'మోదీజీ హింసాత్మక పాలనకు వ్యతిరేకంగా, జవాబుదారీతనం కోరుతూ భారతీయ యువత ప్రదర్శించిన ధైర్యం, దృఢత్వం అభినందనీయం. వారు శాంతి, ప్రేమ, హాస్యంతో తమ గళాన్ని వినిపించారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన గాంధీ పేర్కొన్నారు.
'ప్రతి యువకుడి పట్ల, ముఖ్యంగా బిజెపి గుండాల అసభ్య ప్రవర్తన, దూషణలు, హింసను ఎదుర్కొని, చివరికి ప్రధానమంత్రికి క్షమాపణ చెప్పేలా ఒత్తిడికి గురైన యువతుల పట్ల నాకు గర్వంగా ఉంది' అని గాంధీ అన్నారు. కానీ ఇప్పుడు వారి గళాన్ని ఎవరూ అణచివేయలేరని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులతో సంభాషించే 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమం ఈనెల 22న పుణెలో జరగనుందని, ఈసారి ఇది ప్రత్యేకంగా యువతుల కోసం మాత్రమే ఉంటుందని రాహుల్ తెలిపారు. 'ఇప్పుడు యువతులు మాట్లాడతారు, దేశం వింటుంది' అని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. ఆగస్టు 5న విద్యార్థులను కలిసిన తర్వాత రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయనతో కలిసి మీడియా ముందు హాజరైన ఐదుగురు విద్యార్థులలో మోడల్ రియా అహిర్ కూడా ఉన్నారు. ముంబయిలో విద్యార్థుల నిరసనల సమయంలో పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటున్న ఆమె ఫోటో అప్పట్లో వైరల్ అయ్యింది. ఆన్‌లైన్ వేధింపులకు గురయ్యానని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఎల్‌పిజి ఉత్పత్తి పెంచండి..

(మొదటి పేజీ తరువాయి)

అందుకుంటాయి. దేశంలో ఉన్న రిఫైనరీ కంపెనీలలో 18 రిఫైనరీలు ప్రభుత్వం రంగ సంస్థలే. వీటికి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సిందిగా కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రిఫైనరీలలో అత్యధికంగా ఎల్‌పిజి ఉత్పత్తి చేసే సామర్థ్యం రిలయన్స్ సంస్థకు ఉంది. ఈ సంస్థ రోజుకు 18,000 టన్నుల ఎల్‌పిజి ఉత్పత్తి చేయగలదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిఫైనరీలో ఏడాదికి 33 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయగలదు. ఆ తర్వాత కోచిలోని బిపిసిఎల్ సంస్థ 4,800 టన్నులు, రష్యాకు చెందిన నయారా ఎనర్జీ సంస్థ 4,480 టన్నుల ఎల్‌పిజి ఉత్పత్తి చేయగలవు. ఈ మూడు కంపెనీలు కలిపి 27,280 టన్నుల ఎల్‌పిజి ఉత్పత్తి చేయగలవు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇండియాలో 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పిజి వినియోగమైంది. అంటే, రోజుకు సగటున 91,000 టన్నులు. వీటిలో 13.1 మిలియన్ టన్నుల ఎల్‌పిజి దేశీయంగా ఉత్పత్తి అయితే, మిగిలిన 21.3 మిలియన్ టన్నుల ఎల్‌పిజిని విదేశాల నుంచి దిగుమతి చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి దేశంలో చమురు ఉత్పత్తి, వినియోగంపై సమీక్ష జరుపుతుంది. దీనికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com